నవంబర్ 01-15, 2021
సంపుటి 02, సంచిక 02

తెలంగాణ జాగృతి

# తంగేడు

తెలుగు సాహిత్య పక్ష పత్రిక





తెలంగాణ జాతి గర్వించదగ్గ తొలితరం ఉద్యమకారుడు.
గొప్ప సాహితీ వేత్త , గ్రంథాలయోద్యమ నిర్మాత,

## శ్రీ వట్టికోట ఆళ్వారుస్వామి

(1 నవంబర్ 1915)

జయంతి సందర్భంగా ఆ ప్రజల మనిషికి ఘనంగా నివాళులు అర్పిస్తున్నాము.

*Printed, Published and Owned by : **KALVAKUNTLA KAVITHA***
Printed at : **HARSHITHA PRINTERS**, Khairatabad, Hyderabad - 500 004.
Published at : **TELANGANA JAGRUTHI,** Pasham Amruthaaram Residency, H.No. 1-2-234/13/46/4, 3rd Floor, Near NTR Stadium Aravind Nagar, Domalguda, Hyderabad - 500 029. Telangana State.
Editor : **KALVAKUNTLA KAVITHA**
#1850845

## విషయ సూచిక

# తంగేడు



ఇతరులకు సేవ చేయడంలోని ఉన్నతిని కథగా తెలిపిన **పి.వి.వి....**
21 **"జీవితం అందమైనది"**



05 అతి చేసి మతిపోయిన యువకుని కథను ఆవిష్కరించిన **కృష్ణారావు...** **"మా బావ"**



43 **అవధాన జీవితంలో** అలలు చిత్రించిన **సంపత్** వ్యాసం



31 కాళోజీ పురస్కార గ్రహీత **"పెన్నా"**తో **ఘనపురం** ముఖాముఖి



19 **"సినారె"** పాటలలోని వెన్నెలను చిత్రించిన **భల్లం** వ్యాసం



09 త్రిజట, రాక్షసి గుండెలోని రాగాలు ఆవిష్కరించిన **త్రివేణి** వ్యాసం... **"త్రిజట స్వప్నం"**



15 అమానవీయతకు పేదపిల్ల బలైన తీరును కథగా చెప్పిన **అన్వర్...** **"మంగ్లీ"**



**బెజుగాం శ్రీజ** కవిత
04 **పిల్లలు-పెద్దలు**


**"బాలల నాటక రంగం"**లోని ఎత్తుపల్లాలు తెలిపే **కె.పి.** వ్యాసం... **25**వ పేజీలో...
**పిడిగు** పాటుతో రక్షింపబడిన అమాయక అమ్మాయి కథ తెలిపిన **ఎం. దేవేంద్ర...** **37**వ పేజీలో...
**బాలసాహిత్యాన్ని** దార్శనికతతో అవలోకించిన **అమ్మిన** వ్యాసం... **45**వ పేజీలో...
**శతకంలో ఆచార్యత్వం** ఆవిష్కరించిన **వేణు** వ్యాసం... **41**వ పేజీలో...
నాటి కవి **వానమామలై** చేసిన **"పల్లె వర్ణన"...** నాటి కవిత... **08**వ పేజీలో...
**"ప్రకృతి ప్రేమతో"....** **రేడియం** కవిత... **02**వ పేజీలో...
**ఊరవతల ఇంటి వెనుక** జ్ఞాపకాలను చెప్పే **కళా గోపాల్** కవిత... **02**వ పేజీలో...
**బి. పావని** కవిత... **ముత్యాల హారాలు...** **07**వ పేజీలో...
**పురందాస్...** **లంబాడీలు** కవిత... **12**వ పేజీలో...
**చంటి...** **ముత్యాల హారాలు** కవిత... **14**వ పేజీలో...
**రోషిణి...** కవిత **స్నేహ ప్రియం...** **44**వ పేజీలో...
**ఇంకా....**
సాహితీ శిఖరం, దృశ్య సాహిత్యం, సాహితీ సమాచారం, శ్రీకారం మొదలైనవి....

కవిత

# ప్రియ ప్రకృతి



రేడియం, 9291527757

పచ్చిక బయలు మనకయి పరచి నాడు
వాన దేవుడు మన తొలి వలపు చూచి
చినుకు చిత్తడిలో చిందు కనుల విందు
ప్రకృతి కొత్త పచ్చల వెల్గు పలకరించు

ప్రకృతి చిరుగాలి పాటలు పాడగానె
కురియు చినుకుల సిరిజల్లు కులుకు తోడ
ప్రకృతి వోలె పరవశించి పాడు చెలియ
కురియు ముత్యాలు రత్నాలు కులుకు తోడ

తడిసి తళతళ మెరిసేటి తరువు లెన్నొ
కప్పలబెకబెక కచేరి గళ ఘనాలు
చేప పిల్లల తళుకులు చెరువు నందు
చూపుకందెడి తోవల శోభ లెన్నొ

# ఆ ఇల్లు...



బి. కళా గోపాల్, 94416 31029



పిట్ట వాలని చెట్టులా... ఆ ఇంటి గడప
పొక్కిలైన తల వాకిలి దు:ఖంతో చెలిమి చేసింది!
నేనెప్పుడైనా ఆ ఇంటివైపు వెళ్తే
నా కొరకు దిగాలుగా ఎదురుచూసే
బాల్యస్నేహితుని జ్ఞాపకం ఒకటి
చందమామ పుస్తకంలా...
చెదరని సంతకమై ఎదను తొలుస్తుంది!
చీకటి చిరునవ్వులా అల్లుకున్న దాన్ని స్నేహపు పొత్తిళ్ళలో
మరొక్క మారు తలదాచుకోవాలని ఉవ్విళ్ళూరుతూ...
మట్టిబాట వెంబడి ఎన్ని మైళ్ళు నడిచినా...
తీరం చేరని కెరటంలా ఆ ఇంటిని చేరని నా పాదాలు!
నేడు జ్ఞాపకాల ముళ్ళు గుచ్చి రక్తసిక్తమయ్యాయి!
బాల్యమిత్రున్ని కోల్పోయిన వేదనలా...
ప్రతి ఊరి చివర మిగిలిఉన్న ఇల్లొకటి పేదరాశి పెద్దమ్మలా
పెదవి విప్పని కథలనెన్నో నెమరేస్తూ...
ఒకప్పటికి పురాజ్ఞాపకంలా మిగిలిపోయింది!!

సెప్టెంబర్ 9న కాళోజీ జన్మదినోత్సవ సందర్భంగా జరిగిన
'జాగృతి కవిసమ్మేళనం'లో చదివిన కవిత

సంపాదకీయం

తంగేడు


తెలంగాణ జాగృతి
తెలుగు సాహిత్య పక్ష పత్రిక

01-15 నవంబర్, 2021

సంపుటి 02 సంచిక 02





శ్రీమతి కల్వకుంట్ల కవిత
ఎడిటర్





డా॥ కాంచనపల్లి గో.రా.
అసోసియేట్ ఎడిటర్
9676096614



ఎడిటోరియల్ బోర్డ్ :
ఘనపురం దేవేందర్
రంగు నవీనాచారి


# అక్షర వారసత్వం

వారసత్వానికి చాల నిర్వచనాలున్నాయి. వారసత్వ సంపదగా ధనసంతానాదులను పరిగణించడం మానవజీవితంలో కద్దు. కాని అక్షరం మనకు తెలియకుండానే ఒక జాతికి ఎంత వారసత్వ సంపదగా పరిణమిస్తుందో ఊహిస్తే ఆశ్చర్యం కలుగుతుంది.

ఒక మనిషి నుండి మనిషికి, తరం నుండి తరానికి ప్రవహించే విద్య జ్ఞాపకాలని ప్రోది చేసే అప్రమేయ సాధనం. ప్రవాహంతో కొట్టుకుపోయేవాడు ఇది గ్రహించలేడు. కానీ విచక్షణ కలిగిన ఏ మానవుడైనా వెంటనే దీన్ని ఆకళించుకుంటాడు. లేకపోతే ఎపుడో జీవించిన వ్యాసుడు, వాల్మీకి, హెూమర్, హెూరాసిస్, భారత, గ్రీకు, రోమన్, సాంస్కృతిక సంపదలకు ఎట్లా మూలమైన వ్యక్తులుగా నిలుస్తారు? ప్లేటో, అరిస్టాటిల్, కారల్ మార్క్స్, లాంటి మహా తాత్వికుల చింతన మనకెలా అందుబాటులో ఉంటుంది?

క్షరం కానిదే అక్షరం అన్నారు పెద్దలు. క్షరం కాకపోవడం అంటే ఒక దృగ్గోచరమైన ఆకారాన్ని గురించి కాదు. దాని అభాసాన్ని, దానికి బింబంగా నిలిచే అస్తిత్వాన్ని గురించి చెప్పే మాట. అక్షరం ప్రతిపాదించే జ్ఞానం నిరంతరం సజీవ ప్రవాహం అని చెప్పిన మాట.

ఒక్క సృజనకే కాక సర్వకళలకూ అవశ్యం ఇది వర్తించే విషయం. అక్షరమంటే కేవలం ప్రతీకగా చెప్పే పదమే కాక దానికి మూలమైన వాస్తవం అనేది కూడా గ్రహించాలి. ఆ భావన సమాజ పరిణామానికనుగుణంగా రూపాంతరీకరణ చెందుతూ అక్షరం ప్రయాణం చేస్తుంది. నాటి జ్ఞాపకాలకు, దాని ఆధారంగా జరిగే వర్తమాన చలనశీలతకు, ఆపై ఆగతానికి కూడా అక్షరమే రూపకల్పన చేస్తుంది. కాబట్టి "కవిని గన్న తల్లి గర్భంబు ధన్యంబు, కృతిని జెందువాడు మృతుడు గాడు" అని అక్షర కార్మికులను గురించి ప్రశంసలు వచ్చాయి.

ఆధునిక కాలంలో సాంకేతికత విస్తరించడం వల్ల లిపి ప్రాధాన్యత తగ్గుతుందనే అభిప్రాయం ఉంది. కాని మొదట గుర్తించాల్సింది అక్షరమంటే లిపి మాత్రమే కాదు. నేటికీ హస్త భూషణంగా నిలిచే పుస్తకాన్ని, మనిషిని ఏ రంగంలో నైనా నిటారుగా నిలిపే అధ్యయనాన్ని ఎవరూ నిరాకరించ లేకపోతున్నారు. విద్యావంతుడే ఏ నాటికైనా సమాజ చోదకుడు. మానవ సమాజంలో ఏనాటికైనా విద్యే తిరుగులేని శక్తి. మహాబలవంతుడు విద్యావంతుడే. సోక్రటీస్ విద్య గురించి ఇట్లా అంటాడు. Education means the bringing out of the universal validity which is latent in the mind of every man. ఇట్లా సార్వజనీనతకు మూలకందమైన విద్య చిన్నప్పుడే బీజావాపన కావాలి. అక్షర విత్తనం బాల్యంలో పడకపోతే అది విద్యావృక్షంగా ఎదిగే అవకాశం ఉండదు.

రానున్నది బాలల దినోత్సవం కాబట్టి వాళ్ళ అక్షరాస్యతకు మరింత శ్రద్ధ వహించాలి. వాళ్ళలో కోటిదీపాలు వెలిగే ప్రణాళికారచన జరగాలి. బాల్యంలో బీజావాపన జరిగిన అక్షరమే భావికాలపు సాహిత్య వికాసానికి తోడ్పడుతుంది. సాహిత్య వికాసమంటే అది సామాజిక వికాసమే. మానవ సమాజం అక్షరానికి ఆటపట్టుగా నిలబడాలని ఆకాంక్షిద్దాం. "బాలల దినోత్సవం" సందర్భంగా బాలబాలికలలో అక్షర దీపం నూతన చేతన పొందాలని కోరుకుందాం.

జై తెలంగాణ, జై జాగృతి.

కవిత కల్వకుంట్ల

కవిత

# పిల్లలు - పెద్దలు

బెజుగాం శ్రీజ, 9391097371

**కందం**

పెద్దల మాటలు వినుచును
పెద్దలనే గౌరవించి - పిల్లలెనెపుడున్
హద్దులు మీరక నుండియు
శ్రద్ధను పెట్టియు చదవగ - సకలమునబ్బున్

**మత్తకోకిల**

కలతలొచ్చిన కష్టమొచ్చిన
కన్నిరార్పక పిల్లలే
కలముబట్టియు నక్షరమ్ములు
కాంక్షదీరగ దిద్దియున్
అలకలేకను పుస్తకాలను
హాయితోడుత నేర్చియున్
కలిమిగూర్చుతు మెప్పు బొందుతు
గౌరవమ్మును బొందురే

**ఆటవెలది**

ఫోనుముట్టకుండ పుస్తకాలనుబట్ట
చక్క నగును చదువు ఛాత్రులార
తల్లిదండ్రిమాట దప్పకపాటించి
విద్యనేర్వవలెను వినయమతులు

**ఉత్పలమాల**

అల్లరిజేయగా జనని -
హాయిగ నవ్వుతు సంతసమ్ముతో
పిల్లలపట్ల జాలిగను -
ప్రేమను పంచును కన్నతల్లియే
చల్లని దీవెనల్నిడుచు-
చక్కని బాటలు వేయుచుండునే
మెల్లగ ధర్మమార్గమున
మేలగు దారిని జూపు నెప్పుడున్

**ఆటవెలది**

బడికి పంపవలెను బాల్యము నందున
పనికి పంపరాదు పైసకొరకు
మొక్కలాంటి బ్రతుకు రెక్కలిరిగిపోవు
తెలియవలెను ప్రజలు తెలివిగాను

(నవంబర్ 14, బాలల దినోత్సవ సందర్భంగా...)



నా టి క థ

# మా బావ

చాంచల్యంతో చెడిపోయిన యువకుని కథ...

అవరుపల్లి కృష్ణారావు

ఉన్న మాటకేంగానీ, మా బావ తెలివైనవాడనే చెప్పాలి. తల్లిదండ్రుల కొక్కడే కొడుగ్గాబట్టి గారాబంగా పెరిగాడు. ఎప్పుడేది కావాలంటే అది తెచ్చియిచ్చేవారు మా అత్తమామ లాతనికి. ఏదో కలిగిన సంసారం కాబట్టి ఏ లోటు లేకుండా జరిగేది. మా వూళ్ళో బడి లేకపోవడం చేత నేను కూడా మా బావ వూళ్లోనే చదివేవాణ్ణి. మా బావ చేసే కొంటె పనులకు అంతేలేదు. ఎప్పుడు ఏదో చేస్తూ దాని ఫలితంగా పాఠం నేర్చుకునేది. ఒకనాడు మేము రాసుకుంటూ వుండగా, ఇక బొక్కలోకి పాముపోయింది. దాన్ని చూచిన నేను 'పాం పాం' అని అవతలికురికాను. మా బావ నా వెనుక రాక, బొక్కలోనుంచి వేలాడుతున్న పాము తోక పట్టుకు లాగాడు. పాపం! ఎంత గుంజినా రాలేదు. చివరకు బలంగా లాగేసరికి అది 'బుస్సు' మని మూతి మలిపి చేతి మీద కాటేసింది. అదేం చిత్రమోకాని మా బావ యేడ్వలేదు. చేయిమాత్రం బిగ్గరగా పట్టుకుని యివతలకొచ్చి కూర్చున్నాడు. అది తెలిసిన మా అత్త మంత్రకాణ్ణి పిలిపించింది. వాడొచ్చేసరికి మా బావ ఎదురుగా వాకిట్లో కనపడితే "ఏం, ఎందుకు పిలిచారు?" అని అడిగాడు. అందుకు మా బావ తనకు 'పాము కరించింద'ని చెప్పగానే మంత్రకాడు, ఒక చెంపదెబ్బ యాడ్చి కొట్టాడు. అంతటితో విషం దిగింది. మా బావకు... మాబావ అల్లరితనాన్కి నిదర్శనంగా, ఇంకో చిన్న సంఘటన గమనించండి! ఏమిటంటే, ఆనాడు వరలక్ష్మీ వ్రతం. మా అత్త నోముకోడానికి "బంతిపూలు తెమ్మ"ని నౌకరును పంపుతుంటే మా బావ తానే వెళ్లి తెస్తానని మారాముచేశాడు. తల్లి విసిగెత్తి "సరే యేడువు" అంది. కొంత దూరం పోయాక, తోవపక్కకు తీస్తున్న ఓ గుఱ్ఱాన్ని పట్టుకుని, దాని కాళ్ళకున్న 'బంధం' తాడుని మూతికి తగిలించి, తానెక్కి, నన్ను కూడా యెక్కమన్నాడు. కాని 'నాకు భయమేస్తుంద'ని తప్పించుకున్నాను. నన్ను "కొత్త బావి తోట్లోకి రమ్మ"ని తాను సవారీ తీశాడు. ఆ పరుగులో బందంతాడు వదిలిపోయింది. గుఱ్ఱం యిష్టం వచ్చినట్లు చెట్టనక గుట్టనక పరిగెత్తి, చివరకి ఓ వాగువడ్డున పడేసింది. ఆనాడు వాణ్ణి వెతకడంలో మా అత్త నోము మానుకోవాల్సి వచ్చింది. అంతేగాక మా బావగారి గాయాలు మానేటప్పటికో నెల్లాళ్ళు పట్టింది.

ఇలా వుంటుండగా మా బావను చదువుకోవడానికి బోర్డు హైస్కూలుకు పంపించారు. అక్కడ చదువు సరిగా అంటినా అంటకపోయినా అతన్లో కొత్త కొత్త ఊహలు బయల్దేరాయి. తాను కూడా మహాత్మా గాంధీగారి ప్రియశిష్యుణ్ణి కావాలనుకొన్నాడు. మిల్లు గుడ్డలన్నీ, తాను వడుగునాడు పెద్ద హటంచేసి, తన్నులు తిని సాధించిన జరీఅంచు పట్టుపంచతో సహా కాల్చేసి, ఖద్దరు ధారణానికి పూనుకొన్నాడు. ఇహ ఎప్పుడూ, ప్రతివారితో జాతీయ నాయకుల విషయమే ముచ్చటించేవాడు. తుదకే పిచ్చి ముదిరింది. విద్యకు స్వస్తి చెప్పి దేశంలో ప్రచారం చేయాలనుకుని, ఆ కార్యక్రమం తన వూర్లోనే ప్రారంభించాడు. మొదలు కొన్ని పుస్తకాలు సంపాదించి ఓ చిన్న గ్రంథాలయం స్థాపించి అందులో ప్రతి శనివారం ఉపన్యాసాలివ్వడం మొదలెట్టాడు. అది తెల్సి ఒకనాడు పోలీస్ కాంస్టేబిలు కాస్త గడబడ చేసి అందర్నీ బెదిరించడం వల్ల తన ఉద్యమానికి తిలోదకాలిడిచాడు. ఇంతలో మా బావకు పెళ్లి చేశారు. అమ్మాయి అందమయిందే. ఇంకా వ్యక్తురాలు కాలేదు. కొన్ని రోజుల తర్వాత ఆ వూరికొక యోగి రావటం తటస్థించింది. అతని యందు మా బావకు మంచి భక్తి కుదిరింది. అతన్నావూళ్ళోనే వుండమనీ, తాను స్థాపించిన గ్రంథాలయాన్ని భజనమందిరంగా మార్చి, ఆ యోగీశ్వరుడందులో వుండడానికి తగిన వసతులు కల్పించాడు. ప్రతినిత్యం అతనికి పాలూ పండ్లూ అన్నీ ఇచ్చేవాడు.



ఆ వూళ్ళో ఇతనే కాకుండా, ఇంకా కొందరు భక్తులుగా మారారు. వాళ్ళల్లో స్త్రీలు గూడా చేరారు. ఈ శిష్యులంతా కలిసి అక్కడ భజనలు చేస్తూ ఉత్సవాలు జరుపుతూ ఉండేవారు. ఈ భక్తశ్రేణిలో చేరి, మా బావ జ్ఞానపత్రి (గంజాయి) సేవిస్తూ భక్తిపరవశంతో మూర్ఛ జెందుతూ వుంటే ఇతర భక్తులు శైత్యోపచారాలు చేసి సేద తీర్చేవారు. ఆ సన్యాసి వారందరికీ జ్ఞానోపదేశం చేస్తానని నమ్మించి వారు తెచ్చిపెట్టిన తిండి వస్తువులు పొట్టనిండా మెక్కుతూ సమర్పించిన ద్రవ్యాన్ని స్వీకరిస్తూ హాయిగా కాలం గడిపేవాడు. ఇలా వుంటుండగా అతని శిష్యురాండ్రలో ఒక బ్రాహ్మణ వితంతువుతో మా బావకు పరిచయం కలిగింది. ఒకే గురువు శిష్యులు కాబట్టి "అక్కా తమ్ముడూ" అని పిల్చుకు నేవారు. ఏవేవో పుస్తకాలు చదివి రహస్యాలోచనలు చేసేవారు. అది రాను రాను విపరీతంగా మారింది. ఇద్దరు ఒకే కప్పులో టీ తాగడం, ఒకే గదిలో వుండడం వరకూ దిగింది వ్యవహారం. ఒక్కొక్క ప్పుడు ఇద్దరూ ఒకర్నొకరు గట్టిగా పెనవేసుకుని బ్రహ్మానం దానుభవంలో ఉన్నట్టు నటించేవారు. ఇదంతా చూచి ఆ వూళ్ళోవాళ్ళు అపార్థం తీసి హాస్యం చేశారు. ఆ పిల్ల తల్లి అల్లరి పెట్టి, మా బావను బాగా చీవాట్లు పెట్టి మళ్లీ వాళ్లింటివైపు పోకుండా చేసింది. అంతా తన కొడుకును గర్హిస్తుంటే చూడలేక కొడుకును ఏమనజాలక, ఇతర పెద్ద మనుషుల సహాయంతో ఆ కపట యోగీశ్వరుణ్ణి ఊళ్ళోనుంచి తరిమేశారు మా బావ తండ్రి.

తరువాత కొన్నాళ్ళకు మా బావ పెళ్ళాం కాపురాని కొచ్చింది. కార్యమయి న్నాటి నుంచి అతడు కొత్త రకంగా తేలాడు. పూర్వపు గీతా పారాయణానికి మారుగా పడకటింటి ముచ్చట్లూ, నొసట విభూతికి మారుగా ముఖం నిండా ఫేస్ పౌడరూ. సాంబ్రాణి పొగవేసి ఈశ్వరార్చన చేసేదానికి బదులు, అస్తమానం సిగరెట్ల పొగ పీలుస్తుండేవాడు. ఉదయా స్తమయాలలో సంధ్యావందనాల స్థలం కాఫీ ఫలహారా లాక్రమించాయి...

ఏవేవో పుస్తకాలు చదివి రహస్యాలోచనలు చేసేవారు. అది రాను రాను విపరీతంగా మారింది. ఇద్దరు ఒకే కప్పులో టీ తాగడం, ఒకే గదిలో వుండడం వరకూ దిగింది వ్యవహారం. ఒక్కొక్క ప్పుడు ఇద్దరూ ఒకర్నొకరు గట్టిగా పెనవేసుకుని బ్రహ్మానందానుభవంలో ఉన్నట్టు నటించేవారు. ఇదంతా చూచి ఆ వూళ్ళోవాళ్ళు అపార్థం తీసి హాస్యం చేశారు. ఆ పిల్ల తల్లి అల్లరి పెట్టి, మా బావను బాగా చీవాట్లు పెట్టి మళ్లీ వాళ్లింటివైపు పోకుండా చేసింది.

నాటి కథ

పెళ్ళాన్నొక్క పనీ చేయనియ్యక ఎప్పుడూ తనవద్దే కూచోమనేవాడు. పెళ్ళామూ, తాను ఏవేవో శృంగార ప్రబంధాలు చదవడం, ఇద్దరూ కలిసి మధ్యాన్నాలన్నీ కొండలోయల్లో, తోటల్లో, దొడ్లల్లో, గడపడం ప్రారంభమయింది. ప్రబంధ నాయికా నాయకులవలె వియోగ విప్రలంభాల నుభవించాలనుకున్నాడు. ఆంధ్ర కావ్యాలన్నీ గాలించి చంద్రాది దూషణలు వెతికి, వాటికంటే నూతనంగా తాను తిట్లు కల్పించాలని ప్రయత్నించాడు. త్వరలోనే తన భార్య గర్భవతి కావడం, పుట్టింటికెళ్ళడం, అతని సంకల్పానికి దోహదమైంది. అందులో ఎంతవరకు జయం పొందాడో గాని ఈ పిచ్చి కూడా తొందరగానే అంతమయింది. ఇంతలో తండ్రి చనిపోయాడు. వేదాంతపు బుజ్జి కాబట్టి త్వరలోనే దుఃఖం మాయం చేసుకున్నాడు. తండ్రి పోవడం కొడుకు పుట్టడం వొకేసారయింది. మా బావ పెళ్లాం పుట్టింట్లోనే వుంది.

'పురుషులు నూతన ప్రియులు' అన్న వాక్యాన్ని మా బావ తన యెడల సార్థకపరచుకొన్నాడు. ఇప్పుడాతని దృష్టి సంఘ సంస్కరణ మీద పడింది. సంఘంలోని లోపాలను సవరించే అందుకు చేయవలసిన ప్రయోగాలన్నీ మొదలు తనపైనే చేసుకుని, సంఘానికి మార్గదర్శకుడుగా ఉండాలని కాబోలు! ఎంచేతంటే, ప్రస్తుతం బ్రాహ్మణుల్లో మగపిల్లలకంటే ఆడపిల్లలు ఎక్కువ ఉండడం వల్ల వీరి తలిదండ్రులు ఎక్కువ వరదక్షిణలు కోరుతున్నారని, అది మాన్పడానికి సంస్కారియైన ప్రతి యువకుడు ఒకటిన్నా ఎక్కువ పెళ్ళిల్లు చేసుకొని వధువుల సంఖ్య తగ్గించి, మగపిల్లల తలిదండ్రులు చేసే అన్యాయాల్ని సాగకుండా చేయాలనే సిద్ధాంతానికి వచ్చాడు. పెళ్ళి చేసుకోవాలని ప్రయత్నం చేస్తే ఎక్కడా పిల్ల దొరకలేదు. మరి ఈ యిరవయ్యో శతాబ్దపు మహమ్మదు తుగ్లక్కు అమ్మాయి నెవరిస్తారు? ఏ విధంగానైనా తన కోర్కె నెరవేర్చుకొని "నలుగురిలో తల యెత్తుకు తిరుగాలనుకొని, ఇంట్లో వున్న కాస్తా డబ్బు తీసుకొని పాల్ఘాటుకు వెళ్లాడు. అక్కడ ఏజెంటు తనయింట్లో అద్దెకున్న వారి అమ్మాయిని చూపి తన అమ్మాయనే చెప్పి ఏడువందల రూపాయలు తీసుకొని ముఖం తప్పించాడు. కొన్ని రోజులు నిరీక్షించి చివరికి నెత్తి గోక్కుంటూ ఇంటికి వచ్చాడు. "మున్నూరు రూపాయలు, మూతిమీద మీసం, పోకడేగాక సోమయాజులన్న పేరుగూడ రాలేద"ని అందరూ హేళన చేశారు. దీని తర్వాత... వేశ్యావృత్తి నిర్మూలనకి పూనుకున్నాడు మా బావ. వాళ్ళను రోజా అడ్డమైనవాళ్ళతో వ్యభిచరింప జేయగూడదని, ఒక "వేశ్యాశరణాలయం" మూడు వేల రూపాయలు పెట్టి కట్టించాడు. పదహార్గురు భోగంవాళ్లను చేర్చాడు. కాని అదీ చక్కగా నడవలేదు. వాళ్ళతని డబ్బు కాజేసి వుళ్ళో యిష్టం వచ్చినట్లు తిరిగేవారు. చివరకు వాళ్లల్లో ఒకదానికి తానే లొంగిపోయి దానివల్లో పడిపొయ్యాడు. మిగిలిన కాస్తా నగలూ రెండు నెలల్లో క్షౌరమయ్యాయి. మొగుడు పోవడం వల్ల కొడుకిలా అయిపోవడం వల్ల, మా బావ తల్లి హృదయానికో పెద్ద అఘాతం కలిగింది. ఆమె కూడా గుటుక్కుమన్నది మందులేక మాకులేక... ఈతని వైఖరి చూసి మా బావ దగ్గరికి పెళ్లాన్ని తోలించలేదామె పుట్టింటివాళ్లు.. ఆ వుంచుకున్నది గూడా బాగా క్షౌరం చేయడమే కాక శరీరం పాడుచేసింది. డబ్బయిపోగానే తలదన్ని పోయింది.

చివరకి అత్తగారింటికెళ్లాడు. పశ్చాత్తాప పడ్డాడు. కాని వాళ్ళు ఈతని పిచ్చి కుదిరిందని నమ్మక ఓ డాక్టరుకు లంచమిచ్చి పిచ్చిలేచిందని సర్టిఫికెటు తీసుకుని పిచ్చాసుపత్రిలో ఆర్నెల్లుంచారు. దాంతో నిజంగా పిచ్చి కుదిరింది. ఇప్పుడు పెళ్ళాం, కొడుకుతో మామూలుగానే వున్నాడు.

*("కమ్మ తెమ్మెరలు" కథా సంకలనం నుండి)*

కవిత

# ముత్యాలహారాలు

ఆడపిల్లంటె అందం.
నవ్వితే ఆనందం.
ఏడిస్తే దరిద్రం.
తనంటేనే మధురం.

మా అక్కకు పెళ్ళంట.
పచ్చనైన పందిరంట.
పందిట్లో గాజులంట.
అందరు తొడిగిరంట.

మా పల్లె నాకిష్టం.
పండుగలు నాకిష్టం.
ఆటలంటె నాకిష్టం.
పాటలంటె నాకిష్టం.

రామ్మా చిలుకమ్మా.
రంగుల మొలకమ్మా.
ఎర్రని ముక్కమ్మా.
తియ్యని పాటమ్మా.



**- బి. పావని, 9వ తరగతి 7013264464**

(నవంబర్ 14, బాలల దినోత్సవ సందర్భంగా...)

# అది యొక పల్లెటూరు...



**వానమామలై వరదాచార్యులు**

(ఆగష్టు 16, 1912 - అక్టోబరు 31, 1984)

చ. అది యొక పల్లెటూరు కల వందొక కొన్ని గృహాల పెంకు చా
ళ్ళఁ దలధరించి మోయు చెటులాయని సంస్మృతిభార మెంచి బా
ధఁ దనరు పెన్గుటుంబివలె దాపున మౌనులవోలెఁ బూరియిం
డ్లద నమితాశ వీడునెడ నీ బరువే తృణతుల్యమౌ నవన్.

మ. అలుకుంబూఁతల నొప్పుకుడ్యములపై నందందు నందమ్ముగాఁ
జిలుకల్ పొన్నలు చంద్రవంకలులతో చిత్రాలు పున్నమ్ముతో
విలిఖింపంబడెఁ, దిన్నె లోడికలతో వెల్గెన్, గుటీవాటి, వా
కిళులొప్పెన్, నునుదింతి పూసరులఁ బ్రాఁకెన్ గుమ్మడుల్ కొప్పులన్.

ఆ. పూరియిండ్లచుట్టుఁ బొదలు మొక్క పెరండ్లు మొక్క పెరటిచుట్టు ముండ్లదడులు
దడులలోని కేఁగు ద్వారాల పలుగాండ్లు గుడిసె గుడిసె వెనుక పిడుక గూండ్లు

సీ. కుంపటివలెనుండు కుక్కుటరాయండు కుటిశిఖాగ్రమునెక్కి కూయు నొకట
సరసఁ బిల్లలకోడి యెరువు కుప్పలఁదోడి పురువుల ముక్కునన్ బొడుచు నొకట
ముంగాళ్ళపై లేచి మునిపంట దడులాఁచి ప్రాఁకుతీఁగల లాగు మేఁక యొకటఁ
గడుపుబ్బఁ బులు మెక్కి కుడితిగోలెము చక్కి పడుకొని నెమరుచుఁ బాడియావు
ఆ. ముల్లెగట్టు వెల్ల 'మొకమా'లన న్మేను ముడిచిపండు లేఁగబుడుత యొకటఁ
బూరిగుడిసెలెక్కి పొయిరాఁజెనని యగ్ని సాక్షిఁబల్కు ధూమసంఘ మొకట

సీ. ముత్యాల చెండ్లెత్తి మురిపించు జొన్నచేల్ కర్షకశ్రమబిందు ఘనతఁదెల్పు
బంగారు గొలుసులు బరువుల మెడవంచు వరిలక్ష్మి పాలేఱు వరుస విప్పు
వెండికొండలు చెట్లఁ బండించు ప్రత్తిచేల్ పశుపతిత్వము రైతువరముమొనర్చుఁ
జంకబిడ్డలఁగొంచు సాఁకెడు మొక్కచేల్ ప్రజకాఁపు చంకపాపలని చూపు
తే. మేలిపంట పొలాల నాఁగేలు చాలు శ్రీ మహాలక్ష్మియైన యాసీత నేలు
నేల నవధాన్య రత్నభూషాళిఁదాల్చి పాఁడిపంటల ముల్లె యీ పల్లె యనఁగ.

(పోతన చరిత్రము నుండి)

వ్యాసం

# సీతా సంసేవితం 'త్రిజట' స్వప్నం

త్రిజట అంతరంగ రాగాలు...



డా॥ వి. త్రివేణి
9951444803

"పేరుకు రాక్షసి గాని త్రిజట పరమ సాత్వికురాలు; సాధ్వి, వృద్ధ, ప్రబుద్ధ, జ్ఞాన స్వరూపిణి. అశోకవనంలో శోకతప్త సీతను కంటికి రెప్పలా కాపాడ్డానికి నియుక్తురాలైన త్రిజటలో గాయత్ర్యంశ ఉంది. "త్రిజటా తిత్తిరీ తృష్ణా త్రివిధా తరుణాకృతి" అని దేవీ భాగవతంలో పేర్కొన్నట్లు త్రిజటా శబ్దం గాయత్రీ దేవికున్న సహస్ర నామాల్లో ఒకటి. గాయత్రీ మంత్రాధిష్ఠానమైన పరబ్రహ్మమే శ్రీరాముడు." (పుట.14)

ఇవి తెలంగాణ రాష్ట్ర ముఖ్య సలహాదారులు మరియు విశ్రాంత సీనియర్ ఐ.ఏ.ఎస్. అధికారి డా॥ కె.వి. రమణాచారి గారు త్రిజట పద్య కావ్యానికి నుడివిన హృద్య వాక్యాలు. ఆచార్య అనుమాండ్ల భూమయ్య గారి పద్య కృతిలో ఆత్మజ్ఞాన యోగిత్వం, మనోనిశ్చలత్వం, నిగూఢార్థ అవలోకనం, భక్తి ప్రతిపాదితా భావనం వంటి ఉత్తమ గుణాలు త్రిజటలో ప్రదర్శితమైనాయి.

త్రిజట స్వప్నం రామాయణ పరమౌన్నత్యాన్ని తెలుపుతుంది. రామతత్త్వ వైశిష్ట్యాన్ని వెల్లడిచేస్తుంది. అద్భుతమైన స్వాప్నిక వృత్తాంతం ఇది. దైవిక చింతనలో శాశ్వత కీర్తిదాయకంగా నిలుస్తుంది. సుగుణ శోభిత మృదు మనోహర శ్రీ రాముడిని ఈ స్వప్నం ధీరోదాత్తుడిగా వర్ణిస్తుంది. స్వప్నంలో కనిపించిన శ్రీరాముడి విజయ సంకేత సూచిక శిష్ట జనోద్ధరణకు నాంది పలుకుతుంది. త్రిగుణాతీతమైన ఆత్మ సందేశాన్ని వ్యాపితం చేస్తుంది. భవిష్యద్దర్శన క్రాంతి రేఖా ప్రవంతిగా ప్రకాశిస్తుంది. శ్రీరామ స్మరణ మనోభిరామంగా త్రిజట స్వప్న భావన రూపుదిద్దుకుంది. రఘురాముడి ప్రసన్న వదనం ద్వారా స్వప్న నిర్దేశం నిర్వేద రహితమైంది. త్రిజట మనోస్థితి, చిత్తవృత్తి స్వప్న సిద్ధాంతాన్ని పరిపుల్లం చేసింది. నిష్కల్మష హృదయం ఆంతరిక భావ పరంపరలను సమైక్యపరిచింది.

త్రిజట ఆదిదైవిక ఆత్మచింతన కలది. శ్రీ సీతారామ లక్ష్మణులను శ్వేత మాల్యాంబర ధారులుగా సంచరించే దృశ్యం ఆలంకారిక కృత్యంగా వర్ణింపబడింది. ఈ ఉపమానం గాయత్రీదేవీ శ్వేత వర్ణ పూజితంగా వెలుగొందింది. స్వప్నంలో దర్శితమయ్యే వేయి హంసలు, చతుర్దశ మహాగజం, వృషభం వంటివి గాయత్రీ మంత్రాధిదేవత అనుష్ఠాన వాహనాలు. ఇవి త్రిసంధ్యలందు సంచరిస్తూ సృష్టి, స్వయం సంతృప్తికి గమకాలుగా నిర్దేశింపబడుతున్నాయని ఉత్తమోత్తమ పండితుల ఉద్బోధ.

### ✦ త్రిజట పద్యకృతిలో మూలాంశాల విశ్లేషణ...

1. త్రిజట స్వప్న వృత్తాంతం - సీతాదేవి సంరక్షణం
2. త్రిజట రామతత్త్వ నివేదనం - సమరస మనోజ్ఞం
3. త్రిజట మానవీయ ప్రదర్శనం - త్రిగుణాతీతం
4. త్రిజట స్త్రీత్వ భావనాత్మకం - అస్తిత్వ ప్రాధాన్యం
5. త్రిజట భక్తి ప్రబోధనం - రాక్షసజాతి ముక్తిదాయకం

### ✦ జన్మకారక సిద్ధాంతం...

ఆచార్య అనుమాండ్ల భూమయ్య త్రిజట పద్యకృతి ఆరంభంలోనే జన్మ సిద్ధాంతాన్ని ప్రవచించారు. త్రిజట తాను పొందిన రాక్షస జన్మకు చింతా మనస్కురాలై వ్యధ చెందిన సన్నివేశం ఈ కావ్యంలో ప్రతిఫలిస్తుంది.

**ఎరుగ రాక్షస జన్మ ఇదెట్లు కలిగె?**
**జన్మ ఏదైన నేమి? ఈ జన్మ నిట్లె**
**స్వీకరించెద దైవమిచ్చిన ప్రసాద**
**మట్లె; ఇంత రాక్షస జన్మకంతమెపుడొ!**
**(పుట.43)**

దేవతలు, రాక్షసులు, మానవులు సమస్త లోకంలో సృష్టింపబడడం సహజం. రాక్షస జన్మను పొందిన త్రిజట అత్యంత దైన్యాన్ని ప్రదర్శిస్తుంది. కృతయుగంలో తాను ఒక రాక్షసిగా జన్మపొంది, జన్మకారక నైరాశ్యాన్ని అనుభవిస్తుంది. సేవా తత్పరతతో పాటు, పరోపకారక ప్రయోజనం కోసం త్రిజటను అనుమాండ్ల

వ్యాసం

భూమయ్య సృష్టించాడని భావించవచ్చు. ఈ ప్రకారంగానైనా త్రిజట జన్మసార్థకం కాగలదని ఆయన నిర్దేశం. అటువంటి సందర్భంలోనే సీత జాడ కోసం వెదుకుతూ వచ్చిన హనుమంతుడిని ప్రవేశపెట్టారు. శ్రీరామ చంద్రుడు ఇచ్చిన రాజముద్రికను తీసుకొని సుగ్రీవుడి ఆజ్ఞానుసారం లంకాపురంలోకి అడుగుపెట్టిన హనుమంతుడి, శ్రీరాముడిపై గల, దాసభక్తిని వెల్లడించారు.

**✦ రావణుడి కామభావం...**

అంతలోనే రావణాసురుడు తాను అపహరించి తీసుకొచ్చిన సీతను వశపరుచుకోవడం కోసం అశోక వనానికి చేరుకున్నాడు. కామభావం కలిగి సీత హృదయం చూరగొనాలనే తలంపుతో మాయ ప్రేమను నటించి వగల మాటలు పలుకుతాడు. కాని సీత ఆ మాటలను గడ్డిపరకలాగా భావించి అతనిపై క్రోధం ప్రకటిస్తుంది. ఈ పరిణామంతో రావణుడు సీతపై నిప్పులు చెరిగి రెండు మాసాల గడువును నిర్ణయిస్తాడు. రాక్షస కామ ప్రవృత్తిని ప్రదర్శించే సందర్భంలో **"నన్ను చేరు మీ లోన, కాకున్న నిన్ను చంపి తిందు"** అని హెచ్చరిస్తాడు. రక్షణగా ఉన్న రాక్షస స్త్రీలను బెదిరించి సీతను భయపెట్టవలసిందిగా పురమాయించి ఆగ్రహంతో నిష్క్రమిస్తాడు. అక్కడే ఉన్న త్రిజట రావణుడి కాముక ప్రదర్శనను అసహ్యించుకుంటుంది. చిరాకు పడుతుంది. రావణుడే స్వయంగా సీతకు కాపలాగా త్రిజటను నియోగించాడు. కాని మనస్తత్వం, మంచితనం, సత్ప్రవర్తన, గుణశీలత, హృదయ వైశాల్యంలో త్రిజట దైవిక తత్త్వం ఉన్నతంగా భావిస్తుంది. కవి భూమయ్య త్రిజటలో మానవీయ కారుణ్యతను ప్రదర్శించారు. సీతా సంరక్షణ దిశగా త్రిజట కార్య నిర్వహణ భావ సందోహం ఏర్పడడం ఈ కావ్యంలో అద్భుతంగా దృశ్యమానమవుతుంది.

ఇక రావణాసురుడి ఆజ్ఞానుసారం సీతను పదే పదే బెదిరిస్తూ, రావణుడి పరాక్రమాన్ని పొగుడుతూ, భీకర ధ్వనులు చేస్తున్న రాక్షస స్త్రీలను తిరస్కరిస్తుంది. ఏమాత్రం అధైర్యపడదు. మనోస్థైర్యం, హృదయ నిబ్బరం ఉన్నా సుకుమారత్వం ఆమెలో ఎక్కువ.

**✦ త్రిజట స్వప్న సందేశం...**

అందుకే అప్పటి వరకు నిద్రిస్తున్న త్రిజట మేల్కొని, సీతపై పరుష దూషణాలతో చెలరేగిపోతున్న రాక్షస స్త్రీలను నిలువరించి హితవు పలుకుతుంది. రాక్షస జాతికి ఎటువంటి చేటు జరుగబోతుందో తెలుపుతుంది. సీత పూర్వవైభవాన్ని రాక్షకసాంగనలకు వర్ణిస్తుంది. సీత జనక మహారాజు కూతురు అని, దశరథ మహారాజు కోడలు అని వివరిస్తుంది. సీతను భయపెట్టి భక్షిస్తామని బెదిరిస్తే ఎటువంటి దుష్పరిణామాలు ఉంటాయో హెచ్చరిస్తుంది. సీతను భక్షించాలనుకుంటే మిమ్మల్ని మీరే భక్షించుకోవడం జరుగుతుందని భవిష్యత్కాల ప్రభావాన్ని పేర్కొంటుంది.

అనుమాండ్ల భూమయ్య త్రిజట స్వప్నావస్థను ప్రత్యక్షంగా వర్ణించారు. రాక్షస కాంతలో దైవాంశ ఏ మూలనో ఉండి స్వప్నం రావడానికి కారణమవుతుందని ఆయన అభిప్రాయం. సీత రక్షణ పరంగానే త్రిజట స్వప్న నిర్దేశం జరిగింది. అభయప్రధానమైన స్వప్న సందేశం సీతకు ప్రాణరక్షణ గావించింది. స్వప్న సంకేత రూపం ఎలాంటిదో అనుమాండ్ల భూమయ్య క్రింది పద్యంలో తెలియజేశారు.

**నేను నిద్రించుచుండ నాలోన ఎవరు**
**నిదురబోకుండ చూచిరో నే నెరుంగ**
**అతడు దైవ మగునొ! దానినంత చూపె**
**నాకు; ఆ స్వప్న మెరిగింతు మీకు**
**వినుడు (పుట.46)**

అయితే త్రిజట ఎటువంటి దృశ్య సదృశ్య లీలా ప్రవంతిని కలగన్నదో కవి వర్ణించారు. శ్రీరాముడిని కలలో దర్శించింది త్రిజట. కాని ఆ రాముడి ఔన్నత్యానికి విశేషార్థాలను అనువర్తింప జేస్తూ అనుమాండ్ల భూమయ్య రామాభ్యుదయం, మైథిలి అభ్యుదయం, సింహ విక్రాంతగామి విశిష్ట పురుషుడిగా అభివర్ణించారు. రాముడిని కనుగొనగానే త్రిజటకు కనులపండుగైందట. రాముడి అందాన్ని వర్ణింపడానికి అలవికానిదని రాక్షస స్త్రీలకు త్రిజట చెప్పిన తీరును కవి హృద్యంగా వ్యక్తపరిచారు. ఇది ఇలా ఉండగా త్రిజట కలలో రాక్షసుల వినాశనం కన్నది. ఇది ఇంకా ఆశ్చర్యకరమైన దృశ్యం. పటాటోపం, అధికారం, క్రూరత్వం కంచుకోటగాగల లంకాపురంలో రాక్షసజాతి అంతమొందే సూచన త్రిజట దివ్యజ్ఞానానికి సంకేతం. **"సీత రక్షణ రాక్షస శిక్షణ"** నినాదంగా త్రిజట భవిష్యత్తు స్వప్న దృశ్యం ప్రమాణంగా నిలిచింది. శ్రీరాముడితో సహా తాను కలగన్న విషయాన్ని త్రిజట స్వగతంగా కవి వర్ణించారు.

**కంటి కలగంటి శ్రీరాము కనుల గంటి**
**కంటి కలలోన సీత నీ కనుల గంటి**
**కంటి కలగంటి లక్ష్మణ కనుల గంటి**
**ఎంత నోచితినో భాగ్యమింత గంటి**
**(పుట.47)**

సీత అనుగ్రహించి శ్రీరాముడికి ఎరిగించినదేమో! ఆ రామచంద్రుడే స్వప్న వశంగా తనను సాక్షాత్కరించి ఉంటాడని రాక్షస స్త్రీలతో త్రిజట నివేదిస్తుంది. ఈ అవకాశాన్ని రావణుడే మొదట తనకు అందించడం, "సీత నరసికొని యుండు నిత్యమ్ము" అని ఆజ్ఞాపించడం వల్ల శ్రీరాముడిని కలలో చూచే భాగ్యం కలిగిందని సంతోషిస్తుంది. రావణుడి మంచితనం ఇదొక్కటే అని కవి త్రిజట చేత ప్రస్తుతింపజేశారు.

**✦ శ్రీ సీతారాముల దివ్య తత్త్వం...**

అనుమాండ్ల భూమయ్య త్రిజటకు స్వప్నంలో కనిపించిన రామచంద్రుని అందచందాలు, గుణగణాలను అద్భుతంగా వర్ణించారు. శ్రీరాముడి ప్రభాకాంతులు, సోయగం త్రిజటను మరింత మంత్ర ముగ్ధురాలిగా చేసిందని తెలిపారు. సీతమ్మకు ఆ రాఘవుడిపై అంత ఎందుకు ప్రేమ కలిగిందో త్రిజట

మనోఫలకంపై ప్రత్యక్ష పరిచారు. స్వప్న మిష చేత త్రిజట సీతారాముల పరమౌన్నత్య భక్తి భావనను గ్రహించే విధంగా కవి అనువర్తింపజేశారు.

శ్రీరాముడి పుట్టు పూర్వోత్తరాల విశేషాలను, శివధనుర్భంగ దృశ్యాలను కవి పేర్కొన్నారు. దశరథ మహారాజుకు పుత్ర కామేష్టి యజ్ఞ ఫలితంగా రాముడు జన్మించడం, **'హరుని విలునెక్కుపెట్టిన యట్టి రాజవరుడె నా కూతు సీతకు వరుడు'** అని వాగ్దానం చేసిన జనకుడి సభకు వెళ్ళి విల్లువిరిచి తన పరాక్రమం చూపడం, అద్భుతమైన గుణశాలిగా ప్రతిభ కనబరచడం వంటివి భూమయ్య వివరించారు.

త్రిజట స్వప్నంలో రాముడి జీవనగాథనంతా అవలోకించింది. రామ తత్త్వంలోని అద్భుతమైన సంఘటనలను చూసింది. పుట్టుక, వివాహమే గాక; సాహస కృత్యాలను స్వప్నంలో దర్శించింది. విశ్వామిత్రుడితో వెళ్ళి అస్త్ర శస్త్ర విద్యలను అభ్యసించి, తాటకిని చంపి, ముని నిర్వహించే యాగాలకు రక్షణ ఉండి ఆశీస్సులందుకున్న సన్నివేశాలను కలగన్నది. కైకేయి కోరిన విధంగా అరణ్యవాసం చేసి, ఋషులు, యోగుల క్షేమాన్ని కాంక్షించి రాక్షసులను సంహరించిన విషయాలను ప్రత్యక్షంగా చూసింది. శూర్పణఖ యొక్క మోహపు భ్రాంతిని తొలగింపజేసిన ఘట్టాన్ని కూడా తిలకించింది. సీత అపహరణ తర్వాత శ్రీరామచంద్రుడు చెట్టులనక, పుట్టలనక తిరుగుతూ పరితపిస్తూ శబరి ఆశ్రమంలో విశ్రాంతి తీసుకొన్న దృశ్యాన్ని త్రిజట తన స్వప్నంలో అనుభూతి చెందింది. వాలిని వధించి, సుగ్రీవుడితో చెలిమిచేసి కిష్కింధకు ప్రభువును చేసిన వైనాన్ని; ఆంజనేయుడిని శ్రీరామచంద్రుడు ఆది నుండి అంతం వరకు అగ్ని సాక్షిగా దాసుడిని చేసుకొన్న పరమ పవిత్ర స్వప్న సన్నివేశాలను త్రిజట తన రాక్షసాంగనలకు సాక్షాత్కరింపజేసింది.

త్రిజట తన స్వప్నంలో కనిపించిన శ్రీరాముడి ప్రతిరూపాన్ని, శౌర్యాన్ని, వీర పరాక్రమ పాటవాన్ని, గుణశీల ప్రాధాన్యాన్ని వివిధ పాదాంతాలలో అనుమాండ్ల భూమయ్య కొనియాడారు.

**కంటి రోమాంచము కలుగ కంటికలను (ప.11)**
**కలగంటి శ్రీరాము కలనుగంటి (ప.12)**
**కంటి కనుగొంటి శ్రీరాము కలనుగంటి (ప.17)**
**మహా పరాక్రమ గుణశాలి అగు శ్రీరాముగంటి (ప.18)**
**కమలదళ నేత్ర శ్రీరాము కలనుగంటి (ప.19)**
**శ్రీరామచంద్రు మహస్సుగంటి (ప.20)**
**రాముపద సరోరుహములగంటి (ప.21)**
**బలశాలి శ్రీరాము స్వప్నమునగంటి (ప.22)**

స్వప్నంలో శ్రీరామచంద్రుడి తాత్త్విక భావనను పరిపూర్ణంగా గ్రహించిన త్రిజట మనస్సు అనేక విశేషాంశాల భావనతో గుంభనమైంది. స్వప్నం ఆంతర్యంలో త్రిజటకు **"రామదర్శనమయ్యె, నేత్రములు ధన్యమయ్యె, జన్మజన్మల పాపమంత పోయె, ఈమె దర్శనమున పుణ్యమేదొ చేరినట్లు, పుట్టువు ధన్యమమైనట్లు తోచె"** అని కవి సంప్రాప్తింపజేశారు.

## ✦ వేయి హంసల శిబిక...

**వెలుగులీను శ్వేతాంబరములు ధరించి**
**వేయి హంసలు శిబికను మోయుచుండ**
**తమ్ముడు జతగా గగన పథమ్ము నుండి**
**వచ్చె శ్రీరాముడిటకు నా**
**స్వప్నమందు (పుట.50)**

శ్రీరాముడి ఆగమనాన్ని సూచించే పద్యమిది. లంకానగరానికి రాముడు ఏ ప్రకారంగా విచ్చేస్తున్నాడో త్రిజట రాక్షస స్త్రీలకు నివేదిస్తుంది. లక్ష్మణుడి సమేతంగా వేయి హంసల శిబిక (రథం) పై ఆకాశమార్గంలో అరుదెంచుచున్న త్రిజట స్వప్న వృత్తాంతం కనులకు కట్టినట్లుగా కవి వర్ణించారు.

సీత భాగ్యవంతురాలు. ఆమెను ఆశ్రయించిన చాలు అనుగ్రహిస్తుంది. జన్మకు సార్థకతను కలిగిస్తుందని త్రిజట భావిస్తుంది. సీత ఎల్లప్పుడు శ్రీరాముడినే స్మరించడం వల్ల ఆ స్మరణే త్రిజటకు మంత్రమైనట్టుగా, ఆ మంత్ర స్మరణ చేతనే రామచంద్రుడు అనుగ్రహించి తన స్వప్నంలో కనిపించినట్లుగా వినమ్రంగా త్రిజట రాక్షస స్త్రీలతో విన్నవిస్తుంది. కవి ఈ కల ప్రస్తావన చేస్తూ త్రిజట కల నిజమవుతున్న సంకేతాన్ని తెలియజేస్తారు. కల భయోత్పాతాన్ని, గగుర్పాటు కలిగించే విధానంతో త్రిజటను చిత్రించారు.

త్రిజట మరొక మాట చెబుతుంది. అదేమిటంటే సీతకు ఎడమ కన్ను అదురుతున్నట్టుగా గమనిస్తుంది. దీని సంకేతాన్ని కూడా పేర్కొంటూ రాముడికి విజయం, రావణుడికి నాశనం, లంకాపురికి దహనం సంభవిస్తుందని నివేదిస్తుంది. సీత పడిన కష్టాలకు పరాకాష్టగా లంకాదహనం జరుగుతుందని చెబుతుంది. కొమ్మల మీద పక్షులు కూడా ఆనంద పరవశంతో **'శ్రీరాముడరుదెంచునటకు'** అని స్వాగతం పలుకుతున్నాయని భవిష్యత్ దృశ్యాన్ని ప్రత్యక్షంగా వర్ణిస్తుంది. ఆ స్వాగత పలుకులు సీతకు అభయాన్ని తెలిపి స్వాంతన పరుస్తున్నట్టుగా రాక్షస స్త్రీలకు వివరిస్తుంది.

త్రిజటకు వచ్చిన కలను గూర్చి చెబుతుండగా సీతకు మనస్సులో త్రిజటపై స్నేహభావం కలుగుతుంది. హృదయ సదృశంగా త్రిజటవైపు సీత చూస్తుండగా స్వప్న వృత్తాంతాన్ని కొనసాగించిందని కవి చమత్కరించారు. రాక్షస స్త్రీలను ఏవిధంగా కట్టడి చేసిందో త్రిజట క్రింది పద్యంలో కవి పేర్కొన్నారు.

**ఇపుడు మీకొక మాట విన్పింతు, మనసు**
**పెట్టి వినుడు, సీతను భయపెట్టవలదు**
**చంపి తిందు మన వలదు; చంపు కొందు**
**రటవె మిము మీరలే? తిందురటవె**
**మిమ్ము? (పుట.53)**

రాక్షస స్త్రీలను హెచ్చరిస్తూ సీత పాదాలకు సాగిలబడి మ్రొక్కుమని ఆదేశిస్తుంది. సీత పట్ల మనం చేసిన పాపకార్యాలకు అంతం కలుగుతుంది. **"పెద్దదిక్కు నీవే మాకు, రక్షింపుము నీవె"** అని సీతను ప్రార్థించాలని సూచిస్తుంది. సమస్తం గెలిచిన రావణుడు సీతను గెలువకపోవడం, శివుని విల్లువిరిచి సీత హృదయాన్ని శ్రీరామ చంద్రుడు గెలువడం వంటివి రాక్షస స్త్రీలతో

చెబుతూ శ్రీ సీతారాముల ప్రేమానురాగాలను, అందచందాలను కలలో చూచిన విశేషాలను పంచుకుంది. రావణుడికి ఎంత శక్తి ఉన్నా పనికి రాదని నిర్దేశిస్తుంది. త్రిజట మాటలతో భయాందోళనలకు గురి అయిన రాక్షస స్త్రీలు త్రిజటకు వచ్చిన పూర్తి స్వప్న వృత్తాంతాన్ని చెప్పమని ప్రాధేయపడతారు.

**విన్న మీకింత భయమయ్యె, కన్న నాకు**
**భయమదెంత కల్గినదొ చెప్ప**
**తరమగునె!** (పుట.56)

అంటూ భయం భయంగానే కలను చెప్పసాగింది. కవి అనుమాండ్ల భూమయ్య త్రిజట చిత్తవృత్తిని స్వప్న వృత్తాంతంలో ప్రదర్శించారు. ఈ సందర్భంలోనే ఆంజనేయుడి ప్రస్తావన వస్తుంది. అంతవరకు చెట్టు మీద ఉన్న హనుమంతుడికి రామనామం ఒక మంత్రంగా వినిపించి త్రిజట స్వప్నంలో రామతత్వాన్ని చూసి మ్రొక్కినాడని కవి వర్ణించారు.

త్రిజట కలను ఎక్కడ చెప్పడం ఆపిందో; అక్కడి నుండి మళ్ళీ ప్రారంభించింది. శ్రీరాముడు శిబికను ఎక్కి లక్ష్మణ సమేతంగా వస్తున్న చిత్రాన్ని చూపింది. తెల్లని వస్త్రము, తెల్లని పుష్పమాలలు, తెల్లని వేయి హంసలను వర్ణిస్తూ ఆకాశమంతా తెల్లదనంగా తోచి త్రిజట మనస్సులో పెను చీకట్లను పెకిలించి వేసినట్లుగా కవి అభివ్యక్తీకరించారు. సీత కూడా త్రిజట స్వప్నంలో కనిపించినట్లు, తెల్లని వస్త్రాలు ధరించి చుట్టూ పొంగుతున్న తరంగ కడలి కలిగిన పర్వత శిఖరంపై నిలిచినట్లుగా వర్ణించారు. త్రిజట అప్రతిమాన దృశ్యాన్ని క్రింది పద్యంలో...

**మరొక అద్భుత సన్నివేశాన్ని గూర్చి త్రిజట రాక్షసాంగనలకు చెబుతూ - కలలో రాముడెక్కిన ఏనుగు రామాజ్ఞను హృదయంలో నిలుపుకొని సీతముందు నిలువగా; సీత ఏనుగు మూపుపై ఎక్కి సిగ్గుపడిన దృశ్యాన్ని కళ్ళకు కట్టినట్లు వివరించింది. దంతిని ఎక్కిన సీతను తన ఒడిలో కూర్చుండబెట్టుకొన్నాడట శ్రీరాముడు ఆ జంట రూపం త్రిజట గుండెలో అచ్చు గుద్దినట్లుగా రూపుదిద్దు కున్నదని కవి పేర్కొన్నారు.**

**హంసల శిబిక నెక్కి ఆ ఆకసమ్ము**
**నందు రామచంద్రుడు**
**వెలుగొందుచుండ**
**ఇచట పర్వతాగ్రమున శోభించె సీత**
**ఏమి ఈ దృశ్య! మీ జన్మకిదియె**
**చాలు** (పుట.58)

అంతలోనే సీత ఒక కాంతి రూపంగా వెలుగొందుతూ శ్రీరాముడి దివ్యమైన మహోజ్వల నీలదేహంతో చేరిపోయినట్లు త్రిజట స్వప్నంలో తిలకించింది. ఒక కాంతి కిరణం సూర్యుడిని కలిసినట్లు సీత ఇనకులేశ్వరుడిని చేరినట్లుగా వివరించింది. ఈ కల తనకు ఒక పాఠం చెప్పడానికే వచ్చి ఉండవచ్చని భావించింది. ఇది తనకు బ్రతుకు పరమార్థ మూర్తిని దాల్చిందని సంతోషించింది.

### ✦ మహా చతుర్దంతి దంతి...

**సీత రాముని ఆ రీతి చేరుకొనిన**
**యంత పర్వతాకారమౌ దంతి ఒకటి**
**కానవచ్చె, ఆ రామ లక్ష్మణులు దాని**
**నెక్కి గగన వీధిని సంచరింప గంటి**
(పుట.60)

ఆ దంతి పర్వతాకారాన్ని కలిగి ఉందట. నల్లని ఛాయాస్ఫుటం. అది మహా చతుర్దంత దంతి. రామ లక్ష్మణులిద్దరూ ఆ దంతిని ఎక్కి ఆకాశమార్గంలో సంచరిస్తున్నట్టు కవి అనుమాండ్ల భూమయ్య వర్ణించారు. ఆ దంతి లంకను పెకిలించి, సముద్రంలో ముంచివేస్తుందేమోనని త్రిజట అనుమానం. శ్రీరాముడి దరహాసాన్ని, శ్వేత వస్త్రముల కాంతిని కవి వర్ణించారు.

**చేరవచ్చె శ్రీరాముడు సీత వైపు**
**శ్వేత వస్త్ర మాల్యమ్ముల చేత వెలుగు**
**జిమ్ము రాముడు సీతను చేరవచ్చె**
**చేరవచ్చు రాముని జూచి సీత మురిసె**
(పుట. 61)

సీత తన ప్రాణనాథుడిని చూసిన తర్వాత వియోగం తొలగిపోయి తపం పండినట్లుగా సీత మురిసిందని త్రిజట పొంగిపోయింది. శ్రీరాముడి రాకను, సీతమ్మ మురిపాన్ని త్రిజట అద్భుతంగా వర్ణించింది. మదహస్తి తన పెద్ద కరమునెత్తి ఆనంద ఘీంకారం చేసినట్లుగా, సీత పాలసముద్రం లాగా మురిసిపోయినట్లుగా త్రిజట మనో స్వప్నాన్ని కవి చమత్కరించారు.

మరొక అద్భుత సన్నివేశాన్ని గూర్చి త్రిజట రాక్షసాంగనలకు చెబుతూ - కలలో రాముడెక్కిన ఏనుగు రామాజ్ఞను హృదయంలో నిలుపుకొని సీతముందు నిలువగా; సీత ఏనుగు మూపుపై ఎక్కి సిగ్గుపడిన దృశ్యాన్ని కళ్ళకు కట్టినట్లు వివరించింది. దంతిని ఎక్కిన సీతను తన ఒడిలో కూర్చుండబెట్టుకొన్నాడట శ్రీరాముడు. ఆ జంట రూపం త్రిజట గుండెలో అచ్చు గుద్దినట్లుగా రూపుదిద్దు కున్నదని కవి పేర్కొన్నారు. వారు ఆది దంపతుల లాగా ప్రత్యక్ష మయ్యారట. ఆ దర్శన భాగ్యముతోనే జన్మజన్మల తపములన్ని సార్థకమవుతాయని త్రిజట ఆశావాహ దృక్పథంతో రాక్షస చెలియలతో నివేదిస్తుంది.

త్రిజట చెబుతున్న స్వప్న ధోరణిని చూసి రాక్షస భామలకు స్వప్నంలో కనిపించిన శ్రీరాముని చూడాలనే ఉత్సాహం పెరిగింది. త్రిజటలో వచ్చిన మార్పునకు స్వప్నమే కారణమని భావించి కలలోని కథను చెప్పమని ప్రాధేయపడ్డారు.

### ✦ అష్ట వృషభముల రథం...

అంతవరకు సీత ఏనుగునెక్కి ఆకాశంలో సాగి వచ్చిన దృశ్యం త్రిజట మనసులో ఉండగా; కవి భూమయ్య మరొక సన్నివేశాన్ని కల్పించారు.

**రాముడష్ట వృషభముల రథమునెక్కి**
**ఇచ్చటికె రాముడు తనంత వచ్చినాడు**
**ఇంతలో పుష్పక విమానమెక్కి ఉత్త**
**ర దిశ కేగగంటి, కనుల ప్రభల చిమ్మ**
(పుట.65)

అంటూ సీతాసమేతంగా లక్ష్మణుడి తోడ ఉత్తర దిశకు వెళుతున్న శ్రీరాముడి ఘనకీర్తిని పలు పలు రకాలుగా రాక్షసాంగనలకు వివరించింది. రాముడి దయతో అమృతత్వం పొంది మృత్యువును తరించినట్లుగా త్రిజట పేర్కొన్నది. ఒక మంచి సందర్భాన్ని దీనికి ఆపాదిస్తూ కవి **'పూర్వ జన్మ సుకృతమిది కాని ఈ జన్మ సుకృతమేది!'** అని త్రిజట పొందిన అనుభూతిని వర్ణించారు. ఈ పునర్జన్మను ప్రసాదించింది. శ్రీరఘు రాముడే అని త్రిజట గాఢంగా విశ్వసించింది.

త్రిజట స్వప్న వృత్తాంతం వింటున్న ఆంజనేయుడికి ఒకింత ముచ్చట కలిగిందట. ఈ సందర్భంలో రామ పాదం సోకి రాతి నాతిగా మారిన సన్నివేశం ఆయనకు గుర్తొచ్చింది. ప్రస్తుతం త్రిజట స్వప్నంలో రాముని దర్శనం ద్వారా త్రిజట పావని అయ్యిందని మనస్సులో భావించాడు.

శ్రీరాముడి దివ్యత్వ రూపాన్ని స్వప్నంలో దర్శించిన త్రిజట రావణుడిని ఏవిధంగా చూసిందో తోడి రాక్షసాంగనలతో వివరిస్తుంది. అత్యంత భయంకరంగా మారిపోయిన రావణుడి స్థితిని ఆచార్య అనుమాండ్ల భూమయ్య వర్ణించారు.

**తనువు నందు తైలము పూసుకొని గంటి**
**తనివి తీర తైలమ్మునే త్రాగ గంటి**
**రక్త మాల్యమ్ములను దాల్చి రక్త వర్ణ**
**వస్త్రములు దాల్చిన మన రావణుడి**
**గంటి** (పుట.70)

అటువంటి ఆకారంలో ఉన్న రావణుడుని, అతని పుష్పకవాహనం నుండి కిందికి పడద్రోసి నలుపు వస్త్రాలు ధరించిన స్త్రీ ఈడ్చుకొని వస్తున్నట్టుగా త్రిజట పేర్కొన్నది. కలలో రావణుడి శిరస్సు ఛేదించబడిందని, భ్రాంతి చిత్తుడై నర్తిస్తూ నవ్వుతున్నాడని అభివర్ణించింది.

**గాడిదల రథమెక్కి శీఘ్రముగ దక్షి**
**ణానకేగు రావణుగంటి; అంతలోనె**
**గార్దభము నుండి తలక్రిందుగా పడంగ**
**గంటి; మల పంకమున కూలగంటి**
**కలను** (పుట.71)

రావణుడి గతి ఏవిధంగా మారిందో త్రిజట స్వప్నంలో ప్రత్యక్షపరిచారు కవి. భవిష్యత్ వినాశనం, ప్రళయం వంటివి కలలో ప్రాధాన్యం వహించాయి. ఇంద్రజిత్తు మొసలిపై, కుంభకర్ణుడు ఒంటెపై, దశకంఠుడు పందిపై, దక్షిణ దిక్కుగా పరుగులు పెడుతున్న దృశ్యం స్వప్నంలో కనిపించింది. లోకంలో అత్యంత సుందరమైన లంకానగరం, గజములు, తురగములు, రథములు కూలి సముద్రంలో మునిగిపోయినట్లు త్రిజట భ్రాంతి చెందింది. లంకను ఒక వానరం తన తోకతో తగులబెట్టినట్లు కూడా రాక్షస స్త్రీలతో చెబుతుంది. ఇక లంకానగరంలో రాక్షసులందరూ తైలం త్రాగి, రక్త వర్ణ వస్త్రాలను ధరించి, వాయిద్యాల మ్రోతతో ఆడిపాడుతున్న తీరును కవి వర్ణించారు. రాక్షసాంగనలు కూడా నూనె త్రాగుతూ భస్మరాసులలో పడిపోతున్నట్లు త్రిజట వివరించింది. ఇక లంకకు విభీషణుడే రాజుగా అతడు కూడా శ్వేతాంబరాలు ధరించి ఆకాశంలో వైభవోపేతంగా వెలుగొందుతున్నాడని వర్ణించింది.

కవి ధర్మ సూత్రాన్ని ఈ సందర్భంలో ప్రస్తావిస్తూ **"పాపమేనాటికైనను పట్టి కుడుపునంచు; చేయుదమిపుడైన మంచి ఒకటి"** అని పేర్కొన్నారు. అందువల్ల సీతను భక్తితో ప్రార్థిద్దామని త్రిజట రాక్షసాంగనలతో నివేదిస్తుంది. పరిపూర్ణ స్థితిని వర్ణిస్తూ సీత అపుడు ఓంకార జపం చేసేదని, ఇపుడు ఓంకారమైనట్లుగా త్రిజట ఉన్నతీకరించింది.

### ✦ త్రిజట స్త్రీత్వ భావన...

**స్త్రీలమైన మనము సాటి స్త్రీని ఇట్టు**
**లింత భయపెట్టనేరాదు, ఇంత కాల**
**మడవులందు తపమొనర్చి**
**అరుగుదెంచె**
**ఈమె తపమె ఈమెకగు శ్రీరామరక్ష**
(పుట.75)

సాటి స్త్రీగా త్రిజట సీతపై మమకారం చూపే తత్వాన్ని ఏర్పరచుకుంది. తోటి స్త్రీలలో పరస్పర సహకారం, సహాయం, మనోధైర్యం పెంపొందింపజేయాలని సంకల్పించుకుంది. కవి భూమయ్య స్త్రీ మనస్థితిని ప్రదర్శించారు. స్త్రీలందరూ తమ సానుకూల హక్కుల కోసం కలిసికట్టుతనాన్ని ప్రదర్శిస్తారని ఈ పద్య పాదాలు నిరూపిస్తున్నాయి. సామాజిక అవరోధాలు ఏర్పడినప్పుడు సమిష్టి వ్యవస్థ తోడ్పాటు ఎంత అవసరమో ఈ మాటలు తెలియజేస్తాయి. **'ఈమె సీతా మహాలక్ష్మి; ఈమెనింక పరుష వాక్కుల బోధింపవలదు మనము'** (పుట.76) అని రాక్షస స్త్రీలకు త్రిజట సర్దిచెబుతుంది. మానవులైన, రాక్షసులైన, దేవతలైన స్త్రీల కోణం నుండి చూస్తే ఒక స్త్రీ పడే కష్ట నష్టాలు, దు:ఖం, బాధ వంటివి అనుభూతిలోకి తెచ్చుకుంటారనేది వాస్తవం. సహజమైన దయ, కరుణ, అనురాగం, ఆప్యాయత, ప్రేమ, స్నేహం, భక్తి, వాత్సల్యం వంటివి ఏ వర్గంలోని స్త్రీకైనా ఒకే రకంగా ఉత్ప్రేరకం అవుతాయనేది సత్యం. సీతకు ఆత్మ నిబ్బరాన్ని కలిగించడం కోసం త్రిజటతో పలికించిన వాక్కులు - **'రాముడరుదెంచు నికముందు క్షేమమగును / నీకటంచు ధైర్యము చెప్పి సాకవలయు'** (పుట.76)

### ✦ ఆధ్యాత్మిక చింతన...

త్రిజటలో కవి అనుమాండ్ల భూమయ్య ఆధ్యాత్మిక భావతత్వాన్ని కలిగింపజేశారు. స్వప్నవశంతో త్రిజట రామతత్వం నిగూఢపరుచుకొని కార్యస్థితిని నెరవేర్చింది. అచంచల స్థితి సంస్కారాన్ని పొందింది.

**ఈ శరీరమే రథమని ఎరుక పరచి**
**బుద్ధి ఒక సారథియను ప్రబోధమెదను**
**కురిసి, మనసు కళ్ళెమటంచు ఎరుగజేసి**
**రాముడే నన్ను నడిపించు రథికుడయ్యె**
**(పుట.77)**

అని త్రిజట ఇంద్రియ సుఖముల పరిత్యాగిగా కవి భూమయ్య చిత్రించారు. సీతారామతత్వ సాదృశ్య భక్తి తప:ఫలాన్ని త్రిజట స్వప్నంలో ఆస్వాదించింది. ధన్యతను సాధించింది. సీతా సంసేవితంలో తరించింది.

కవిత

# ముత్యాల హారాలు



**సభావట్ చంటి**, 9వ తరగతి, 7013264464

అమ్మ ఒడి మన ఇల్లండి.
రక్షణను ఇస్తుందండి.
సందడిగ ఉంటుందండి.
మనకు నివాసం కదండి

లక్ష్మీదేవి ఆవు రా!
గోమాతను పెంచరా!
స్వచ్ఛని పాలు తాగరా!
హాయిగా ఉండరా!

చెత్త బయట వేయకండి.
స్వచ్ఛతను పాటించండి..
పరిశుభ్రంగ ఉండండి.
రోగాన్ని తగ్గించండి.

అవనికే అందం నది.
మంచి నీటిని ఇస్తుంది.
పాపాన్ని తొలగిస్తుంది.
పుణ్యాన్ని అందిస్తుంది.

సాయం కలిగుండండి.
సహాయాన్ని చేయండి.
పుణ్యాన్ని పొందండి.
ప్రేమతో నడవండి.

పట్టణం వద్దురా!
పల్లెటూరే ముద్దురా!
ప్రకృతిలో ఉండరా!
సంతోషంగ ఉండరా!

ఉన్న ధనం చాలండి.
అత్యాశ వద్దండి.
ఆపదలో పడకండి.
దానితోనే సాగండి.

ఆవేశం వద్దండి.
అదే మనకు ముద్దండి.
ఆలోచించి నడవండి.
హాయిగాను సాగండి.

టీవి చూచుట మానండి.
చరవాణిల వాడకండి.
సిగ్నల్స్ తగ్గించండి.
పక్షులను రక్షించండి.

చదువు ఇస్తుంది వెలుగు.
జ్ఞానంతోనే మెలుగు.
లక్ష్యం బాటను ఎరుగు.
మంచి పేరు నీదగు.

ఓటమితొ పోరాడండి.
గెలుపును అనుసరించండి.
గెలుపు రుచి చూడండి.
అదే మీకు సొంతమండి.

ఆనందాన్ని ఇస్తుంది.
మంచి పేరును తెస్తుంది.
ముందుకు నడిపిస్తుంది..
గెలుపు, రుచి చూపిస్తుంది.

చదువంటె ఆసక్తి మాకు.
ఆటలంటె ఇష్టం మాకు.
గురువంటే గౌరవం మాకు..
ఆశీస్సులు ఇచ్చె మాకు.

భయాన్ని తొలగించండి.
ధైర్యంతో ఉండండి.
గెలుపునూ పొందండి
ఆనందంతో సాగండి.

చదువును ప్రేమించండి.
ఆటలను ఆడండి.
గురువులను గౌరవించండి.
మీ లక్ష్యంతో నడవండి.

ప్రయత్నిస్తు ఉండండి.
ప్రయాసతో సాగండి.
ఫలితాన్ని సాధించండి.
హాయిగా సాగండి.

ఇతరుల ధనం వద్దండి.
అసూయను పడకండి.
ఉన్నది మనకు చాలండి.
ఆనందంగ సాగండి.

భారాన్ని మోస్తాయి.
ఆపద ఎదుర్కొంటాయి.
మనల్ని రక్షిస్తాయి.
పాదరక్షలు అవుతాయి.

సున్నితంగ ఉండండి.
సున్నితంగ పలకండి.
మంచిగ ప్రవర్తించండి.
మంచి పేరు పొందండి.

నికృష్టంగ ఉండకండి.
నీచంగ మారకండి.
నిదానంగ ఉండండి.
నవ్వుతూ నడవండి.

తొందర అసలు పడకండి.
నిదానంగ ఉండండి.
నిర్భయముగ సాగండి.
మంచిగను నడవండి.

(నవంబర్ 14, బాలల దినోత్సవ సందర్భంగా...)

కథ

# మంగ్లీ

**పేద పిల్ల కష్టం చెప్పిన కథ...**




**అన్వర్**
98660 89066


ట్రైన్ మెత్తగా ఉల్లాసంగా ఊరుకుతోంది. అందమైన అమ్మాయి ముఖం మీద చిరుగాలికి అటు ఇటూ కదిలే ముంగురుల్లాగా ట్రైన్ లయబద్ధంగా ఊగుతోంది. సీట్లకు సరిపడా వున్న జనాలు పిచ్చాపాటి మాట్లాడుకుంటూ ఊగుతున్నారు బోగీ నిండా. 'అయ్యా! ధర్మం సేయండి' అని అడుక్కునేవాళ్లు కూర్చున్నవాళ్ల ముఖం మీదే చేయిపెట్టి అడుక్కుంటున్నరు. ట్రైన్ కదులుతుంటే ఆ చేయి కూర్చున్న పాసింజర్ల మూతికి ముక్కుకు తగులుతున్నది. 'ఛీ, అటు పో' అని చీదరించుకుంటు కొందరు, 'చిల్లర పైసలు లేవు' అనుకుంట ఇంకొందరు ఇబ్బంది పడుతున్నరు. 'ధర్మం సేయండి బాబో. పుణ్యం వస్తది. దేవుడు మిమ్ముల్ని కాపాడుతడు' అరుస్తున్నడు ఓ ముసలోడు రాగయుక్తంగా చేతుల వున్న పైసలు ఊపుకుంటా.

'సమోస, వేడి వేడి సమోసా' అని అమ్ముకునే అతను వెరైటీగా అరుస్తుంటే పిల్లలు కావాలని గోలగోల చేస్తున్నరు. 'పల్లీలు, ఉడకపెట్టిన పల్లీలు, కాల్చిన పల్లీలు' అంటూ దూరంగా ఓ పరిచయమున్న సన్నని గొంతు హుషారు పుట్టిస్తున్నది. నడుం మీద పల్లీలబుట్ట పెట్టుకొని కదులుతున్న ట్రైన్‌లో సుతారంగా నడిచొస్తోంది మంగ్లీ. మంగ్లీ తెచ్చే పల్లీలు బాగుంటాయి. మంగ్లీ మాటలు బాగుంటాయి. పల్లీల పొట్లం చేతిల పెట్టి కండ్లల్ల కండ్లు పెట్టి చూసే మంగ్లీ చూపులు బాగుంటాయి.' తీసుకోరాదుండ్లీ సారూ' అని మంగ్లీ మూతి తిప్పుకుంట, తలూపుకుంట అడిగిందే అనుకోండి, రోజూ షటిల్ సర్వీస్ చేసే నాలాంటి పాసింజర్ల వశం కాదు. తీసుకున్నమా, 'ఒక్కరే తీసుకుంటరా, పక్క సార్‌కు ఇయ్యురా, ఈ సార్‌కు ఇయ్యురా, ఆ సార్‌కు ఇయ్యురా' అని చూపుల్తోనే ఎన్నో భావాలు పలికిస్తది మంగ్లీ. పది రూపాయల పల్లీలు కొని మంగ్లీతో పది నిమిషాలు మాట్లాడతరు ఒక్కొక్కరు. మంగ్లీ దగ్గర పల్లీలు కొన్నా, కొనకపోయినా విసుక్కోదు. చికాకు పడదు. నవ్వు చెక్కు చెదరనీయదు. మాటలు తేడా రానీయదు. పోవాలే, పోవాలే అని తొందరేం చేయదు. అప్పటిదాకా తీసుకోనోళ్లు మంగ్లీ మాటల్లో పడి, చూపుల్లో పడి, నవ్వుల్లో పడి పది నిమిషాల తర్వాతైనా తప్పక పల్లీలు తీసుకుంటరు. మంగ్లీ పల్లీల పొట్లం చేతుల పెడుతున్నప్పుడు కదులుతున్న ట్రైన్‌లో చేతులు అనుకోకుండా తగులుతయ్. కొందరు కావాలనే తగిలిస్తరు. ఎవరన్నా ఏమన్నా అంటే 'ఎవరెసంటోల్లో నాకు తెల్వదా సారూ' అంటది కిసుక్కున నవ్వుకుంట. 100 రూపాల నోటిస్తే బొడ్లే వున్న సంచిలకెళ్లి చిల్లర తీసిస్తది. అదే ఐదు వందల రూపాయల నోటిస్తే 'ఛాతిలకెళ్లి తీసి చిల్లరిస్తది. అప్పుడు సూడాలే మంగ్లీ అందాలు - చెదిరిపోయిన పైట నుంచి బయటపడే బిగుతైన వక్షోజాలు ఒక ఐదు నిమిషాలు అక్కడున్న మగోళ్ల మతుల్ పోగొడుతయ్.' పది రూపాల పల్లీలకు ఐదొందల నోటు ఇస్తవా సారూ 'అని పైట పక్కకు జరిపి జాకెట్ల వున్న డబ్బులు బైటికి తీస్తది.

మంగ్లీని చూస్తుంటే ఎక్కడలేని బాధైతది. మంగ్లీ చదువుకుంటే గొప్ప స్థాయిలో ఉండేది. లేదా వేరే కులం వాళ్ల ఇండ్లల పుట్టివుంటే ఈ పనికిమాలిన పని చేసుకుంట బతకాల్సి రాకపోయేది. ఏదైన ఇంట్లో పనిచేసుకు బతికినా ఆ ఇంటికి మహారాణిలా వెలిగిపోయేది మంగ్లీ. మంగ్లీ అందానికి తగ్గట్టుగా, ఆమె జీవితం గొప్పగా లేదనే ఆలోచనలు నా మనసుచుట్టూ అల్లుకుంటుంటే 'సార్, పల్లీలు తీసుకోండి. స్టేషన్ వస్తాంది, దిగిపోతా' అన్నది మంగ్లీ. నేను దిగే స్టేషన్ కూడా ఇదే కాబట్టి వెంటనే పల్లీలు తీసుకున్నా. ఆ పల్లీల్ని బ్యాగులో పెట్టుకొని లేచి దిగడానికి డోర్ దగ్గరికి వచ్చిన.

ట్రైన్ ఆగింది. పాసింజర్లందరం దిగుతున్నం. ట్రైన్ వెళ్ళడానికి సిద్ధమవుతోంది. ఇంతలోపే ఒక

కథ

'మంగ్లీకి రేషమెక్కువ. మగోళ్లందరూ ఒక్కసారి, ఒక్కసారి అని మూతులు నాకుతుంటే రోడ్డు మీద పనిచేసుకుని బతికే ఆడది ఎట్లా బతుకుతది సారూ. ఆ యావ లేని పౌరుషం గల్ల ఆడది మా మంగ్లీ. ఏ ఆడది ఎటువంటిదో తెలుసుకొని సావరు ఈ మగ బాడుకావులు'. వాడు, ఆ పోలీసు బాడుకావ్, 'పల్లీలు అమ్ముకునే దానివి, చిల్లర మల్లర తిరిగే దానివి 'నేనడుగుతే కాదంటవా? నీ సంగతే చూస్తా' అని చెప్పి 'గొడ్డును బాదినట్టు బాది సంపేసిండు సారూ' అని నా కాళ్ల మీద పడి ఏడుస్తుంది ముసలవ్వ. చాలసేపటి తర్వాత లేసి' రైల్వే స్టేషన్‌ల జనాలు గుమిగూడి చూసిండ్లు కనీ ఒక్కరు ఆపకపోతిరి అయ్యా అన్నదో లేదో కానీ నా గుండె కోసినంత పనైంది.

కానిస్టేబుల్ ఒక చేత్తో మంగ్లీ రెక్క పట్టుకొని రెండో చేతిలోని లాఠితో మంగ్లీని చాలా క్రూరంగా గట్టిగా కొడుతున్నడు. జనాలు అందరూ చూసుకుంట పోతున్నరే కానీ ఒక నిరుపేద స్త్రీని అందరి ముందు అలా ఘోరంగా తిట్టుకుంట కొడుతుంటే ఎవ్వరాపడం లేదు.' సార్, మీ కాళ్లు మొక్కుత సార్. ఇడిసిపెట్టుండ్లీ సార్. సచ్చిపోతా సార్. ఇంకొకసారి ట్రైన్ ల పల్లీలు అమ్మను సార్. మంగ్లీ ఏడుస్తూ

మొత్తుకుంటాంది. పోలీసు కాళ్లమీద పడి పొర్లుతాంది. అయినా కూడా ఆ కానిస్టేబుల్ వదిలి పెడుతలేడు. వేరే పల్లీలమ్మేవాళ్లు చాలా దూరం పరుగెత్తి అక్కడి నుంచి తొంగి తొంగి చూస్తున్నరు. ఆ దెబ్బలకు మంగ్లీ వొర్రుతుంటే స్టేషన్ దద్దరిల్లుతున్నది.' అయ్యా, నీ బాంచెన్ సార్, సచ్చిపోతా సార్, ఇడిసిపెట్టు సార్' అని బతిమాలుకుంటా కుప్పగా కూలిపోయింది మంగ్లీ. పల్లీలబుట్ట పట్టాలమీద పడి చెల్లాచెదురై పోయింది. పైసలు అటు ఇటుపడి ఆగమాగమై పోయినయ్. కొట్టడం ఆపి అతను మెల్లగా మంగ్లీ రెక్క వొదిలిపెట్టిండు. మంగ్లీ పిచ్చికుక్క లేసినట్టు లేసి పడుకుంట లేసుకుంట వెనకకు తిరిగి సూడకుండా పరుగెత్తి పరుగెత్తి ప్లాటుఫామ్ చివరెక్కడో పడిపోయింది. కొట్టిన పోలీస్ అక్కడే నిలబడి మంగ్లీ ఆ కొసన కనిపించినంతసేపు చెడ్డ చెడ్డమాటలు తిట్టుకుంట పౌరుషంగా నిలబడ్డడు. ఎదురుగా వున్న క్యాంటీన్ దగ్గరికెళ్లి నిలబడ్డడో లేదో వెంటనే ఆ షాపతను కానిస్టేబుల్ చేతుల కాఫీ పెట్టిండు.

అక్కడ ప్లాట్ ఫామ్ మీద అంతమంది వున్నా, ఒక పోలీస్ ఒక స్త్రీని దారుణంగా కొడుతున్నా ఒక్కరు ఆపలేదు. పల్లీలు అమ్ముకునే తోటి ఆడోళ్లు కూడా 'ఏందీ సారూ' అని అడగలేదు.వాళ్లను కూడా ఎక్కడ తంతడో అని భయం కొద్దీ వాళ్లు ముందే చాలా దూరం పరుగెత్తిండ్లనుకుంటా. ప్లాటుఫామ్ మీద సి.సి కెమెరాలున్నా కూడా అతను కనీసం భయపడలేదు. ఆ పోలీస్ ఎందుకో కావాలనే అంత ఘోరంగా కక్ష తీర్చుకున్నట్లుగా ఎందుకు కొట్టిండో నాకు అర్థం కాక బ్యాగుల వున్న పల్లీల్ని



కథ

చేతుల పట్టుకొని ఇంటిదారి పట్టిన.

నేను రోజు ట్రైన్ ల డూటికీ వస్తూ పోతూనే వున్నా కానీ మల్లీ ట్రైన్‌ల మంగ్లీ ఎప్పుడు కనపడలేదు. ఇతర పల్లీల వాళ్లను మంగ్లీ గురించి అడిగినా వాళ్లెవరు సరిగ్గా మంగ్లీ వివరాలు చెప్పలేదు.

ఓరోజు మంగ్లీని వెతుక్కుంట వాళ్లూరికి వెళ్లిన. మంగ్లీ ఇల్లు గుడిసె. ఇద్దరు ఆడపిల్లలు. ఆ ఇద్దరు పిల్లలు తల్లి లెక్కనే ముద్దుగా, అందంగా వున్నరు. పెద్దపిల్లకు ఇరవై ఏండ్లు వుంటాయేమో. పెండ్లి చేస్తే ఒక బాబు పుట్టిండట. రెండేళ్ల పిల్లగాడు. 'కాన్పుకు తెచ్చిన తర్వాత వాళ్ల అత్త గారోళ్లు మల్లీ రానే లేదట. వచ్చి తీసుకోపోలేదట. పెండ్లి కట్నం పైసలు కొన్ని, పెట్టాల్సిన వస్తువులు కొన్ని బాకీ వుండడం వల్ల అవిస్తేనే తీసుకు పోతామం టున్నారని' ఓ ముసలామే చెప్తుంటే ఆమె మాటలు నా చెవికెక్కడం లేదు. నేను మూగగా, మౌనంగా, భయంగా మంగ్లీ కోసం వెతుకుతున్నను. పెద్దపాప ఉన్న ట్టుండి అక్కడినుండి అటు పక్కకు వెళ్లి పోయింది. చిన్నపాప గుడిసె లోపలికి వెళ్ళింది. ముసలమ్మ మాట్లాడుతూ మాట్లాడుతూ నేను ఇటుతిరిగే వరకు ఆమె కూడా జారుకున్నది. 'అరే, ఎటు పోయిండ్లు వీళ్లు? నాకోసం ఏమైనా చేయడానికి ఇబ్బంది పడడం లేదు కదా' అని నేను ఆతృతగా వెతుకుతున్నాను. 'అమ్మా, అమ్మా' అని అరిస్తే ,'ఆ, సారూ' అంటూ వచ్చింది ముసలమ్మా. టీ, అది ఇది ఏమీ పెట్టకండి. ఇబ్బంది పడకండి' అని, 'మంగ్లీ కనపడుతలేదేంది' అని అడిగేశా.

'అవును సారూ, మీకు మంగ్లీ తెలుసా?' అన్నది ముసలామే. నిజమే, మంగ్లీ నాకు ఎంత తెలుసు? ఏమని చెప్పాలె? వెంటనే నా కర్థం కాలేదు. రోజూ ట్రైన్‌లో పల్లీలు అమ్ముకునే మంగ్లీ నాకు అంతగా పరిచయం లేదని చెప్పాలా? ఇలా వెతుక్కుంటూ వస్తే ఏమైనా తప్పుయితదా? వీళ్ల కులంల ఏమైనా అనుకుంటరా? ఎందుకో, గిల్టీగా ఫీల్ అవుతున్నాను .

అమ్మా, మంగ్లీ లేదా? మళ్లీ అడిగాను. సారూ, మీరు మంగ్లీకి ఏమైనా పైసలు అప్పుగా ఇచ్చారా? భయంగా అడిగింది ఆమె. 'లేదు' అన్నాన్నేను. చాలా మంది 'మంగ్లీ పైసల్ ఇయ్యాలె' అన్నరు. 'మంగ్లీ మా దగ్గర అప్పు తీసుకున్నది' అని కొందరు ఇంటి మీది కొచ్చి అడుగు తున్నరయ్యా' అన్నది. అని 'మరి మంగ్లీని ఎందుకు వెతుక్కుంటూ వచ్చారు సారూ, మంగ్లీతో మీకు ఏమైనా పనుందా?' అన్నది ముసలమ్మ. 'లేదమ్మా' అని, ఎందుకువచ్చిన్నో చెప్పడానికనీ రైల్వే స్టేషన్ల జరిగిన విషయం మొత్తం చెప్పిన.

'అదే ఆఖరు సారూ. మంగ్లీని అందరూ రైల్వే స్టేషన్ నుంచి శవాన్ని మోసుకొచ్చినట్టు మోసుకొచ్చిండ్లు సారూ. వెంటనే దవాఖానకు తీసుకుపోతే ఎవ్వరు పట్టలే. సర్కారు దవాఖానకు తీసుకుపోతే శరీరం మొత్తం రక్తం గడ్డకట్టిందని చెప్పిండ్లు. భరోసా లేదన్నరు'.

మంగ్లీ భర్త తాగి తాగి, మత్తుల చెరువులపడి సచ్చిపోయిండు. ఐదేండ్లయ్యింది. ఆ తర్వాత మంగ్లీ కూలి పని చేసింది. కిరాణం దుకాండ్ల పనిచేసింది. టీ లు చేసి అమ్మింది. ఒక్క పని చేసుకోనీయలేదు మంగ్లీని ఈ పాపిష్టి రండాకోరులు, రోడ్డుమీది మగ పురుగులు.

'మంగ్లీకి రేషమెక్కువ. మగోళ్లందరూ ఒక్కసారి, ఒక్కసారి అని మూతులు నాకుతుంటే రోడ్డు మీద పనిచేసుకుని బతికే ఆడది ఎట్లా బతుకుతది సారూ. ఆ యావ లేని పౌరుషం గల్ల ఆడది మా మంగ్లీ. ఏ ఆడది ఎటువంటిదో తెలుసుకొని సావరు ఈ మగ బాడుకావులు'. వాడు, ఆ పోలీసు బాడుకావ్, 'పల్లీలు అమ్ముకునే దానివి, చిల్లర మల్లర తిరిగే దానివి నేనడుగుతే కాదంటవా? నీ సంగతే చూస్తా' అని చెప్పి 'గొడ్డును బాదినట్టు బాది సంపేసిండు సారూ' అని నా కాళ్ల మీద పడి ఏడుస్తుంది ముసలవ్వ. చాలసేపటి తర్వాత లేసి' రైల్వే స్టేషన్‌ల జనాలు గుమిగూడి చూసిండ్లు కనీ ఒక్కరు ఆపకపోతిరి అయ్యా అన్నదో లేదో కానీ నా గుండె కోసినంత పనైంది.

ట్రైన్‌లో తిరిగి వస్తుంటే 'పల్లీలు, పల్లీలు' అంటున్న గొంతు వినపడ్డది. తిరిగిచూస్తే నా గుండెల్లో రాయిపడ్డది. 'సారూ, పల్లీలు తీసుకోండి' అంటుంది మంగ్లీ పెద్దబిడ్డ.

# లంబాడీలు



పాత్లావత్ పురందాస్ 9వ తరగతి, 7013264464

(నవంబర్ 14, బాలల దినోత్సవ సందర్భంగా...)

వ్యవసాయాన్ని నమ్మిన వాళ్ళం,
తోడు నీడై నడిచే వాళ్ళము.
బుద్ధిబలాన్ని ఎరిగిన వాళ్ళం,
నమ్మకంతో సాగే వాళ్ళము.

భక్తిని కలిగి ఉండే వాళ్ళం,
ప్రేమను మేము చూపే వాళ్ళము.
దయాగుణం కలిగి ఉండే వాళ్ళం,
అత్యాశను ఖండించే వాళ్ళము.

మంచి పేరును పొందిన వాళ్ళం,
కష్టంలోనా ఆదుకునే వాళ్ళము.
సంప్రదాయాలను గౌరవించే వాళ్ళం,
మంచి గుర్తింపు కలిగిన వాళ్లము.

కష్టసుఖాలను అనుభవించే వాళ్ళం,
చెమటోడ్చి పని చేసే వాళ్ళము.
వన దేవతలను పూజించే వాళ్ళం,
వరాలెన్నో పొందే వాళ్ళము.

కవిత

# కిటికీ



పెనుగొండ సరసిజ, 73868 06499

ఆమె కిటికీ తెరుస్తుంది
తెల్లవారగానే తెరవకపోతే
ఏ పని తెమలక
దాన్నలా మూసుంచితే
ఊపిరాడనంతగా ఉబుసుపోక
అలా తెరుస్తుంది.

పళ్ళు తోముతున్నంతసేపు
ప్రపంచాన్ని తెరిపించే
తెరుచుకున్న కిటికీ కిటుకు
ఆమెకు మాత్రమే తెలుసు.

అక్కడినుంచి తలలూపే
పచ్చ పూల గుత్తుల చమక్కుపై మక్కువ
ఆమె మనసుకు తెలుసు

ఏం పచ్చ పూలు?
పూజకు పనికిరావు
స్నేహితురాళ్ళ మాటలు..,

బతుకమ్మ పండక్కి
తంగేడు పూలు తరుక్కుపోతే
వాటి పక్కన చేరి
పరుచుకున్న పచ్చపూలు

పూజకు పనికి రాకపోయినా
పూజించడానికి
పనికొచ్చిన పచ్చపూలు

పూజకు పనికిరాని పువ్వు !
బిడ్డల్ని కనలేని తల్లి !
ఇలాంటి మాటలు ఏమీ సాధించకున్నా
మనసును మాత్రం సాధిస్తాయి.

పొద్దంతా కీచులాడి
రాత్రికి ఏకమయ్యే పిచ్చుకలో ,
రాత్రంతా జగడాల జాగారమో,
కలవరింత కౌగిళ్ళలో కరిగిన గువ్వలో..
ఏదైతేనేమి?
పొద్దున్నే మాత్రం
మరో మాటెత్తకుండా
చెరోపనికి చెట్టా పట్టాలేసుకుపోయే
చెమట గంధపు
ఆ ఆలుమగలును పట్టించే
ఆ కిటికీ నిఘా నేత్ర సూత్రం
చూస్తేగాని తెలియదు.

కాస్త ఎండ తగలగానే
పచ్చని ఆకులను కప్పుకుని మెరిసే
పొద్దు తిరుగుడు పువ్వులోలే
తమ చిరునవ్వుల వెలుగుల్ని
కాస్త  సూర్యుడికద్దే
వెలుగుబాటల అడుగుల బడిపిల్లల
బడాయిమాటల్ని మోసుకొచ్చే
ఆ శబ్దతరంగిణిచెవికి మనసును అంటిస్తే గాని
మజా తెలియదు

అప్పుడప్పుడు కిటికీ పెద్ద పెద్ద
శబ్దాలు తెస్తుంది ఏంట్రా అని
ఆమె గబగబా గంతులేస్తూ చూస్తుంది
సాయంత్రం వచ్చే నల్లానీళ్లకై ఆరాటాలు

మసిగిన్నెలను మెరిపిస్తున్న మట్టిగాజులు
రేపటి మెరుగులకై మురికితో తలపడుతున్న
తల్లులతపనలు
బడి బస్సు దిగొచ్చిన నవ్వుల్ని
అలసిన  పెదాలకు పూసుకున్న అమ్మనాన్నలు
ఎన్ని సంగతుల వార్తావాహినో?
ఆ కిటికీ?

అప్పుడప్పుడు కిటికీని ఆమె మూయడం
మరుస్తుంది వాళ్ళంటారు
కిటికీ ఎందుకు తెరుస్తావ్
దాని చెక్క బాగాలేదు
ఇంకా రంగు వేయలేదు
జల్లు పడుతుంది
సరిగా మూసుకోదు
అయినా ఇంట్లో ఇన్ని తలుపులు
కిటికీలు ఉండగా దాన్నే ఎందుకు?
ఎన్ని ప్రశ్నలు!
అన్నింటికీ జవాబుగా గబుక్కున
గడియ పెడుతుంది
అదిచ్చే వెలుగు మనసును కూడా
వెంటేసుకుపోతుంది.

సెప్టెంబర్ 9న కాళోజీ జన్మదినోత్సవ సందర్భంగా జరిగిన 'జాగృతి కవిసమ్మేళనం'లో చదివిన కవిత

వ్యాసం

# "పగలే వెన్నెల" గీతాల సినారె...!!

సినారె కాయించిన పగటి వెన్నెల...



ఎస్.ఆర్. భల్లం
98854 42642

"పగలే వెన్నెల" కురిపించినవాడు... "వటపత్రశాయికి వరహాల లాలి" పాడినవాడు... "పాట లాధర రాగా భావనలు" వినిపించిన వాడు... "సంగీత సాహిత్య సమలంకృతుడు"... కవిత్వాన్ని జీవితంగా మలచుకొన్నవాడు... "మాటకు పాట రుచి"ని మప్పినవాడు... మానవత్వపు పరిమళాన్ని పంచినవాడు... చేనులో మేనులో ఏమున్నా లేకున్నా తన మాటలో పాటలో మాధుర్యం కలిగినవాడు... "ప్రపంచ పదుల"తో పలకరించినవాడు... "నల్లని రాలలో గుండెల సవ్వడి" విన్నవాడు, కన్నవాడు... ఎవరయ్య ఎవరువాడు...? ఇంకెవరయ్య... 'సినారె మన తెలుగువాడు...!!!

సినారె గొప్ప మరపురాని మధురమైన సినిమా గీతం...! వాక్యం వాక్యంలో చిరుగాలిలా తాకే కవిత్వం.! ఆయనొక గొప్ప "విశ్వంభర" జీవితం..!! మట్టిలో మొలకెత్తిన మనిషి చరిత్ర. ప్రకృతి "పల్లవి" నేపథ్యంగా మ్రోగిన కవితా "చరణ" స్వరం. ఆ కంఠం కమనీయం..! రచనం రమణీయం..!! భాషణం భూషణం...!!! గమనం అభ్యుదయం..!! గమ్యం మానవీయం..!!! పద్యం ఆయన ఊపిరి..! గజల్ సహచరి..!! పాట ప్రాణం...!!! మాట ప్రణవం...!!!

సినిమా పాటతో పాటు పుట్టిన సినారె బహు భళారే..!! అనాలి మరి. ఎందుకంటే తెలుగు సినిమా "టాకీ" యుగం 1931లో ప్రారంభమైంది. సిరిసిల్లా తాలూకాలో 29-7-1931 లో సినిమా అనుబంధమున్నట్లుగా సినారె "హనుమాజి పేట"లో కన్ను తెరిచారు. అంటే సినిమా పాటతోనే ప్రభవించారన్నమాట..!!

అపుడెపుడో కొందరు ప్రముఖ దర్శక నిర్మాతలు శభాష్ రాముడు (ఎన్టీఆర్) పెళ్లిసందడి (ఏఎన్నార్) సినిమాలకి ప్రాధాన్యరహిత ఒక్కో గీతాన్ని రాయమని కోరడం "ఒక కవి ప్రతిభ రచనా శైలి తెలియాలంటే ఒకటీ అరతో కాదు అన్ని పాటలు రాయాలనే ఉద్దేశాన్ని వినయంగా ఎన్టీఆర్ ముందుంచడం, ఆయన ఆహ్వానం మేరకు 1962 నుంచి సినీ పాటలు రాయడం ప్రారంభమైంది. "గులేబకావళి కథ" సినిమాలోని "నన్ను దోచుకుందువటే వన్నెల దొరసాని" అనే పాటతో పాటు అన్నీ పాటలు ఆయనే రాశారు. హైదరాబాద్‌లో ఉద్యోగరీత్యా ఉంటూనే, మద్రాసులోనే ఉండి సినీ గీతాలు రాస్తున్న శ్రీశ్రీ, ఆరుద్ర, ఆత్రేయాది సినీ కవులందర్నీ మించి, ఏటేటా వందకు పైగా గీతాల్ని రచించగలిగారు. ఆ మధ్య కాలంలో వచ్చిన "అరుంధతి", "మేస్త్రి" సినిమాల వరకు సుమారు మూడు వేల వరకు పాటలు రాశారు. "ఏకవీర", "అక్బర్ సలీం అనార్కలి" సినీ ద్వయానికి పాటలతోపాటు మాటలూ రాశారు.

శ్రీశ్రీ అనంతర శబ్ద బ్రహ్మ సినారెయే కాబట్టి మితంగా గాక, అమితంగా రాస్తూనే ఉండడం చేత, భాషాపరమైన ప్రయోగాలు మరెన్నో చేయడానికి అవకాశం చిక్కింది. కొన్ని మురిపించేవి మరిపించేవి మందలించేవి, కొన్ని ప్రకృతి పదులు ప్రణయ గీతులు, నీతి గేయాలు, అన్నీ మనిషి కోసం మనిషి దేవునిగా చూపించడం కోసం. అందుకే సినారె కమనీయుడయ్యాడు కవనీయు డయ్యాడు, మహనీయుడయ్యాడు. మరపురాని మహాస్తవనీయుడయ్యాడు.

ఎన్టీఆర్, ఏఎన్నార్‌లు చిత్రరంగంలో క్రమశిక్షణ తెస్తే, సాహిత్య రంగంలో ఆవిధమైన క్రమశిక్షణ, శ్రమశిక్షణ కూడా తీసుకొచ్చింది మాత్రం సినారె. ప్రాస తానై పాటలల్లి సినీ వినీలాకాశాన్ని ఏలిన రేడు అయిన సినారె కలం పాటల పరిమళాలు కొన్నింటిని మంచిగా, సమంచిగా, ఆఘ్రాణించాలంటే "ఏ పారిజాతమ్ము" లీయగలనో (ఏకవీర) తోటలో నా రాజు (ఏకవీర), నిన్న లేని అందమేదో (పూజాఫలం) ఈ నల్లని రాలలో (అమరశిల్పి జక్కన) గాలికి కులమేది (కర్ణ) నీ పేరు తలచిన చాలు (ఏకవీర), నిదుగన్న కనులే కనులు

(సప్తస్వరాలు) పగలే వెన్నెల (పూజాఫలం), మాయదారి చిన్నోడు (అమ్మమాట), చిగురులు వేసిన కలలన్నీ (పూలరంగడు), నామది పాడిన ఈ వేళలో (పవిత్ర హృదయాలు), మల్లియలారా (నిర్దోషి), మానవజాతి మనుగడకి (మాతృదేవత), అణువు అణువున (మానవుడు-దానవుడు), మధుర భావాల సుమాల (జై జవాన్), నీ చరణ కమలాల (శ్రీకృష్ణావతారం), అన్నయ్య సన్నిధి (బంగారు గాజులు), అలకలు తీరిన కన్నులు (మా నాన్న నిర్దోషి), అనుబంధం ఆత్మీయత (తాతా మనుమడు), లలిత కళారాధనలో (కల్యాణి), సరిలేరు నీకెవ్వరు (కంచుకోట), మెరిసే మేఘ మాలిక (దీక్ష), శివరంజని (తూర్పు పడమర), కనుల ముందు నీవుంటే (చెల్లెలి కాపురం), చరణ కింకిణులు (చెల్లెలి కాపురం), మనసు పలికే మౌనగీతం (స్వాతిముత్యం), వటపత్ర శాయికి (స్వాతిముత్యం), శృతి నీవు గతి నీవు (స్వాతి కిరణం), అభినవ మందార మాల (తాండ్ర పాపారాయుడు), నన్ను దోచుకొందువే (గులేబకావళి కథ), అందాల నా రాజు (మంగమ్మ శపథం), గోరంత దీపం (గోరంత దీపం), ఏదో అన్నది (ముత్యాల ముగ్గు), భలే మంచి రోజు (జరిగిన కథ), చిత్రం బళారే విచిత్రం (దాన వీర శూర కర్ణ), జేజమ్మ (అరుంధతి), కడవ మీద కడవ పెట్టి (ఒసే రాములమ్మ), ఇత్యాది గీతాలు అమృత తుల్యం.

సినారెది పాటే కాదు. స్ఫూర్తివంతమైన ఊట. అందులో ఎన్నో సాహితీ విలువల ధారలు. అక్షర లక్షల అమృత ఝరులు. "నన్ను దోచు కుందువటె" అని కొంటె పలుకులు దిద్దిన ఆ కలం "గోరంత దీపం కొండంత వెలుగు" అంటూ నిరాశ చీకట్లపై కాంతిని చిమ్మింది. "నాది నాది అనుకున్నది నీది కాదురా.. నీవు రాయన్నది ఒక నాటికి రత్నమౌనురా.." అంటూ అత్యాశకు చెంపపెట్టు పెట్టయింది.

"ఏ సిరులెందుకు, ఏ నిధులెందుకు, ఏ సౌఖ్యములెందుకు, ఆత్మ శాంతి లేనిదే" అంటూ తాత్విక చింతనను బోధించింది. "గాలికి కులమేది"... అంటూ మానవతావాదానికి ఆరాధ్యమైంది. "స్నేహమేరా జీవితం" అంటూ స్నేహ పరిమళాలు వెదజల్లింది. "కంటేనే అమ్మ అని అంటే ఎలా?" అంటూ మాతృత్వానికి



ఎల్లలు లేవని చాటింది. ఇలా సాహిత్యంలో సినారె స్పృశించని కోణం ఏదీ లేదు.

శాబ్దిక సహవృత్తి, ఆర్థిక సహవృత్తి, వీటి పరస్పర పోషకత్వం సినారె కవిత్వంలోని పాటలోని ప్రధమ లక్షణం. సినారె శబ్ద సంపద స్ఫూర్తి అసాధారణమైంది. ఆయన పాటల్లో పూర్వ పర పదాలలో ధ్వనిసామ్యం, అర్థ పుష్టి, సమతూకం కలిగిన పదాలు వాటంతటవి వచ్చి చేరాయేమో అన్నంత సహజంగా ఉంటాయి. వాటికి "సద్యః సవరణ శక్తి" కూడా తోడైతే సినారె సినీ గీతం అవుతుంది.

అమ్మ పాడే లాలి పాటలు అమ్మా.. అని బిడ్డ నోరారా పాడే పాటలు, అల్లరి వయసు విరహ గీతాలు - ప్రేమికుల సరస సయ్యాటలు, వ్యక్తిత్వానికి వన్నె దిద్దే నీతి పాఠాలు జీవిత సూత్రాల చద్ది మాటలు ఇలా తెలుగు సినీ సాహితీ వనంలో సినారె వెదజల్లిన పాటల సౌరభాలెన్నో... ఈ గాన విలుకాని ప్రణయ గీతాలనే కాదు "ఒసే రాములమ్మ" వంటి గాయాల గేయాల్ని సైతం ప్రజలు మూటగట్టుకుని కాచుకున్నారు. ఆయనొక జ్ఞానపీఠం. గర్వం లేని స్నేహ హస్తం. నిరంతరం కవిత్వం పూచే ఆకుపచ్చని చెట్టు. నవ సినీ కవులకు దారిచూపే పాటల దీపస్తంభ కిరణం.. !

"గాలికి కులమేదీ.. నేలకు కులమేదీ.. మింటికి మరుగేదీ.. కాంతికి నెలవేదీ.." అంటూ కులాలూ, మతాలూ మనం నిర్మించుకున్నవే అంటారు. "కూరిమి కలవారంతా కొడుకులేనురా... జాలి గుండె లేని కొడుకు కన్న కుక్క మేలురా..." అంటూ ఆపదలో ఆదుకునేవాడు, కుటుంబ శ్రేయస్సు కొరకు శ్రమించే వాడే గొప్ప వాడని ప్రభోధిస్తారు.

"ఈ నల్లని రాళ్లలో ఏ కన్నులు దాగెనో.?" ఆ పాట మొదట లలిత గీతంగా ఆకాశవాణిలో ప్రసారమై ఆపై "అమరశిల్పి జక్కన" సినిమాలో ఘంటశాల గాత్రంలో మారుమ్రోగింది. ఆ తర్వాత రామప్ప సంగీత రూపకమై ఆకాశవాణి అన్నీ కేంద్రాల్లో పాలగుమ్మి విశ్వనాథం స్వర కల్పనలో డా. మంగళం పల్లి బాలమురళీకృష్ణ పాడగా జాతీయ స్థాయి గుర్తింపు పొందింది. తాతా మనుమడు చిత్రంలో "అనుబంధం ఆత్మీయత అంతా ఒక బూటకం / ఆత్మ శుద్ధికై మనుషులు ఆడుకునే నాటకం వింత నాటకం" అంటూ తరాల మధ్య తరిగిపోతున్న అనుబంధాల్ని, ఆత్మీయతల్ని వ్యంగ్యంగా ఎత్తి చూపారు. ఆయన లేకపోయినా ఆయన జ్ఞాపకాల్లో ఈ పాటలు ఇలా శాశ్వతంగా నిలిచిపోతాయి.

క
థ

# జీవితం అందమైనది!

ఒక గృహిణి సంస్కరణావాదం...

పి.వి.వి. సత్యనారాయణ
91107 36095

కడుపులో ఆకలి కొరకొరలాడి నప్పుడుగానీ పెళ్ళాం గుర్తుకు రాలేదు రంగనాథ్‌కి. "వత్సలా! వంట ఇంకా పూర్తికాలేదా?" అని పిలుస్తూ వంటింట్లోకి వెళ్ళాడు.

వంటింట్లో లేదామె. ఇల్లంతా వెదికాడు. ఎక్కడా కనిపించలేదు.

'ఈవేళప్పుడు ఎక్కడికి వెళ్ళిందబ్బా!?' అనుకుంటూ పిల్లల్ని పిలిచాడు.

తమ గదిలోంచి బైటకు వచ్చారు పదిహేనేళ్ళ కూతురు రష్మిక, పదేళ్ళ కొడుకు కృష్ణ.

"మీ అమ్మ ఎక్కడికి వెళ్ళిందర్రా?" అనడిగాడు. తెలియదన్నారు.

"నేను గదిలో కంప్యూటర్ లో ప్రాజెక్ట్ వర్క్ చేసుకుంటున్నాను, నాన్నా!" అంది రష్మిక.

"నేను హోమ్‌వర్క్ చేసుకుంటు న్నాను" అన్నాడు కృష్ణ.

నిజానికి రష్మిక ఐ-పాడ్‌లో ఫ్రెండ్స్‌తో చాటింగ్ చేస్తూంటే, కృష్ణ తన ట్యాబ్లెట్‌లో కంప్యూటర్ గేమ్స్ ఆడుతున్నాడు. విసుగ్గా చూసాడు రంగనాథ్. "ఆఖరిసారి మీ అమ్మను మీరు ఎప్పుడు చూసారు?"

"ఉదయం పొద్దుట స్కూలుకు వెళ్ళేప్పుడు అమ్మకు టాటా చెప్పాం మేం".

ఆశ్చర్యపోయాడు. "స్కూల్ నుండి వచ్చాక మీరు అమ్మను కలవనేలేదా?"

"స్నాక్స్, బోర్న్ విటా టేబుల్ మీద పెట్టుంటే తినేసి మా గదిలోకి వెళ్ళిపోయాం మేము" చెప్పింది రష్మిక.

నిజానికి అతనూ అదే చేసాడు. రోజూ ఆఫీసు నుండి వచ్చేసరికి కాఫీ ఫ్లాస్క్‌లో పోసి డైనింగ్ టేబుల్ మీద సిద్ధంగా ఉంచుతుంది వత్సల. ఎప్పటిలాగే వాష్ చేసుకుని వచ్చి కాఫీ త్రాగేసి తన గదిలోకి వెళ్ళిపోయాడు తాను. ల్యాప్ టాప్‌ని ముందు పెట్టుకుని కూర్చున్నాడు. రోజూటిలా పెళ్ళాం వచ్చి పలుకరించ లేదన్న విషయమే అంతవరకు స్ఫురణకు రాలేదు.

ఆకలి దంచేస్తోంది. తినడానికి ఏమైనా ఉంటుందేమోనని వంటింట్లోకి వెళ్ళిచూసాడు. అన్నం, కూరలూ వండేసివున్నాయి. అంటే, తాను వంట చేసే బయటకు వెళ్ళిందన్నమాట.

పిల్లలకు వడ్డించి, తానూ వడ్డించు కున్నాడు.

"అమ్మ ఎక్కడికి వెళ్ళింది, నాన్నా?" అనడిగాడు కృష్ణ.

"ఎక్కడో పేరంటానికి వెళ్ళుంటుంది. అక్కడ ఆలస్యమయ్యుంటుంది" అన్నాడు.

రాత్రి పదకొండయినా వత్సల జాడలేదు. ఫోన్ చేస్తే, ఆమె సెల్ ఆఫ్‌లో ఉంది. కంగారుపట్టుకుంది అతనికి. హాల్లో కాలు కాలిన పిల్లిలా తిరుగుతూంటే అదిగో, అప్పుడే కనిపించింది. టీవీ దగ్గర రీమోట్ క్రింద రెపరెపలాడుతూన్న కాగితం. భార్య రాసిపెట్టిన ఉత్తరం అది. ఒకే ఒక వాక్యం ఉంది అందులో 'ఇరవై నాలుగ్గంటలూ యంత్రాలే లోకంగా గడుపుతూ యాంత్రికంగా మారిపోయిన ఈ కుటుంబంలో ఇమడలేక మనుషుల మధ్యకు వెళ్ళిపోతున్నాను నేను.'

ఖంగుతిన్నాడు. ఊళ్ళోనే ఉన్న అత్తారింటికి ఫోన్ చేసాడు. కూతురు తమ దగ్గరికి రాలేదన్నారు వాళ్ళు. తనకు తెలిసిన ఫ్యామిలీ ఫ్రెండ్స్ ఇళ్ళకు ఫోన్ చేసాడు. ఎక్కడా లేదు ఆమె!...

రంగనాథ్ ఓ బ్యాంకులో పనిచేస్తున్నాడు. మోడర్న్ గ్యాడ్జెట్స్ అంటే అమిత మోజు. ఆఫీసు వేళల్లో తప్పితే మిగతా వేళల్లో సోషియల్ సైట్సే లోకం అతనికి. ఉదయం నిద్రలేవగానే బ్యాంక్‌కి వెళ్ళేంతవరకు ఫేస్ బుక్‌లో ఫేస్ దూర్చేస్తాడు. సాయంత్రం ఇంటికి వచ్చాక కాఫీ త్రాగేసి మళ్ళీ ఫేస్ బుక్, ట్విట్టర్, ఇన్ స్టాగ్రామ్ లలో ఈదులాడుతూంటాడు. లేదా, వాట్సాప్ గ్రూపులతో చాట్ చేస్తూంటాడు.

పిల్లలకూ అదే అలవాటు రావడం విశేషం. అందుకు కారణం అతనే! కూతురికి ల్యాప్ టాప్, ఐ-పాడ్, సెల్ ఫోన్ కొడుక్కి ట్యాబ్లెట్ కొనిచ్చాడు. వారి పుట్టినరోజు బహుమతులవి.

'పిల్లలు స్టడీ బుక్స్ కంటే వాటితోనే

కథ

ఎక్కువ సమయం గడుపుతున్నారంటూ' భార్య ఫిర్యాదు చేయబోతే, 'ఇది గ్యాడ్జెట్స్ ఎరా, వత్సలా! పిల్లలు ఇప్పట్నుంచీ వాటిని యూజ్ చేయడం అలవరచుకుంటేనే పెద్దయ్యేసరికి టెక్నాలజీతో మమేకం కావడమేకాదు, ఎక్స్‌పర్ట్స్ అవుతారు కూడాను'' అంటూ కొట్టిపారేస్తాడు అతను. 'కర్మరా బాబూ!' అంటూ నిస్సహాయంగా నుదురు కొట్టుకుంటుంది ఆమె.

భార్యాపిల్లలతో గడపడానికి సమయం దొరకదు రంగనాథ్‌కి. మంచీ చెడ్డా మాట్లాడాలని ఆమె ఎప్పుడైనా ప్రయత్నించినా, తన లోకంలోంచి తల త్రిప్పకుండానే, 'ఊఁ... ఆఁ' అంటూ 'ఊఁ' కొడతాడే తప్ప, ఏదీ బుర్రకు ఎక్కించుకున్నట్టు కనిపించడు.

'ల్యాప్ టాప్ మీ రెండో పెళ్ళాం కాదు, మొదటి పెళ్ళామే! నేనే రెండో దాన్ని!' అంటుందామె ఉక్రోషంగా.

'రియల్లీ!?' అంటాడు పరాకుగా.

ఇక పిల్లలు కూడా బడినుండి రాగానే హోమ్ వర్క్ గబగబా అయిందనిపించేసి ల్యాప్ టాపో, ఐ-పాడో, ట్యాబ్లెటో పట్టుక్కూర్చుంటారు. ట్యాబ్లెట్ కొనిచ్చినప్పట్నుంచీ బైట ఆటలకు వెళ్ళడం మానేసాడు కృష్ణ. అంతకు మునుపు గ్రౌండ్‌కి వెళ్ళి ఫ్రెండ్స్‌తో క్రికెటో, ఫుట్ బాలో ఆడేవాడు.

సెలవురోజుల్లో అక్కాతమ్ముళ్ళు క్యారమ్స్ ఆడుకునేవారు. తల్లి దగ్గర కూర్చుని స్కూలు సంగతులో, స్నేహితుల విశేషాలో చెప్పేవారు. ఇప్పుడు పిలిచినా గదిలోంచి బయటకు రారు, ఒక్క డిన్నర్‌కి తప్ప!

ఫలితంగా, నలుగురు సభ్యులున్న ఆ ఇంట్లో ఒంటరితనం ఫీలయ్యేది వత్సల..

రంగనాథ్ బ్యాంక్‌కి సెలవు పెట్టేసాడు. రెండు రోజులు గడచినా భార్య ఆచూకీ తెలియకపోవడంతో అయోమయానికి గురయ్యాడు. పిల్లలు బిక్కుబిక్కుమని గడుపుతున్నారు.

రెండో రోజు సాయంత్రం డోర్ బెల్ మ్రోగడంతో పరుగెత్తుకు వెళ్ళింది రష్మిక, అమ్మ వచ్చిందేమోనని.

గుమ్మంలో కొందరు బడిపిల్లలు, పుస్తకాల సంచులతో. "ఆంటీ లేరా, అక్కా?'' అనడిగారు.

ఎందుకని అడిగితే, వత్సల వారాని కోసారి తోటలోని జామకాయలను వారికి కోసిస్తుందని చెప్పారు.

అక్కడికి వచ్చిన తండ్రి ముఖంలోకి చూసింది కూతురు.

ఏమనుకున్నాడో, "ఇస్తాను, రండి'' అన్నాడు రంగనాథ్.

ఇంటి వెనుక ఉన్న తోటలోని జామచెట్టు కాయలతో నిండుగా ఉంది. ఆ పిల్లలతో పాటు కృష్ణ కూడా ఉత్సాహంతో చెట్టెక్కి పళ్ళు కోసాడు.

'ప్రతి శనివారమూ వత్సల పార్క్‌కి వెళుతుందనీ, పిల్లలకు చాక్లెట్స్ కూడా పంచుతుందనీ' ఆ పిల్లల ద్వారా తెలిసి విస్తుపోయాడు రంగనాథ్.

వత్సల వస్తుందేమోనని, శనివారం పార్క్‌కి వెళ్ళారు రంగనాథ్, పిల్లలూను. వత్సల కనిపించలేదు.

'ఆంటీ రాలేదా?' అంటూ చుట్టుముట్టిన అక్కడి పిల్లలకు 'ఆంటీ పంపించిందంటూ' తమతో తీసుకువెళ్ళిన చాక్లెట్స్‌ని పంచిపెట్టారు, నిరుత్సాహాన్ని కప్పిపుచ్చుకుంటూ.

చానాళ్ళ తరువాత రష్మిక, కృష్ణ పిల్లలతో ఆనందంగా ఆడుకున్నారు.

చీకటిపడే వేళ వరకూ వేచి చూసి, ఇక భార్య రాదని నిశ్చయించుకుని ఇంటికి బైలుదేరాడు రంగనాథ్.

అప్పుడే అతని వద్దకు వచ్చింది ఓ స్త్రీ. "మీరు వత్సల మేడమ్ గారి భర్త అని ఆ పిల్లలు చెప్పారు. ఈమధ్య పంతులమ్మగారు రావడంలేదు. ఊళ్ళో లేరా సార్?'' అనడిగింది.

తమ ఇంటికి చేరువలో ఓ స్లమ్ ఏరియా ఉంది. వత్సల రోజూ సాయంత్రపువేళ అక్కడికి వెళ్ళి ఓ గంటసేపు ఆ గుడిసెల్లోని పిల్లలకు ఉచితంగా పాఠాలు చెబుతుందట!!...

వత్సల ఇల్లు వదిలి ఐదు రోజులు అయిపోయింది. పిల్లలు బెంగపెట్టేసుకున్నారు. రంగనాథ్‌కి కూడా దిగులు ఎక్కువయింది. ఆ ఐదు రోజులూ వారికి గ్యాడ్జెట్స్ ధ్యాసే లేకుండాపోయింది.

ఓ రోజు సాయంత్రం ఇద్దరు వృద్ధులు వచ్చారు. తాము ఓ వృద్ధాశ్రమం నుండి వచ్చినట్టు చెప్పారు.

వత్సల రోజూ ఆ ఆశ్రమానికి వెళ్ళి, రెండు గంటలసేపు వారి అవసరాలను చూస్తుందట. వార్తాపత్రికలు, పుస్తకాలూ చదివి వినిపిస్తుందట. పళ్ళవీ తెచ్చి ఇస్తుందట. తమకు ఏవి ఇష్టమో అడిగి తెలుసుకుని ఇంట్లో వండుకుని వచ్చి ఆప్యాయంగా తినిపిస్తుందట!... వారం రోజులుగా ఆమె ఆశ్రమానికి రాకపోవడంతో ఏమయిందోనని తల్లడిల్లిపోతున్నారట అందరూను. అనారోగ్యం చేసిందేమో తెలుసుకుని రమ్మని వారిని పంపించారట - రంగనాథ్, పిల్లలూ నిశ్చేష్టులయ్యారు.

వత్సల వ్యక్తిత్వంలోని తాము ఎరుగని ఒక్కో అంశమూ వెలికి వస్తూంటే అంత మంది పిన్నలు, పెద్దల అభిమానాన్నీ ప్రేమనూ చూరగొన్న ఆమె పట్ల గౌరవం పెరిగిపోయింది వారికి.

అనుకోకుండా ఆమె ఊరికి

**ఇక పిల్లలు కూడా బడినుండి రాగానే హోమ్ వర్క్ గబగబా అయిందనిపించేసి ల్యాప్ టాపో, ఐ-పాడో, ట్యాబ్లెటో పట్టుక్కూర్చుంటారు. ట్యాబ్లెట్ కొనిచ్చినప్పట్నుంచీ బైట ఆటలకు వెళ్ళడం మానేసాడు కృష్ణ. అంతకు మునుపు గ్రౌండ్‌కి వెళ్ళి ఫ్రెండ్స్‌తో క్రికెటో, ఫుట్ బాలో ఆడేవాడు. సెలవు రోజుల్లో అక్కాతమ్ముళ్ళు క్యారమ్స్ ఆడుకునేవారు. తల్లి దగ్గర కూర్చుని స్కూలు సంగతులో, స్నేహితుల విశేషాలో చెప్పేవారు. ఇప్పుడు పిలిచినా గదిలోంచి బయటకు రారు, ఒక్క డిన్నర్‌కి తప్ప!**

**మన** సౌకర్యార్థం కనిపెట్టబడ్డ యంత్రాలను మానవ మనుగడకే ముప్పుతెచ్చే ముసలాలుగా మార్చుకోకూడదు. ఇరవై నాలుగ్గంటలూ యంత్రాలతో గడిపితే మనమూ యంత్రాలమయిపోతాం. అదే మనుషుల మధ్య గడిపితే మానవ సంబంధాలు, బాంధవ్యాలు, బంధాలు, అనుబంధాలు, విలువలు, ప్రేమాభిమానాలూ అన్నీ అనుభవానికి వస్తాయి. జీవితానికో అర్థాన్ని ఇస్తాయి' చెప్పింది వత్సల. "జీవితం అందమైనది! ఆ అందాన్నీ అనుభూతినీ పూర్తిగా ఆస్వాదించాలంటే మనుషుల మధ్య మసలడం ముఖ్యం... అంతర్జాలం ఓ మాయాజాలం. ఆ సాలెగూటిలో ఇరుక్కుంటే బైటపడలేం. అలాగే ఫేస్ బుక్ ఓ ఐ-వాష్, సమయనష్టి. మానవసంబంధాలే వాస్తవం, శాశ్వతమూను!"



వెళ్ళవలసివచ్చిందంటూ సర్దిచెప్పి, ఆ వృద్ధులను పంపేసాడు రంగనాథ్.

అతనిలో అంతర్మథనం మొదలయింది. భార్య యొక్క ఔన్నత్యం, ఉదారస్వభావం, సేవాతత్పరత, మనుషులలో మెలగే స్వభావమూ ఊరంతా ఆమెకు అభిమానులను తెచ్చిపెట్టింది.

కానీ, ఇంట్లోనే ఉంటూన్న తనకు, పిల్లలకూ ఆమెతో మాట్లాడే తీరిక వుండదు! ఆమె యాక్టివిటీస్ గురించి ఏమీ తెలియదు! తాము గ్యాడ్జెట్స్ లోకంగా బతకడమే అందుకు కారణం!

గృహిణి అంటే కేవలం స్వగృహానికే పరిమితం కాకుండా, తన చుట్టూ ఉన్న సమాజమంతా తన గృహమేనన్నట్టు భావించే భార్య యొక్క విశాల హృదయానికి జోహార్లు అర్పించకుండా ఉండలేకపోయాడు రంగనాథ్.

ఆ వారం రోజులూ ఆ గ్యాడ్జెట్స్ సంగతే మరచిపోయి మనుషులలో పడడంతో ఎన్నో వాస్తవాలు వెలికి వచ్చాయి. సాటివారి పట్ల అభిమానాలు, ఆకాంక్షలూ ఆకళింపుకు వచ్చాయి. పిల్లలు కూడా ఆటలకు వెళ్ళిరావడంతో వారిలో మునుపటి ఉత్సాహం, హుషారూ పొడసూపుతున్నాయి.

ఆదివారం ఉదయం హఠాత్తుగా గుమ్మంలో ప్రత్యక్షమైన పెళ్ళాన్ని చూసి చలనం లేకుండా ఉండిపోయాడు రంగనాథ్.

పిల్లలు వచ్చి ఏడుస్తూ తల్లికి చుట్టుకుపోయారు- "నువ్వు ఎక్కడికి వెళ్ళావమ్మా?".

"మా అమ్మానాన్నల దగ్గరకు" అంది.

"ఫోన్ చేస్తే రాలేదన్నారే?" నవ్వేసింది.

"సారీ, వత్సలా! మా గ్యాడ్జెట్స్ పిచ్చి నిన్ను ఇంతగా బాధిస్తుందనుకోలేదు" అన్నాడు రంగనాథ్ మనస్ఫూర్తిగా.

"టెక్నాలజీని ఎంతవరకు అవసరమో అంతవరకే వాడుకోవాలండీ. అతి ఎల్లవేళలా నష్టమే. మన సౌకర్యార్థం కనిపెట్టబడ్డ యంత్రాలను మానవ మనుగడకే ముప్పుతెచ్చే ముసలాలుగా మార్చుకోకూడదు. ఇరవై నాలుగ్గంటలూ యంత్రాలతో గడిపితే మనమూ యంత్రాలమయిపోతాం. అదే మనుషుల మధ్య గడిపితే మానవ సంబంధాలు, బాంధవ్యాలు, బంధాలు, అనుబంధాలు, విలువలు, ప్రేమాభిమానాలూ అన్నీ అనుభవానికి వస్తాయి. జీవితానికో అర్థాన్ని ఇస్తాయి' చెప్పింది వత్సల. "జీవితం అందమైనది! ఆ అందాన్నీ అనుభూతినీ పూర్తిగా ఆస్వాదించాలంటే మనుషుల మధ్య మసలడం ముఖ్యం... అంతర్జాలం ఓ మాయాజాలం. ఆ సాలెగూటిలో ఇరుక్కుంటే బైటపడలేం. అలాగే ఫేస్ బుక్ ఓ ఐ-వాష్, సమయనష్టి. మానవసంబంధాలే వాస్తవం, శాశ్వతమూను!"

"నిజమే. వర్చ్యువల్ వరల్డ్ డేలో విహరిస్తూ రియాలిటీని విస్మరిస్తున్నాము" అన్నాడు రంగనాథ్ ఆమెతో ఏకీభవిస్తూ.

"మిమ్మల్నీ, పిల్లల్నీ ఇబ్బందిపెట్టాను. సారీ అండీ!" అందామె. "పక్కింటి వదినెగారి ద్వారా ఎప్పటికప్పుడు మీ గురించి తెలుసుకుంటూనే వున్నాను నేను. మీలో ఆశించిన మార్పు వచ్చినట్లు తెలిసాక ఇంకో క్షణం కూడా ఆగలేకపోయాను". "నువ్వు ఇచ్చిన షాక్ ట్రీట్మెంటుతో మా గ్యాడ్జెట్స్ పిచ్చి వదిలిపోయింది, వత్సలా! ఇక మీదట వాటిని అవసరానికి తప్ప వాడకూడదని తీర్మానించుకున్నాం," అన్నాడు రంగనాథ్. "ఇకపైన సెలవు రోజుల్లో నీతో పాటు నేనూ ఓల్డేజ్ హోమ్‌కి వస్తాను".

"అమ్మా! ఆ వాడలోని పిల్లలకు నీతోపాటు నేనూ చదువు చెబుతాను" అంది రష్మిక ఉత్సాహంగా.

"మరి నేనో?" అన్నాడు కృష్ణ.

వారిలో వచ్చిన మార్పుకు మిక్కిలి సంతోషం కలిగింది వత్సలకు.

***(ఉగాది కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ...)***

# గుడ్ విల్ హంటింగ్

విల్ హంటింగ్ గొప్ప మేధాశక్తి కలిగిన యువకుడు. నిజాలను జ్ఞాపకం పెట్టుకోవడంలోనూ, అధునాతన గణిత సిద్ధాంతాలను పరిష్కరించడంలోనూ, అధిక ప్రజ్ఞ కలిగినవాడు. అతను మింటులో కాపలాదారునిగా పని చేస్తుంటాడు. సౌత్ బోస్టన్‌లో ఒక అధునాతనంగా ఉన్న అపార్ట్‌మెంట్లో ఒంటరిగా నివసిస్తుంటాడు. విల్ ఎన్నో వేధింపులకు గురౌతూ పెరిగిన పెంపుడు బిడ్డ. ఈ విషాద జ్ఞాపకాలు మనసులో కదలుతుండగా విల్ ఆత్మనూన్యతకు గురౌతాడు. ఇది అతన్ని స్వీయ నిందకు గురి చేస్తుంది. ఇది తన వృత్తిపైన ప్రవృత్తి పైన ప్రభావం చూపెడుతుంది. అతన్ని నిరంతరం గుర్తు పట్టలేని బాధావీచికలు వెన్నాడుతాయి.

అతను గ్రాడ్యుయేషన్‌లో ఉన్నప్పుడు ప్రొఫెసర్ గెరాల్డ్ లాంబు ఒక మాథ్స్ సమస్యను బ్లాకుబోర్డుపై ఉంచుతాడు. ఆయన ఎవరైనా దాన్ని పరిష్కరిస్తారని ఎదురు చూస్తాడు. ఆ సమస్య పరిష్కరించబడుతుంది. జవాబు నల్లబల్లపై ఉంటుంది. ల్యాంబు మరొక సమస్యను నల్లబల్లపై పెడతాడు. రెండు సంవత్సరాలనుండి తన సహచరులు, శిష్యులెవరితోను పరిష్కారం కాని సమస్య అది. అది కూడా పరిష్కారం పొందుతుంది. విల్ దాన్ని పరిష్కరించాడని ప్రొఫెసర్ పసిగడతాడు. ఇంత తెలివైన విల్ అంతర్లీనంగా ఒక పర్వెర్షన్ తో ఉంటాడు.

కొన్ని రోజుల తరువాత విల్ తనను బాల్యంలో వేధించిన యువకునిపై ప్రతీకారం తీసుకుంటాడు. ఈ పోట్లాటలో ఒక పోలీస్ ఆఫీసర్ జోక్యం



తీసుకుంటాడు. విల్ అతనిపై కూడా దాడి చేస్తాడు. ఇందుకు ప్రతిగా విల్ జైలు పాలు కావల్సివస్తుంది. అంతకు ముందు చాలా కాలం క్రితం జరిగిన కేసుని ఉదహరిస్తూ న్యాయమూర్తి అతనికి శిక్ష వేస్తాడు. ఆ వరకే అతని గణిత శాస్త్రంలోని చురుకుదనాన్ని అందరూ గుర్తిస్తారు. ఆయన భావికాలంలో ఒక గొప్ప గణిత శాస్త్రజ్ఞుడు కాగలడని అంచనా ఉంటుంది. చివరికి ల్యాబ్ జోక్యం వల్ల విల్ మానసిక వైద్యుని ద్వారా శిక్షణ పొందుతూ గణిత శాస్త్ర అధ్యయనం కొనసాగించేలా శిక్షణ ఇవ్వబడుతుంది. విల్ తనకు థెరపీ అవసరం లేదని నమ్మినా అందుకు సిద్ధపడతాడు.

అయిదుగురు మనస్తత్వ శాస్త్రవేత్తలు విల్‌కు చికిత్స చేయడంలో విఫలమౌతారు. ల్యాంబో చివరి ప్రయత్నంగా తన చిన్ననాటి స్నేహితుడైన సీన్ మగైర్ ని పిలుస్తాడు. సీన్ ఒక భిన్నమైన వ్యక్తి. సౌత్ బోస్టన్‌కు చెందిన వ్యక్తి. నాడు సీన్ వేసిన వాటర్ కలర్ పెయింటింగ్‌ని విల్ విశ్లేషిస్తూ ఆ చిత్రం సీన్ భార్య అకాల మరణంపై గల అపరాధ భావాన్ని విశ్లేషిస్తుందని చెబుతాడు. ఆ మాటలకు సీన్ కోపం తెచ్చుకుంటాడు. ల్యాంబ్ విల్ మళ్ళీ వైద్యం పొందే అవకాశం కోల్పోయాడని చింతిస్తాడు. అయితే సీన్ ప్రతివారం విల్‌ని తన దగ్గరికి ట్రీట్మెంట్‌కి తీసుకురావాలని చెబుతాడు.

ల్యాంబ్ విల్‌కి అనేక ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాడు. కాని విల్ వాటిని ఉపయోగించుకోక వదిలేస్తాడు. విల్ మరొక థెరపీ తీసుకుంటాడు. విల్ జీవితం అట్లే కొనసాగితే అతని సామాజిక జీవితం, ప్రణయ జీవితం, అభాసు పాలౌతుందని సీన్ భావిస్తాడు. చివరికి సీన్ థెరపీ ద్వారా విల్ వ్యక్తిత్వంలో అట్లాంటి లోపాలు ఉండడానికి కారణం తెలుసుకుంటాడు. విషాద పూరితమైన అతని బాల్యమే అందుకు కారణం అని అర్థం చేసుకుంటాడు. విల్ చివరికి తన అంతరంగం లోని చీకటి కోణాలకి స్వస్తి చెప్పి సరైన జీవితాన్ని గడుపాలనుకొంటాడు. విల్ తన ప్రియురాలు స్కైలర్‌తో మంచి జీవితం గడపడానికి కాలిఫోర్నియా వెడుతున్నట్టు లేఖ రాసి వెళ్లిపోతాడు.

ఒక పర్వర్ట్ అయిన యువకుని అంతచ్చేతనలో మేధాశక్తి చురుకుదనం ఎలా నిక్షిప్తమై వుంటుందో తెలియజేసే చిత్రం ఇది. 1997లో వచ్చిన ఈ చిత్రానికి గస్ వాన్ సెంట్ దర్శకత్వం వహించారు. రాబిన్ విల్సన్, మాట్ డామన్, బెన్ అఫ్లేక్ , స్కైలేన్ స్కర్స్ గార్డ్ , జాన్ మైటన్, లారెన్స్ బెండర్ , డెమ్మీఎక్, ప్రధాన తారాగణం. లారెన్స్ బెండర్ నిర్మాతగా ఉన్న ఈ చిత్రానికి సంగీత దర్శకుడు డిమ్మీ ఎక్మన్, కథారచన అఫ్లేక్స్ డెమన్.

వ్యాసం

# నూరేళ్ళ తెలుగు బాలల నాటకరంగం - ఒక పరిచయం

**బాలల నాటక రంగంలోని ఒడిదుడుకులు తెలిపే వ్యాసం...**



కె.పి. అశోక్ కుమార్
97002 30310

స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం, పాఠశాల వార్షికోత్సవాల సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తుంటారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు ఏకపాత్రాభినయాలు, నాటక ప్రదర్శనలు నిర్వహిస్తుంటారు. దానికోసమే ఉపాధ్యాయులే ఒక నీతితో కూడిన నాటిక గాని, సందేశాత్మక నాటిక గాని, హాస్యనాటిక గాని వ్రాసి విద్యార్థులతో ప్రదర్శింపజేస్తుంటారు. ఇందుకుగాను స్పష్టమైన ఉచ్ఛారణ, మంచి ధారణాశక్తి, సభాకంపం లేని విద్యార్థులను ఎంపిక చేసుకొని, వారికి తర్ఫీదు ఇచ్చి నాటక ప్రదర్శనలను ఏర్పాటుచేస్తుంటారు. ఇలా పాఠశాలల్లో ఉపాధ్యాయులు సందర్భోచితంగా, పిల్లల కోసం వ్రాసిన ఎన్నో మంచి నాటికలు అనేక ఇబ్బందుల వలన ప్రచురణకు గాని, పునఃప్రదర్శన ద్వారా ప్రచారానికిగాని నోచుకోక కనుమరుగైపోయాయి. కాని ఆ నాటికలో పాల్గొన్న బాలల జీవితంలో మాత్రం అవి మధురస్మృతులుగా మిగిలిపోతాయి.

మొట్టమొదటి తెలుగు ఔత్సాహిక నాటక సమాజం, వీరేశలింగం పంతులు 'వ్యవహార ధర్మబోధిని' ప్రదర్శించినపుడు, దానిలో పాల్గొన్నవారంతా విద్యార్థులే అయినప్పటికీ, వాటిని బాలల నాటికలని చెప్పడానికి వీలులేదు. పాశ్చాత్య సాహితి సంపర్కంతో తెలుగు సాహిత్యంలో వెలసిన ఆధునిక ప్రక్రియ నాటిక. 1860 ప్రాంతాలలో తెలుగు నాటకం ఆవిర్భవించిన తర్వాత యాభై ఏళ్ళకి నాటిక పుట్టింది. తెలుగులో స్వతంత్ర నాటికా రచనకు పిల్లల నాటికలతోనే శ్రీకారం చుట్టబడింది. 1912లో విద్యార్థుల నుద్దేశించి, శృంగార కవి సర్వారాయుడు 'సివిక్సు డ్రామాలు' పేరిట తొలి నాటికల సంపుటిని వెలువరించారు. ఈ సంపుటిలో విద్యార్థులు ప్రదర్శించడానికి వీలుగా చిన్నచిన్న నాటికలు పదకొండు వున్నాయి. పాఠశాల విద్యార్థులకు గ్రామీణ, పట్టణ పరిపాలనా వ్యవహారాల గురించిన అవగాహన కల్పించడం కోసం ఈ నాటికలను రాశారు. విద్యార్థులకు ఉపయోగపడే విధంగా నాటకాలు రాయమని కొందరు ప్రైమరీ ఉపాధ్యాయులు కోరడం వలన తాను ఈ నాటికలను రాశానని రచయిత చెప్పుతున్నారు.

బాలల సాంస్కృతిక వికాసమే వృత్తిగా మొదలై ప్రవృత్తిగా ఆనందించి, జీవితమంతా దానికోసం అంకితం చేసిన మరువలేని వ్యక్తి కీ.శే. న్యాయపతి రాఘవరావు. వీరు రేడియో అన్నయ్యగా, బాలలకోసం మొట్టమొదటి మాసపత్రిక 'బాల' నిర్వహించిన బాలన్నయ్యగా సుప్రసిద్ధులు. వారి శ్రీమతి కీ.శే. న్యాయపతి కామేశ్వరి (రేడియో అక్కయ్య) కూడా బాల సాహిత్యంలో తమవంతు కృషి చేస్తూ, అన్నయ్యగారికి చేదోడువాదోడుగా వుండేవారు. వీరు బాలలకు శతాధిక హాస్య, పౌరాణిక, చారిత్రాత్మక, గేయ, నృత్య, రంగస్థల, రేడియో నాటికలను వ్రాసి బాలలచే ప్రదర్శింపజేశారు.

న్యాయపతి రాఘవరావు వారి శ్రీమతి కామేశ్వరి గారు తాము ప్రారంభించిన మాసపత్రిక 'బాల'లో తాము స్వయంగా రచించిన నాటికలు ప్రచురించారు. అంతేకాదు. ఇతర రచయితలను కూడా ఉత్సాహపరిచి వారిచేత కూడా నాటికలను వ్రాయించారు. వాటిని కూడా ప్రచురించి తెలుగు బాలలకు ప్రదర్శనయోగ్యమైన అనేక బాలల నాటికలను అందుబాటులోకి తెచ్చారు. సుమారు 1947 ప్రాంతంలో న్యాయపతి రాఘవరావు, కామేశ్వరిగారు 'ఆంధ్ర బాలానంద సంఘం' స్థాపించారు. అప్పటి నుంచి ప్రతి దసరా సెలవుల్లో రంగస్థల ఉత్సవాల పేరిట బాలల నాటికా పోటీలు నిర్వహించేవారు. ఉత్తమ ప్రదర్శనకు, దర్శకులకు, బాల నటులకు, హాస్య నటులకు బహుమతులు ప్రకటించి ప్రోత్సహించేవారు. ఆ నాటకాల పోటీలు

జరిగేటప్పుడు చలనచిత్ర నటులు, చిత్రపరిశ్రమ ముఖ్యులు న్యాయ నిర్ణేతలుగాను, ముఖ్య అతిథులుగానూ విచ్చేసేవారు.

ప్రతి ఏటా ఈ బాలల నాటికలను పోటీలకు 60-70 దాకా దరఖాస్తులు వచ్చేవి. మొదటి దశలో వాటి స్క్రిప్టును పరిశీలించేవారు. తర్వాత రిహార్సల్ పరిశీలించి 25-30 నాటికలు పోటీలో అర్హమైనవిగా నిర్ణయించేవారు. అలా నిర్ణయించిన వాటిని రెండు మూడు రోజులపాటు పెద్ద ఆడిటోరియంలో రవీంద్రభారతి, త్యాగరాయగానసభ మొదలగునవి) ఆహుతుల సమక్షంలో ప్రదర్శించేవారు. వాటిలో ఉత్తమ ప్రదర్శనలకు న్యాయనిర్ణేతలు ప్రథమ, ద్వితీయ, తృతీయ నాటికలుగా ఎంపిక చేసేవారు. ఉత్తమ రచనకి, ఉత్తమ దర్శకునికి, ఉత్తమ రంగాలంకరణకు, ఉత్తమ నటుడు, నటికి బహుమతులు అందజేయబడేవి. ఇవికాక ప్రదర్శింపబడిన ప్రతి నాటకంలోని ఉత్తమ నటునికి కూడా బహుమతి అందజేయబడేది.

అన్నయ్య - అక్కయ్యగార్లు వ్రాసిన వందలాది నాటికలలో హాస్యనాటికలు, నీతిని బోధించే నాటికలు, సందేశాత్మక నాటికలు, జానపద నాటికలు, పౌరాణిక నాటికలు, గేయనాటికలు, చారిత్రక నాటికలు, అనువాద - అనుసరణ నాటికలు, మగపాత్ర లేని నాటికలు, ఆడ పాత్రలేని నాటికలు వున్నాయి. వీరు బాలానందం తరఫున "పిల్లల నాటకాలు, చాలా గమ్మత్తు నాటికలు, పిల్లల హాస్యనాటికలు, గున్నయ్య గడ్డం, మడత కుర్చీ, మూడు పెళ్ళిళ్ళు" మొదలైన సంకలనాలను ప్రచురించారు.

ఈ శతాబ్దకాలంలో (1912-2012) వివిధ రచయితల బాలల నాటికా సంపుటులు, నాటికా సంకలనాలు కొద్ది సంఖ్యలో మాత్రమే వెలువడ్డాయి. దొరికిన ఆధారాలను బట్టి చూస్తే - తెలంగాణ రచయితల సంఘం 1953లో దాశరథి, నారాయణరెడ్డి, వట్టికోట ఆళ్వారుస్వామి, యశోదారెడ్డిల నాటికలతో "చిరుగజ్జెలు" పేరిట ఒక సంకలనం వెలువరించారు. 1954లో నార్ల చిరంజీవి "మందారాలు" నాటిక సంపుటిని, 1955లో జనమంచి రామకృష్ణ "పిల్లల నాటికలు", 1961లో ఇల్లిందల సరస్వతిదేవి "బాల వీరులు", 1963లో "రోహిణి నాటికలు", 1968లో ఆర్. కాళిదాసు "పూవులు - తావులు", 1973లో దొప్పలపూడి రాధాకృష్ణమూర్తి "బొమ్మల పెళ్ళి", 1975లో ఏడిద కామేశ్వరరావు "రంగబాల", 1977లో న్యాయపతి కామేశ్వరి "ఆడపిల్ల హాస్యనాటికలు" అనే సంపుటాలను వెలువరించారు. 1979లో అంతర్జాతీయ బాలల సంవత్సరం సందర్భంగా ఎక్కువగా సంకలనాలు వెలువడడం గమనార్హం. ఈ సంవత్సరం మధు రాంతకం రాజారాం, యస్. మునిసుందరం సంకలనకర్తలుగా 'పూలజల్లు' వెలువడింది. బి.కె. విశ్వేశ్వరరావు సంపాదకులుగా 'పిల్లల నాటికలు' (1979) అనే సంకలనం వచ్చింది. 1979లోనే న్యాయపతి రాఘవరావు సంకలనకర్తగా 'పసిడి తెర' నాటికల సంకలనం వెలువడింది. 1982లో ఏడిద కామేశ్వరరావు 'ఆనంద మందిరం', 1985లో మద్దిపట్ల వెంకటరావు సంకలన కర్తగా 'పొట్టిబావ' హాస్యనాటికల సంకలనం తొమ్మిది నాటికలతో వెలవడింది.1989లో కావ్యశ్రీ "బాల నాటికలు", 1996లో డి.వి. రమణమూర్తి 'పూలబాట' నాటికల సంపుటాలు వచ్చాయి. చిల్డ్రన్ ఆర్ట్ థియేటర్ వారు 2006లో 'హరివిల్లు', 2007లో 'తాయిలాలు' 2008లో 'మిఠాయిలు', 2010 లో 'గుజ్జన గూళ్ళు' అనే నాటికా సంపుటాలను వెలువరించారు.

ప్రఖ్యాత రచయిత నండూరి సుబ్బారావు బాలల కోసం రాసిన అనేక రంగస్థల నాటికలు సంకలనాలుగా వెలుబడ్డాయి. అలాగే బి.కె. విశ్వేశ్వరరావు గుంటూరు బాలానంద కేంద్రం కార్యదర్శిగా వున్నప్పుడు బాలల నాటికలను ప్రోత్సహించడమే కాకుండా, ఆనందబాల ప్రచురణల పేరిట బాలల నాటికలను ప్రచురింప జేసి బాలానంద సంఘాలకు, పాఠశాలకు అందుబాటులో ఉండేటట్లు కృషి చేశారు.

రేడియో అన్నయ్య - అక్కయ్యల మాదిరిగా బాలల వికాసానికి కృషి చేసిన కొందరి గురించి తెలుసుకుందాం. రచయితగా ప్రసిద్ధులైన కె. సభా 1956-66 మధ్యకాలంలో ఆంధ్రప్రభ వారపత్రికలో బాలల కోసం 'బాల ప్రభ' శీర్షిక నిర్వహించేవారు. వారు బాలల రంగస్థల ప్రదర్శన కోసం రాసిన నాటకాలలో చాలావరకు 1957లో సంకలనంగా ప్రచురింపబడ్డాయి. ప్రఖ్యాత రచయిత నండూరి సుబ్బారావు బాలల కోసం రాసిన అనేక రంగస్థల నాటికలు సంకలనాలుగా వెలుబడ్డాయి. అలాగే బి.కె. విశ్వేశ్వరరావు గుంటూరు బాలానంద కేంద్రం కార్యదర్శిగా వున్నప్పుడు బాలల నాటికలను ప్రోత్సహించడమే కాకుండా, ఆనందబాల ప్రచురణల పేరిట బాలల నాటికలను ప్రచురింపజేసి బాలానంద సంఘాలకు, పాఠశాలకు అందుబాటులో ఉండేటట్లు కృషి చేశారు. బాలసాహిత్య పరిషత్ అధ్యక్షులుగా చొక్కాపు వెంకటరమణ మంచి హాస్య సందేశాత్మకమైన బాలల రంగస్థల నాటికలు రచించి ప్రదర్శింపజేశారు. సమ్మెట వెంకటరమణ 1981లో "బాలభారతి బాలానందం" స్థాపించి, పిల్లలకు నటనలో మంచి శిక్షణ ఇస్తున్నారు. చిల్డ్రన్ ఆర్ట్ థియేటర్స్ సంచాలకులుగా వనపాల వెంకటేశ్వర్లు, బాలల్లో నాటక కళను ప్రోత్సహించడానికి ఎన్నో ఏళ్ళుగా బాలల నాటికల పోటీలు నిర్వహిస్తున్నారు. సుమారు నలభై దాకా నాటికలు వ్రాసి గుంటూరు జిల్లాలోని అనేక రెసిడెన్షియల్ స్కూల్స్‌లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ప్రదర్శింపజేశారు. ఏడు సంవత్సరాల పాటు బాపట్లలోనూ, 2004 నుండి హైదరాబాద్‌లోనూ ప్రతిఏటా నవంబర్ నెలలో రాష్ట్రస్థాయి బాలల నాటికల పోటీలు అతి సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. పోటీలలో ప్రదర్శించేం

వ్యాసం

దుకు ప్రముఖ రచయితల చేత ప్రత్యేకంగా బాలల నాటికలను వ్రాయిస్తున్నారు. ఎంపిక చేసిన బాలల కొత్త నాటికలను పుస్తకరూపంలో ప్రచురిస్తున్నారు. పాతరోజులలో ఉపాధ్యాయులకు నాటక కళలో ప్రత్యేక శిక్షణా శిబిరాలు నిర్వహించడం విశేషం. వారే కాకుండా కథకుడిగా, నాటకకర్తగా ప్రసిద్ధులైన వల్లూరు శివప్రసాద్ 'పోరు నష్టం పొందు లాభం' (2015) అనే పిల్లల హాస్య నాటికా సంపుటాన్ని వెలువరించడం గమనించదగ్గ విషయం.

సుమారు 1972-2004 మధ్య కాలంలో దక్షిణ మధ్య రైల్వే 'లలితకళాసమితి' వారు రైల్ నిలయం ఆడిటోరియంలో బాలల కోసం నాటకాల పోటీలు నిర్వహించేవారు. 2000 సంవత్సరం తర్వాత ఆంధ్రప్రదేశ్ చిల్డ్రన్ ఆర్ట్ థియేటర్, బాలసాహిత్య పరిషత్తు సంస్థలు బాలల కోసం నాటికల పోటీలను నిర్వహిస్తున్నాయి. 2010 నుండి రాష్ట్ర చలనచిత్ర, టీవీ, రంగస్థ అభివృద్ధి సంస్థ సైతం నంది నాటకోత్సవాలు, బాలల కోసం ప్రత్యేకించి పోటీలను నిర్వహిస్తూ నంది బహుమతులను ఇచ్చి ప్రోత్సహించటం జరుగుతున్నది. ఈ సందర్భంగా వస్తున్న రచనల పట్ల కొంత అయోమయం, అస్పష్టత, అసంతృప్తి, చర్చ జరుగుతున్న నేపథ్యంలో బాలల నాటక సాహిత్య విషయంలో ఒక స్పష్టత రావడానికి, సదవగాహన కలగడానికి ఒక సంకలనం వెలువరించడం సమంజసమని భావించి వల్లూరి శివప్రసాద్‌గారు 'ప్రసిద్ధ బాలల నాటికలు' (1912-2000) అనే సంకలనాన్ని రూపొందించారు. ఇందులో మొత్తం ముప్పై నాటికలున్నాయి. రచనా వైవిధ్యాన్ని దృష్టిలో వుంచుకుని సాంఘిక నాటకాలతో పాటు పౌరాణిక, చారిత్రక, గేయనాటికలను కూడా ఈ సంకలనంలో చేర్చటం జరిగింది.

శృంగార కవి సర్వారాయుడు రాసిన 'ఎడ్యుకేషన్' నాటిక 20వ శతాబ్దపు తొలినాళ్ళల్లో (1917) విద్యావ్యవస్థనూ, బోధనా విధానాన్ని విమర్శకు పెట్టింది. ఆనాటి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఒకరిపై ఒకరు విద్యావ్యవస్థ డొల్లతనంపై బాణాలు సంధించటాన్ని ఈ నాటికలో గమనించవచ్చు. ఎదిగే వయసు పిల్లలకు మంచి చదువు, చక్కని క్రమశిక్షణ ముఖ్యం. రకరకాల వంకలు పెట్టి బడి ఎగ్గొట్టి, ఏవేవో వ్యాపకాలతో చదువు నిర్లక్ష్యం చేస్తే ఎలా వృద్ధిలోకి రాగలరని 'వేణు చదువు సంధ్యలు'లో నార్ల చిరంజీవి ప్రశ్నిస్తారు. విద్యాలయాల్లో పేద, ధనిక భేదాలు, కుల మత తేడాలు లేకుండా పిల్లలందరూ ఒక్కటే అన్న భావం కలగడానికి 'స్కూల్ డ్రెస్' దోహదపడుతుందని దొప్పలపూడి రాధాకృష్ణమూర్తి తెలియజేస్తారు. తమ పిల్లల్ని వెర్రి గారాబం చేసే కొందరు తల్లిదండ్రులు పిల్లలు చెప్పినదంతా నమ్మి అనవసరంగా దండిస్తున్నారని ఉపాధ్యాయుల్ని నిందిస్తారు. నిజాలు తెలుసుకుంటే తప్ప తమ పిల్లల్ని అదుపులో పెట్టుకోలేరని లవణం రాసిన 'వెర్రి గారాబం'లో చూడవచ్చు. పునాది ఎంత బలంగా వుంటే, కట్టే భవనం అంత పటిష్టంగా నిలబడుతుంది. అలాగే పిల్ల బంగారు భవిష్యత్తుకు పునాదులు మంచి చదువు సంధ్యలే. అవే జీవితాన్ని ఉన్నతంగా నిలబెడతాయని, 'నిన్ను నువ్వు దిద్దుకో' అని వల్లూరి శివప్రసాద్ బోధిస్తారు. ఒక క్రమపద్ధతిలో పాఠాలు చదువుకునే విద్యార్థులకు పరీక్షలంటే ఎలాంటి భయం వుండదు. కాని కేవలం పరీక్షల రోజుల్లో చదువు మొదలెట్టిన విద్యార్థులు పడే పాట్లు వర్ణనాతీతం. అలాంటి మొక్కుబడి చదువుల వల్ల ప్రయోజనం లేదని డాక్టర్ కొర్రపాటి గంగాధరరావు హెచ్చరిస్తారు. స్కూల్‌కని వెళ్ళిన పిల్లలు రావాల్సిన వేళకు ఇంటికి చేరకపోతే, తల్లిదండ్రులు పడే ఆందోళనను డి.వి. రమణమూర్తి నాటికలో చూడవచ్చు. క్లాసులో మార్కుల రాయుళ్ళు చేసే అవమానాలను తట్టుకోలేక సున్నారాయుళ్ళు ఒక సంఘం ఏర్పాటుచేసుకుంటారు. వారిని, అరాచకత్వాన్ని అడ్డుకుని పెద్దలు వాళ్ళకు

**పునాది ఎంత బలంగా వుంటే, కట్టే భవనం అంత పటిష్టంగా నిలబడుతుంది. అలాగే పిల్ల బంగారు భవిష్యత్తుకు పునాదులు మంచి చదువు సంధ్యలే. అవే జీవితాన్ని ఉన్నతంగా నిలబెడతాయని, 'నిన్ను నువ్వు దిద్దుకో' అని వల్లూరి శివప్రసాద్ బోధిస్తారు. ఒక క్రమపద్ధతిలో పాఠాలు చదువుకునే విద్యార్థులకు పరీక్షలంటే ఎలాంటి భయం వుండదు.**

ఎలా బుద్ధి చెప్పారో ఉన్నవసేతు మాధవరావు నాటికను చూసి తెలుసుకోవచ్చు.

"స్కూల్ పెబ్బ" (మానీటర్) పంతులు పేరు చెప్పి, పిల్లల దగ్గర డబ్బులు, సరుకులు వసూలుచేయడం- అవి ఇచ్చుకోలేకపోతే పిల్లలను చితకబాదడంతో తల్లిదండ్రులు హడలిపోతుంటారు. కాని కొత్తగా వచ్చిన పంతులు ఆ వసూళ్ళను స్వీకరించక చదువులో శ్రద్ధ అందరిలో తెలివిగలవాడే పెద్ద అంటూ నిర్ణయించి, పెబ్బ ఆట కట్టించిన నాటిక యశోధారెడ్డి గారిది. దసరా సందర్భంగా ఇంటింటికి వెళ్ళిన పిల్లలకు పప్పు బెల్లాలు, పంతులుకు కానుకలు ముడుతుంటాయి. ఒక బీద తండ్రి వట్టి తాంబూలం ఇచ్చాడని కారాలు మిరియాలు నూరిన పంతులుగారి ఆగడాన్ని సహించలేని పిల్లలంతా ఏకమై అయ్యవార్ని ఒక పట్టు బట్టి గుణపాఠం నేర్పించడాన్ని శిష్టా ఉమామహేశ్వరరావు చిత్రీకరించారు.

పరలోకాన్ని ఆశించి చేసే దానధర్మాల కన్నా, కంటిముందు కనిపించే అన్నార్తుల కన్నీళ్ళు తుడవడమే అన్నింటికన్నా మిన్నయని ఆలపర్తి వెంకటసుబ్బారావు బోధిస్తారు. బీదవాళ్ళంతా దొంగలు కాదు. భాగ్యవంతులంతా దొరలు కాదు. సరియైన ఆదరణ లేక, పోషణ లేక, తెలివితేటలుండి చదువుకోలేక, చిన్నచిన్న చేతివృత్తులు చేసుకుంటూ అర్ధాకలితో అలమటించే 'పాలిష్ భయ్యా'లు ఈ

దేశంలో ఎందరో వున్నారు. వారిపట్ల కరుణ, దయ చూపించి చేయూతనిచ్చే వారుంటే మట్టిలో మాణిక్యాల్లా రాణించక పోరు అని జమ్మలమడక పూర్ణచంద్ర రావు చెబుతాడు. తండ్రులకున్న మద్యపానం, పొగతాగడం లాంటి చెడు అలవాట్లు పిల్లల్ని ప్రభావితం చేసే అవకాశం వుంది కాబట్టి, పెద్దలు కూడా ఇలాంటి అలవాట్లకు దూరంగా వుండాలని వట్టికోట ఆళ్వారుస్వామి బోధిస్తారు. రాజు తన 'పుట్టినరోజు' సందర్భంగా తమ ఇంట్లో పనిచేసే కుటుంబాన్ని వెట్టిచాకిరి నుండి విముక్తం చేయాలనే వరం కోరుకోవడం కె.ఎల్. నరసింహారావు నాటికలో కనిపిస్తుంది. జమీందారీ వ్యతిరేక రైతు ఉద్యమాన్ని చిత్రీకరిస్తూ తెన్నేటిసూరి 'గొడ్డకాడ' అని నాటికను రాశారు. పెద్దల, కోపాలు, విసుగుదలలు అమాయకులైన పిల్లల మీద చూపి చీటికి మాటికి దండించడం మంచిది కాదు. సహనమూ, ఓర్పు లేని తల్లిదండ్రుల పెంపకంలో బిడ్డలు మొండిగా, మూర్ఖంగా తయారవుతారు. పిల్లల మనస్తత్వం సున్నితం. పెద్దలు అర్థం చేసుకుని సహనంతో, ఇంగిత జ్ఞానంతో పెంచాలని నండూరు సుబ్బారావు 'చిన్నారి మనసు' నాటికలో తెలియజేస్తాడు. ప్రేమ-త్యాగం గురించి తెలియజేసిన 'కరుణామయి' గాథను కరుణశ్రీ నాటికలో చూడవచ్చు.

బాలల సంతోషానికి, మానసిక ఉల్లాసానికి హాస్యనాటికలు ఎంతగానో ఉపయోగపడతాయి. న్యాయపతి రాఘవరావు 'బూరెల మూకుడు' బాలల నాటిక సుప్రసిద్ధం. ఇందులో భార్యాభర్తలు ఇద్దరికి ఇద్దరే. చచ్చేంత పట్టుదలలు. ఎంత చిన్న విషయమైనా పంతాలు, పోటీలలోకి దిగుతారు. ఇద్దరు పందాలు వేసుకున్నారు. మూగనోము పట్టారు. ఎవరు ముందు మాట్లాడితే వాళ్ళు పందెం ఓడినట్లు ? చివరకు వాళ్ళు సాధించిందే మిటి? అర్థం లేని పంతాలు, పట్టుదలలు ఎలాంటి అనర్థాలకు దారితీస్తాయో ఇందులో వివరించారు. కుక్క కరిస్తే చెప్పుదెబ్బలు, తేలు కుడితే గాంధీ వైద్యం అయితే కుక్క కరవకుండానే మేష్టారికి చెప్పుదెబ్బలు, తేలు కుట్టకుండానే మామ్మగారికి గాంధీ వైద్యం. మామ్మను మించిన వైద్యం మాష్టారిదైతే, మేష్టారిని మించిన వైద్యం మామ్మగారిదని 'అల్లరి బాజా'లో కోడూరి లీలావతి దేవి చూపించారు. కూచిపూడి భాగవతులు పగటి వేషాలతో చతుష్షష్టి కళలను ప్రదర్శించి, శక్తికొద్ది తోచింది ఇమ్మని ఆ ఊరి వ్యాపారుల్ని వేడుకున్నారు. వాళ్ళు రెండు పైసలిచ్చి చేతులు దులుపుకు న్నారు. ఆ 'పగటి వేషగాళ్ళు' పోలీసుల్లా వేషాలు కట్టి వాళ్ళను వెర్రిబాగులోళ్ళను చేసి బుద్ధి చెప్పిన విధానాన్ని మద్దిపట్ల వెంకటరావు ఆసక్తికరంగా చిత్రించారు. పిల్లవాడు గడుగ్గాయి. తల్లి అమాయ కురాలు. తండ్రి మతిమరుపు మనిషి. కొడుకు జేబులో డబ్బులు దొంగిలిం చాడంటూ అభియోగం. 'గంగిరెద్దు' ద్వారా ఈ సమస్యను భలే తమాషాగా పరిష్కరించడంలో అన్నపర్తి చూపిన నేర్పు ఆకట్టుకుంటుంది. గాడిద గుడ్డును తేవడానికి బయలుదేరిన పరమానం దయ్య గారి శిష్యుల అమాయకత్వం, తెలివితక్కువతనాన్ని ఏడిద కామేశ్వరరావు తన నాటికలో తెలియ జేశారు. మనిషి అత్యాశలకు పోతే ఎదురయ్యేది ఆశాభంగమేనని, ఉన్నదాని లోనే తృప్తిపడితే అంతుకు మించి హాయి లేదని, 'కోతి మంత్రం' ద్వారా తెలియ జేసిన కలువకొలను సదానంద నాటికలో మంచి హాస్యం వుంది. అంతర్లీనంగా ఒక నీతి వుంది. పెళ్ళిళ్ళలో వియ్యాలవారి నిందలు, నిష్ఠూరాలు, అలకలు, కలహాలు చూడటానికి వెగటుగానే వుంటాయి. వాళ్ళను అనుకరిస్తూ పిల్లలు ఆడుకునే 'బొమ్మల పెళ్ళి' వాళ్ళను ఆలోచింప జేసేదిగా వుంటుంది. పిల్లలు భవిష్యత్తులో తాము అలా చేయకూడదనే భావనను అలవాటుచేసుకుంటారని రచయిత్రి ఇల్లిందల సరస్వతీదేవి ఈ నాటికను రాశారు.

పౌరాణిక నాటికలు పిల్లల్ని సంభ్రమాశ్చర్యాలతో ముంచెత్తుతాయి. రచయితలు ఒక నీతిని లేదా సందేశాన్ని ఇవ్వడానికి పౌరాణిక నాటికలను ఉపయో గించుకుంటారు. అధ్యయనం, కఠోర పరిశ్రమ, ఏకాగ్రతలను బోధించడానికి 'ఏకలవ్యుడు', సత్యవాక్పరిపాలన మనం శ్రీరామచంద్రుడు, అబద్ధమాడరాదని హరిశ్చంద్రుడు, స్నేహం విలువను చాటడానికి 'కుచేలుడు' నాటికలను వెలువరించారు. విష్ణుభక్తుడైన ప్రహ్లాదుడ్ని ఆ మార్గం నుండి మళ్ళించడానికి హిరణ్యకశిపుడు చేసిన విఫల ప్రయత్నాలు, చివరకు స్తంభం నుండి వెలువడిన నరసింహస్వామి హిరణ్యకశిపుని వధించుట అనే వృత్తాంతంతో సత్యశ్రీ 'బాల విజయము' అనే నాటికను రాశారు. కుటుంబ పోషణ కోసం దారి దోపిడి దారుగా, కిరాతకుడిగా వ్యవహరించే మనిషి, బంధాలన్నీ మాయ అని తెలుసుకొని మనిషిగా చివరకు ఋషిగా మారిన క్రమాన్ని అనగా 'వాల్మీకి పూర్వాశ్రమం'ను మధురాంతకం రాజారాం ఆసక్తికరమైన నాటికగా మలిచారు.

నటీమణుల కొరత, వ్యయప్రయాసల వల్ల చాలామంది నాటక సమాజాలవాళ్ళు స్త్రీ పాత్రలేని నాటకాల కోసం వెతికే వాళ్ళు. వాళ్ళలో కూడా ఆడపిల్లలు ముందుకురాని కారణంగా, స్త్రీ పాత్రలు లేని నాటికలను ఎంపిక చేసుకోవాల్సి వచ్చేది. అలాగే ఆడపిల్లల పాఠశాలలో, మహిళామండలి వార్షికోత్సవాల్లో ప్రదర్శించడానికి పురుష పాత్రలు లేని నాటికలను వెతుక్కోవాల్సి వచ్చేది. వారికోసం ప్రత్యేకంగా అలాంటి నాటికలను రాసే అవసరం ఏర్పడింది. ఇలాంటి నాటికలను నార్ల వెంకటేశ్వర రావు, బుచ్చిబాబు, ఆచార్య ఆత్రేయ, అంగర సూర్యారావు, సోమంచి యజ్ఞన్న శాస్త్రి, జంధ్యాల, సీతంరాజు, అత్తిలి కృష్ణారావు, డి. సుజాతాదేవి, సోమంచి రామం లాంటి ప్రముఖులు రాయగలిగారు. తల్లి దృష్టిలో అల్లరిపిల్ల, సోమరిపోతు, కోపిష్టి, గయ్యాళి పిల్ల, పిన్నిగారి దృష్టిలో మంచిపిల్ల. పెద్దలంటే

మర్యాదా భక్తి గల పిల్ల. బంగారు తల్లి. టీచర్ దృష్టిలో తెలివైన పిల్ల. చదువులో ఫస్టు, ఆటపాటల్లో ఫస్టు. ఇంతకీ ఆ ఇద్దరూ వేరువేరునా! ఒకరేనా! తెలుసుకోవాలంటే న్యాయపతి కామేశ్వరి రచించిన 'ఇద్దరు లలితలు' నాటిక చూడాల్సిందే.

గేయనాటికలను చూసి, విని పిల్లలు ఆనందించగలుగుతారు. కాని వాటిని పిల్లలతో ప్రదర్శింపజేయడం అంత సులభమేం కాదు. మంచిగొంతు, ధారణాశక్తి, సభాకంపం లేని పిల్లలు దొరికినప్పుడు మాత్రమే ఇలాంటి గేయనాటికలను ప్రదర్శించగలుగుతారు. కవులు మాత్రమే గేయనాటికలను రాయగలరు. గేయనాటికలను ప్రదర్శించడం కష్టం కాబట్టి ఇవి ఎక్కువగా శ్రవ్య నాటికలుగా అంటే రేడియో నాటకాలుగా ప్రసారమవుతుంటాయి. డాక్టర్ సి. నారాయణరెడ్డి 'సమతాఫలం' అనే గేయనాటికలో రాము, సోము, భీములతో పాటు తను కూడా ఒక పాత్రే. ఆ పాత్ర ద్వారా మనుషులంతా సమానమేనని కవి చెప్పిస్తాడు. తాను భూమాతకు సంకేతం. భూమాత ఫలాల పైన 'నాదే అధికారం' అని భీము విర్రవీగుతాడు. కాని తాను చేసిన బోధతో పిల్లలంతా కలిసి భీమునికి బుద్ధి చెబుతారు. సమతాఫలసాధనకై ఉద్యమిస్తారు. బాలల్ని ఊహాలోకంలోకి విహరింపజేసే చక్కని గేయనాటిక దాశరథి రాసిన 'వెన్నెల మడుగులు' వెన్నెల్లో ఆడుకోవడం పిల్లలకెంతో ఇష్టమైన విషయం. కాని కారుమబ్బులు కమ్మి ఉరుములు మెరుపులతో అంతటా చీకటి వ్యాపించినప్పుడు ఆడుకునే పిల్లలలో కష్టాలు కమ్మినట్లే అనిపిస్తుంది. మబ్బుల చీకట్లో బందీలు అయినట్లు తోస్తుంది. తిరిగి మబ్బులు తొలగి వెన్నెల విరిసినప్పుడు పిల్లల ఆనందానికి అంతుండదు. అటువంటి ఆనందాన్ని చందమామ పిల్లలకు ప్రసాదించినట్లుగా ఇందులో కవి వర్ణిస్తాడు.

నూరేళ్ళ బాలల నాటికల గురించి ఒక అవగాహన ఏర్పడటానికి, వల్లూరు శిప్రసాద్ సంకలించిన 'ప్రసిద్ధ బాల నాటికలు' ఉపయోగపడుతుంది. అయినా నిజం చెప్పాలంటే బాలసాహిత్యం తెలుగులో రావలసినంతగా రాసిలోనూ, వాసిలోనూ రాలేదని చెప్పాలి. ప్రముఖ సాహితీ వేత్తల్లో చాలామంది బాలసాహిత్యం అంతో ఇంతో రాసినవారే. దాశరథి, నార్ల చిరంజీవి, చింతా దీక్షితులు, సి. నారాయణరెడ్డి, దేవులపల్లి, యశోదారెడ్డి, వాసిరెడ్డి సీతాదేవి, రామలక్ష్మి, కరుణశ్రీ ఇలా చాలామంది బాలసాహిత్యం వెలువరించినవారే.

**బాలనాటికా లక్షణాలు...**

బాలసాహితీ సృజన చాలా కష్టతరమనే చెప్పాలి. బాలల ఆలోచనా పరిధిలోనే వస్తువు వుండాలి. బాలల కోసం రాసే పెద్దలు తమతమ సంక్లిష్ట భావాలను బాలలకు అంటగట్టకూడదు. అలాగే భాష, శైలి, పద్ధతి కూడా బాలల వ్యవహారంలో ఉండేవాటినే వాడాలి. పెద్దల ఆలోచనలు, పెద్దపెద్ద మాటలు పిల్లల నోట పలికించ కూడదు. నాటికలలోని పాత్రలు హాస్యభరితమైన, చిన్నచిన్న సంభాషణలతో పలకడానికి తేలికైన మాటలతో, ఆకర్షించే వేషధారణతో, అరగంట నిడివి మించకుండా వుండాలి. అంతేకాని బరువైన దీర్ఘ సంభాషణలు, భారీ సెట్టింగులు, నేపథ్య సంగీతం వుండకూడదు.

ఆంధ్రప్రదేశ్ బాలల అకాడమీ ప్రచురించిన బాలల నాటికల సంకలనం 'పొట్టి బావ'కు ముందుమాట రాస్తూ ప్రొ. మొదలి నాగభూషణశర్మ "చిన్నపిల్లల కోసం నాటికలు వ్రాయడమంటే కత్తిమీద సామే. నాటికలు మరీ పెద్దవి కాకూడదు. మరీ చిన్నవి కాకూడదు. వినోదం కలిగించేవిగా వుండాలి. విజ్ఞానదాయకాలు కావాలి. క్లిష్ట సమాసాలు వుండకూడదు. చక్కని భాషా సారస్వతాలు కలిగివుండాలి. పిల్లలు ప్రదర్శించడానికి అనువుగా వుండాలి. పిల్లల చేత నాటికలు ప్రదర్శించేటప్పుడు, వారి భావనా పరిధికి ఒదిగి వుండే నాటికలనే ఎన్నుకోవాలి. నాటికల ద్వారా నైతిక విలువల బోధన పెద్దల ఆశయమయితే, పిల్లలకు పాత్రల వినోదమే ముఖ్య ఆశయం. ఈ రెండింటిని సమంగా మేళవించే నాటికలు రావాలి" అని అభిప్రాయపడినారు.

పిల్లలకోసం రచించే నాటకాలలో భాషను గురించి రెండుమూడు రకాల అభిప్రాయాలు వినిపిస్తూ వుంటాయి. పిల్లలకు అర్థమయ్యే భాషలోనే వుండాలని కొందరంటారు. "అది సరికాదు. పిల్లలకు అర్థం కాదు అనుకునే పదాలను కూడా వాడినా ఇబ్బంది లేదు. నాటిక అభినయం ప్రధానం కనుక అర్థం కాదు అనుకునే పదాలను కూడా అభినయాన్ని చూసి పిల్లలు అర్థం చేసకుంటారు. అందుచేత అదొక పెద్ద నిషేధం కింద భావించ కూడదు" అంటారు మరికొందరు. నిజానికి ఈ వాదాలన్నింటిలోనూ యదార్థం వుంది. తెలిసిన పదాలతో తెలియని పదాలు కూడా వాడినందువల్ల పిల్లలకు కొత్తపదాలు పరిచయం అవుతాయి. భాష పాత్రోచితంగా వుంటుంది. భావాన్ని బట్టికూడా భాష నడుస్తుంది. కాగా ఔచితీ భంగం కలుగకుండా భాషను వాడడం అవసరం. వాచకం, ఉచ్చారణాదులలో శ్రద్ధ వహించాలి. అసలు భావం తెలిస్తే భాషను ఎలా ఉచ్చరించాలో సులువుగానే అర్థమౌతోంది. బాలల నాటికలలో పూర్తిగా మాండలికాలలో రచించినవి ఎక్కువగా కనబడవు. అయితే రచయిత పుట్టి పెరిగి నివసించిన ప్రాంతంలో ప్రయోగించే భాష, పదాల వాడుక, వారి రచనలలో అక్కడక్కడ తప్పక ఆవిష్కృతమవుతోంది. నిత్యావసరాలైన గ్రామీణ ప్రజలకు, నౌకరు, బిక్షగాడు, రిక్షావాడు లాంటి పాత్రలకు మాండలికం వాడుతుంటారు. కె. సభా తన బాలల నాటికల్లో రాయలసీమ పలుకుబడులను విస్తృతంగా ఉపయోగించారు. యశోదారెడ్డి లాంటివారు కొన్ని నాటికలను పూర్తి తెలంగాణ మాండలికంలో రాయడం గమనించదగ్గ విశేషం.

**(నవంబర్ 14, బాలల దినోత్సవ సందర్భంగా...)**

సాహితీ శిఖరం

నోబెల్ బహుమతి విజేత...

# మోజార్ట్ ఆఫ్ పోయట్రీ విస్లోవా సింబోర్స్కా



విస్లోవా సింబోర్స్కా పోలెండ్‌కు చెందిన కవయిత్రి, అనువాదకురాలు. ఈమెకు 1996లో సాహిత్య రంగంలో నోబెల్ బహుమతి లభించింది. ఈమెను మొజార్ట్ ఆఫ్ పోయిట్రీ (Mozart of Poetry)గా వర్ణించారు. విస్లోవా 1923 జూలై 2వ తేదీన పోలెండ్‌లోని బ్నిన్‌లో జన్మించింది. ఈమె క్రోకోలోని జెగిలోనియన్ విశ్వవిద్యాలయంలో పోలిష్ సాహిత్యం, సామాజిక శాస్త్రాలను అభ్యసించారు. 1953లో క్రోకో సాహిత్య వారపత్రిక జిలీ లిటరేకీలో కవితా విభాగానికి సంపాదకురాలయ్యారు. ఆమె రచించిన వాటిలో 1952లో లాటోగో జిజేభీ (దట్స్ వై ఉయ్ ఆర్ అలైవ్), 1954లో పిటైనియా డజ్‌వానె సోబీ (క్వశ్చనింగ్ వన్‌సెల్ఫ్), 1957లో వొలెనీ దొయేతి (కాలిగ్ ఆడట్ టూ యేతి), 1962లో సోల్ (సాల్ట్), 1967లో స్టో పాసీబ్ (ఎ హండ్రెడ్ వాయిసెస్) - మొదలైన కవితా సంగ్రహాలు ప్రచురించబడ్డాయి. ఈమె కవితలు ఫ్రెంచ్, జర్మన్, రష్యన్, చెక్, హంగేరియన్, డచ్, ఇంగ్లీషు మొదలైన అనేక భాషలలోకి అనువదించబడి సర్వత్రా మన్ననలు అందుకున్నాయి. వీరి మొట్టమొదటి కవితా సంకలనాలు రెండూ స్టాలిన్ యుగాన్ని, రాజకీయ నిరాడంబరతను దర్శింపజేస్తాయి. 1 ఫిబ్రవరి 2012న ఆమె పరమపదించింది.



జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత...
వచన రచన ధురీణుడు

# ఎం.టి.వాసుదేవన్ నాయర్

ఎం.టి. వాసుదేవన్ నాయర్ మలయాళ రచయిత. వాసుదేవన్ నాయర్ నేటి కేరళ రాష్ట్రంలోని పాలక్కాడ్ జిల్లాకు చెందిన కొడల్లూర్ గ్రామంలో 1933 జూలై 15న జన్మించారు 1950 దశకం తొలినాళ్ళ నుంచీ కథలను వ్రాయడం ప్రారంభించిన వాసుదేవన్ నాయర్ 1958లోని నాలుకెట్టు (కేరళ సంప్రదాయ గృహం), 1962లో అసురవిత్తు (రాక్షస బీజం), 1964లో మంజు (మంచు), 1969లో కాలం, 1984లో రాండమూఝం (రెండవ సారి), విలపయాత్ర, పతిరవుం పకల్వెలిచెవుం (అర్ధరాత్రీ, పగటివెల్తురు), వారణాసి తదితర నవలలను రచించారు. ఇవేకాక నాటికలు, పరిశోధనాత్మక, సాహిత్యాంశాల వ్యాసాలు, యాత్రాచరిత్రలు, ఆత్మకథాత్మక రచనలు రాశారు. సర్వబిందు, నాలుకెట్టు నవలల్లో ఉమ్మడి కుటుంబాలు కలిగిన కేరళ సామాజిక వ్యవస్థలో ఆధునికత తీసుకువస్తున్న మార్పుల గురించి వాసుదేవన్ నాయర్ ప్రస్తావించారు. ఇతడు దర్శకత్వం వహించిన నిర్మాల్యం సినిమాకు ఉత్తమ చిత్రంగా జాతీయ చలనచిత్ర పురస్కారం లభించింది. ఆయన 1995లో ప్రతిష్ఠాత్మక జ్ఞానపీఠ్ పురస్కారాన్ని అందుకున్నారు.

ముఖాముఖి

# అన్నీ ఇచ్చిన లోకానికి అనుభూతులను అక్షరరూపంలో ఇచ్చేద్దాం - డా॥ పెన్నా శివరామకృష్ణ



ఘనపురం దేవేందర్
90300 33331

నేను చేసింది చాలా కొద్ది. చాలా మంది తోటి పోలిస్తే...అదీ నా ఆత్మతృప్తి కోసమే చేశాను. కనుక మీరు ఆ దృష్టితోనే చూడాలని కోరుకుంటున్నాను నా రచనలు ఏవైనా అంటూ కుండబద్దలు కొట్టినట్టు సూటిగా చెప్పే పెన్నా శివరామకృష్ణ గారికి ఈ సంవత్సరం తెలంగాణ ప్రభుత్వం కాళోజీ పురస్కారంతో గౌరవించింది. ఈ సందర్భంగా తంగేడుతో వారి అంతరంగాన్ని పంచుకున్నారు.

**సార్ నమస్తే .. జీవితంలో, సాహిత్యంలో బాల్యదశ జ్ఞాపకాలు మరిచి పోలేనివి కదా. మీ జీవితంలో ఆ జ్ఞాపకాలు వివరిస్తారా?**

నేను పుట్టి, పెరిగింది నల్లగొండకు 15 కిలోమీటర్ల సమీపంలో ఉన్నటువంటి దుగునవల్లి గ్రామం. నాలుగో తరగతి వరకు దుగునవల్లిలో చదువుకున్నాను. ఆ తరువాత అక్కడికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న కట్టంగూరులో పదవ తరగతి వరకు చదువుకున్నాను. మా నాన్న టీచరు అయినప్పటికీ మేము ఐదుగురం సంతానం. దిగువ మధ్య తరగతి కుటుంబం. ఆర్థిక పరిస్థితుల వల్ల ఆయన నన్ను ఇంటర్మీడియట్ చదివించలేక పోయాడు. గత్యంతరం లేని పరిస్థితుల్లో నేను ఓరియంటల్ కళాశాలలో చేరాల్సి వచ్చింది. హాస్టల్



వసతి ఉండేది కాదు కాబట్టి, రూమ్ తీసుకుని ఉండి చదువుకోవాల్సి వచ్చింది. ఆ స్థితి కూడా లేకపోవడం వల్ల నేను మా చిన్న తాత గారి ఇంట్లో ఉండి డి ఓ ఎల్ రెండు సంవత్సరాలు, బి ఓ ఎల్ మూడు సంవత్సరాలు చదువుకున్నాను. 1974 నుంచి 79 మధ్యన ఐదు సంవత్సరాల పీరియడ్ నా వ్యక్తిత్వానికి సంబంధించి క్రూషియల్ అనుకుంటున్నాను. అప్పుడే జీవితంలో అభ్యుదయ భావాలు ఏర్పడుతుండగా... ఇంట్లో, కాలేజీలో సంప్రదాయం. ఈ రెండింటి మధ్య సంఘర్షణ. నాది బిడియపడే మనస్తత్వం. ఇది నా కవిత్వ బాల్యదశ. 1977 జనవరిలో ముక్కామల నాగభూషణం గారి సంపాదకత్వంలో విజయవాడ నుంచి వెలువడే "ప్రగతి" అనే పత్రికలో నా మొదటి కవిత అచ్చయింది. అదే అచ్చులో నాపేరు చూసుకోవడం మొదటిసారి.

**విశ్వవిద్యాలయం మీ సాహిత్య ప్రస్థానానికి ఎలా మార్గం చూపింది?**

విశ్వవిద్యాలయంలో ఎం.ఏలో చేరిన తర్వాత ఇక తెలుగులో చివరి వరకు వెళ్లాలనుకున్నాను. అది పి.హెచ్.డి. అనుకున్నాను. చదవడం మొదలు పెట్టాను. అక్కడినుంచి విస్తృతమైన సాహిత్య ప్రపంచాన్ని చూసే అవకాశం రావడం, అక్కడినుంచి రచనలు కూడా కొనసాగిస్తూ ఉండటం, మా గురువుగార్ల ప్రోత్సాహం కూడా అందడం, అదే యూనివర్సిటీలో వారు ఎంఫిల్, పి.హెచ్.డి. చేయడానికి అవకాశం ఇవ్వడం నా అదృష్టంగా భావిస్తున్నాను. నాకు మంచి గురువులు దొరికారు. వ్యక్తిగతంగా ప్రోత్సహించారు. అప్పుడు హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్‌గా కొత్తపల్లి వీరభద్రరావు గారు, రీడర్‌గా జీవి సుబ్రహ్మణ్యం గారు, ఆనంద రామం గారు, ఉస్మానియా నుంచి వచ్చి రవ్వా శ్రీహరి గారు గ్రామర్ చెప్పేవారు. వారు భిక్షగా పెట్టిన వ్యాకరణం జీవితాంతం ఉపయోగపడింది. ఇక మిగిలిన సాహిత్యం అంతా చదువుకున్నది, నేర్చుకున్నది. అట్లా చదువు గడిచింది.

**మీ వ్యక్తిత్వం మీద సాహిత్యం, మీ**

ముఖాముఖి

**సాహిత్యంపై వ్యక్తిత్వం చూపిన ప్రభావం ఏమిటి?**

చదువుకోవాలనుకున్న ఇంటర్మీడియట్ చదువుకోలేక పోయానే, ఆ లైన్లో వెళ్లి ఉంటే ఎలా ఉండేదో అని అనిపించినప్పటికీ ఆ అసంతృప్తి నాకు పెద్దగా ఇబ్బంది పెట్టలేదు... సాహిత్యపరంగా ఎప్పుడైతే రచనలు సీరియస్‌గా చేయడం మొదలుపెట్టానో ఆ తర్వాత మాత్రం స్థిరమైన అభిప్రాయం ఏర్పడింది. డబ్బు, ఆస్తులు సంపాదించాలన్న కోరిక లేదు. హోదాలు కావాలన్న కోరిక లేదు. ఎక్కడ మారుమూల చిన్న ఉద్యోగం చేసినా గాని, కేవలం చదువుకోవడం మీద, వీలైతే రాసుకోవడం మీదనే ధ్యాస చూపించాలి అని స్థిరమైన అభిప్రాయం ఏర్పడింది. నాకు ఇష్టమైన పనులే చేశాను. మొహమాటానికి ఏవో ఒకటి రెండు వ్యాసాలు రాసానేమో కానీ ఏ పుస్తకం కూడా మొహమాటానికి ఎవరో అడిగితే నేను రాయలేదు. ఇప్పటికి కూడా ఎవరైనా సబ్జెక్టు ఇచ్చి రాయమంటే ఇబ్బందిగా ఫీల్ అవుతాను.

**మీ ఇంటి పేరు పెన్నా.. నది పేరు.. సాహిత్యం నది వంటిదే... మీకు నదికి ఉన్న సంబంధం తెలియజేస్తారా?**

బ్రాహ్మణులలో కూడా వేరువేరు శాఖలకు సంబంధించిన వాళ్లలో ఈ ఇంటిపేరు ఉంది. అది ముఖ్యంగా మన తెలంగాణలో. మా పూర్వీకులది నల్లగొండ జిల్లా నార్కట్ పల్లి. పెన్నా ఇంటి పేరు కలవారు వరంగల్‌లో ఉన్నారు. విజయవాడలో కూడా ఉన్నట్టు విన్నాను. బహుశా మూడు నాలుగు తరాల కింద ఏమైనా పెన్నానదితో బంధమున్నదేమో. అక్కడినుంచి పూర్వికులు వచ్చారేమో తెలియదు. అంతకు మించి మా ఇంటిపేరుకు సంబంధించి చరిత్ర తెలియదు.

**పెన్నా శివరామకృష్ణ అంటే టక్కున విమర్శ అని గుర్తుకు వస్తుంది. విమర్శకునిగా మీరు చేసిన కృషిని వివరిస్తారా?**

నేను విమర్శ వైపు వెళ్లడానికి ముఖ్య కారణం ఏమిటంటే బహుశ నాకు తెలవకుండా వచన కవిగానే మొదలయ్యాను. కేవలం కవిత్వమే కాకుండా తెలిసో తెలియక అధ్యయనం వైపు కూడా మొగ్గువున్నది. బహుశా ఆ అధ్యయనమే నా విమర్శకు మూలం అనుకుంటాను. దానితోపాటు కవి కంటే పండితకవికి లోకంలో ఎక్కువగా గౌరవం ఉంటుంది. పాండిత్యం ఉంటే కవికి మరింత గౌరవం దక్కుతుందన్న భావం ఏదో నామనసులో ఉండి ఉంటుంది. బహుశా అందుకే కవిత్వంతో పాటు విమర్శ కూడా రాయాలనే పట్టుదల ఏర్పడింది. మొదట నేను శేషేంద్ర శర్మగారి మీద పి.హెచ్.డి. చేశాను. 1993లో ఆ పుస్తకాన్ని అచ్చేసాను. వ్యక్తిగత కారణాల వల్ల తర్వాత సాహిత్య జీవితానికి ఐదేళ్లు విరామం వచ్చింది. 2001లో నేను విమర్శ మొదలు పెట్టాను. 2001లో "శివారెడ్డి కవిత్వం పరిణామ వికాసాలు'' వెలువడింది. నా సాహిత్య జీవితంలో అక్కడినుంచి రెండవ ఇన్నింగ్స్ మొదలైంది. దానికి శివారెడ్డి గారు చాలా సహకరించారు. అట్లా రాసినటువంటి వ్యాసాలతో "వచన కవిత - ఆలంకారికత'' పేరుతో 2018లో అచ్చువేశాను. ఇవి నా విమర్శ రచనలు ప్రస్తుతానికి.




**గజల్ రచనలో మీ శైలి ఎంతో ప్రత్యేకమని అంటారు. గజల్‌పై ఆసక్తి కలగడానికి నేపథ్యం... గజల్ రచనా ప్రస్థానం గురించి వివరిస్తారా?**

మధ్యలో నా జీవితంలో వచ్చిన మరో అవాంతర దశ గజల్. అంటే నేను అనుకోకుండా గజల్ వైపు మళ్ళాను. శేషేంద్ర శర్మ గారి గురించి వ్యాసాలు రాసేటప్పుడు గజల్ గురించి కొద్దిపాటి పరిచయం. శేషేంద్రశర్మ గజల్ రాయలేదు కానీ వారి కవిత్వంలో గజల్ ఛాయలు కనబడతాయి. ఆయన రాసిన వ్యాసాలు కూడా చదివాను. ముఖ్యంగా ఆయన కవిత్వంలో గజల్ ఛాయలు ఉన్నాయి. 2001లో ఏదో ఒక ప్రేమ గేయం లాంటిది రాయాలని అనిపించి కొన్ని వాక్యాలు రాసి, పరిశీలించుకుంటే చూడడానికి కొన్ని వాక్యాలు బాగానే ఉన్నాయి కాని మామూలు గేయాల కంటే భిన్నంగా కొంచెం చమత్కార వ్యక్తీకరణ కనిపించింది. అది గజల్ ను పోలి ఉన్నట్టుందే అని అనిపించింది. అప్పుడు నేను గజల్ గురించి అధ్యయనం ప్రారంభించాను. నారాయణరెడ్డి గారి గజళ్ళు, దాశరథి గారి గజళ్ళు చదివాను కానీ ఆ పద్ధతిలో కాకుండా ఉర్దూ గజళ్ళలోని మాధుర్యాన్ని, ఆ పరిమళాన్ని తెలుగులోకి తెస్తే బాగుంటుంది అని అనిపించింది. అప్పుడు ఎందుకో ప్రేమ కవిత్వం రాయాలనిపించింది. ఈ గజల్ గురించి పరిచయం ఏర్పడడం తోటి అది కూడా కొంత కారణం అయింది. గజల్స్ వివిధ వస్తువుల మీద వచ్చినప్పటికీ, ప్రేమ కేంద్రంగా వచ్చిన గజల్సే బాగా ప్రఖ్యాతి పొందినాయి.

**తెలుగులో తొలి హైకు సంకలనకర్తగా మీకు పేరు వచ్చింది కదా సార్. అసలు హైకూలవైపు ఎలా వెళ్లారు?**

ముఖాముఖి

నాకు పెద్దగా హైకూల గురించి పరిచయం లేదు. నిజానికి గాలి నాసర్ రెడ్డి హైకూలు చదివిన తర్వాతనే వాటి పట్ల ఆకర్షణ ఏర్పడింది. అవగాహన లేని ఆకర్షణ తోటి పిచ్చిగా రాసినటువంటి కొన్ని హైకూలను 1991 లోనే " రహస్య ద్వారం'' పేరుతో అచ్చు వేశాను. తెలుగులో వచ్చిన మొదటి హైకూ సంకలనం ఇదేనని కొందరు విమర్శకులు పేర్కొన్నారు. కానీ అందులో ఐదారుకు మించి మంచి హైకూలు లేవని నా ఉద్దేశం. ఆ పుస్తకం అచ్చు వేసిన తర్వాతనే హైకూల గురించి కొంత చదువుకోవడం, నేర్చుకోవడం, ప్రారంభించాను. అదికూడా ఇంగ్లీషు పుస్తకాల ద్వారానే భారతీయ హైకూల గురించి ప్రపంచ దేశాల హైకూల గురించి కొంత అధ్యయనం చేయడం, చదివి ఆనందించడం జరిగింది. ప్రాయశ్చిత్తంగా ఒక మంచి హైకూ సంకలనం వేయాలనిపించి 2000 సంవత్సరంలో "చినుకుల చిత్రాలు'', 2004లో "సులోచనాలు'' అని రెండు సంపుటాలు వేశాను. హైకూ ఇచ్చిన ఆనందానికి కృతజ్ఞతగా ఒక పుస్తకం అచ్చు వేసి నమస్కారం చెప్పి, వేరే ప్రక్రియ వైపు మల్లుదామని అనిపించింది. ఎందుకంటే ఎప్పుడూ ఒకే రంగంలో పని చేయాలి. ఒకే ప్రక్రియకు కట్టుబడి ఉండాలని నేను ఎప్పుడూ అనుకోలేదు. ఒక ప్రక్రియ అన్ని వస్తువులకు ఒదగదు. అన్ని వస్తువులకు అన్నీ ప్రక్రియలు ఒదుగవు అని అనిపిస్తుంటుంది. మనలో ఉన్నటువంటి రకరకాల భావాలను వ్యక్తపరచడానికి రకరకాల ప్రక్రియలు అవసరమవుతాయి. రకరకాల రూపాలు అవసరమవుతాయి. ఆ క్రమంలోనే కొన్ని మెరుపు లాంటి భావాలు చెప్పడానికి హైకూ ఉపయోగపడింది. కొంత ప్రేమ, తాత్త్వికత చెప్పడానికి గజళ్ళు ఉపయోగపడ్డాయి. " దేశదేశాల హైకు (2009)'' పేరుతో ఒక అనువాద హైకూ సంపుటి ప్రచురించి హైకూకు నమస్కారం పెట్టాను. ఆ రోజుల్లోనే గజల్ వైపు మళ్లాను. గజల్ నాకు ఇచ్చిన ఆనందానికి ఆ ప్రక్రియకు కృతజ్ఞతగా "గజల్ సౌందర్య దర్శనం'' రాసి గజల్‌కు నమస్కారం పెడదాం అనుకున్నాను కానీ ఎందుకో అదే సంవత్సరంలో మళ్లీ గజళ్ళు రాయాలనిపించి 2012లో "శిశిర వల్లకి " పేరుతోటి రెండవ గజళ్ళ సంపుటి ప్రచురించాను. ఇక గజల్‌కు దండం పెడదామని అనుకున్నాను. కానీ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా "తెలుగు గజళ్ళు - రుబాయీలు (2012)'' అనే అంశం మీద మోనో గ్రాఫ్ రాయమని అప్పటి తెలుగు విశ్వవిద్యాలయం వారు అడిగితే ఆ పుస్తకం రాసి గజళ్ళకు దండం పెట్టాను.

**సార్.. గజల్, హైకులతో పాటు తెలుగులో మీరు చేపట్టిన మరో సాహిత్య ప్రక్రియ రుబాయి. ఆ ప్రక్రియలో మీ అనుభవాలను తెలియజేస్తారా?**

మళ్లీ వచన కవిత్వం, వచన కవిత్వ విమర్శ వైపు మళ్ళాను. మళ్లీ ఆ క్రమంలోనే ఉర్దూ రుబాయిలు చదువు తున్నప్పుడు అనిపించింది. తెలుగులో రుబాయిలు వచ్చాయి కానీ లక్షణాలు పాటిస్తున్నారా... ఆ చమత్కారం ఉన్నదా... లేదా.... ఆ రదీఫ్ కాఫియాలు సక్రమంగా పాటిస్తున్నారా.... అసలు రుబాయి నిర్మాణ శిల్పం తెలుగు రుబాయిలలో ఉన్నదా లేదా... అన్న సందేహం కలిగింది. నా శక్తిమేరకు కొన్ని రుబాయిలు రాయాలనిపించి 2021 ఫిబ్రవరిలో "అశ్రుధార'' పేరుతో రుబాయీల సంపుటి ప్రచురించి రుబాయీలకూ కూడా దండం పెట్టేసాను.

**మీరు రాస్తున్న పెన్నా సరాలు ప్రక్రియకు గురజాడ ముత్యాల సరాలుకు ఉన్న సామ్యం మరియు వైవిధ్యం ఏమిటో వివరిస్తారా?**

ఈ మధ్య మరో రకమైన రచన "పెన్నా సరాలు'' పేరుతోటి ప్రారంభించాను. ముత్యాల సరాలు ఛందస్సులోనే అయినప్పటికీ కొంచెం స్వేచ్ఛ తీసుకున్నాను. ఒకటి రెండు మాత్రల విషయంలో... పాద నియమం విషయంలో కొద్దిపాటి స్వేచ్ఛను తీసుకున్నాను కాబట్టి.... ఇవి ముత్యాలసరాలు లాగా లేవు... ముత్యాలసరాలు ఎట్లా అవుతాయని ప్రశ్నించే వారు ఉంటారు కాబట్టి... ఆ అవకాశం లేకుండా పెన్నాసరాలు అంటే సరిపోతుందని రాశాను. ప్రస్తుతం ఆ పుస్తకం అచ్చులో ఉంది.

**ఇన్ని సాహిత్య ప్రక్రియలలో మీరు అడుగుపెట్టడం వెనుక రహస్యం ఏదైనా ఉందా?**

ఇట్లా ఒక ప్రక్రియకు కట్టుబడి ఉండకుండా నా సాహిత్య జీవితం నడుస్తున్నది. నాకు అనిపించిన విషయం ఏమిటంటే ప్రతి వాద్యము అన్ని రాగాలను, అన్ని భావాలను ఒకే రకంగా పలికించలేదు. అట్లాగే అన్ని రకాల విషయాలు, భావాలు ఒకే ప్రక్రియలో ఇమడవు. సుదీర్ఘంగా చెప్పాల్సిన తాత్వికమైన ఫీలింగ్‌ను హైకూలలో చెబుదామంటే కుదరదు. ఏ ప్రక్రియకు ఉండే పరిమితులు ఆ ప్రక్రియకు ఉంటాయి. జీవితంలో ఉన్నట్టే సాహిత్యంలో కవులుగా, రచయితలుగా కూడా డైవర్సిటీ ఉంటాయి. భిన్నమైనటు వంటి అభిరుచులు ఉంటాయి. వాటిని ఎందుకు వ్యక్తపరచ కూడదు.... అనేది నా ఉద్దేశ్యం. ఏదైనా రాయకుండా ఉండ లేకపోతేనే రాస్తాను. ఎవరినో సంతృప్తి పరచడం కోసం, లేదా కెరీరిజం లాంటి వాటిని దృష్టిలో పెట్టుకొని నేను రాయను. మాత్రాఛందస్సు తెలుసుకుని నిర్దిష్ట గతులను పాటించినట్లయితే పఠన యోగ్యత ఉంటుంది, గాన యోగ్యత ఉంటుంది.

**ప్రక్రియ ఏదైనా వస్తువు లోనికి అలా దూసుకెళ్లిపోతారు. పాఠకుల హృదయాలను కదిలిస్తారు. మీకెలా సాధ్యమౌతున్నది?**

నా సుఖదుఃఖాలకు మూలాలను అర్థం చేసుకుంటే, ఆశలకు... ఆశాభంగాలకు కారణాలను నాకు నేను విశ్లేషించుకుంటే... వచ్చినవే ఈ రచనలు. ఇవన్నీ నా జీవితంలో ఏదో ఒక దశలో ఏదో ఒక రూపమైన అనుభవాల

ము
ఖా
ము
ఖి

సారాంశమే. 99% నా గజళ్ళలో, రుబాయిలలో, వచన కవిత్వంలో నేను ఫీల్ కాకుండా, ఎక్కడో నొప్పి కలగకుండా, ఏ వేదనా కలుగకుండా, ఏ సంఘర్షణలో మథన పెట్టకుండా రాయలేదు. 99 శాతం నా అనుభవాలు, ఒక శాతం మిత్రుల అనుభవాలు కలిసి ఉంటాయి.

**సాహిత్య ప్రక్రియలలో ఆరితేరిన మీరు సాహిత్యేతర గ్రంథాలు రాయడం ఆశ్చర్యకరం. వాటి గురించి తెలియజేస్తారా?**

సాహిత్యేతర రచనలు కొన్ని చేశాను. మనకు ఏ రచన చేయగలిగిన శక్తి ఉన్నా, ఇతరేతర కారణాల వల్ల దాన్ని అణుచుకోవడం అనవసరం అని నా ఉద్దేశం. ఈ లోకం నుంచి చాలా నేర్చుకున్నాం. ఆనందాలిచ్చింది. విషాదాలిచ్చింది. అట్లాగే మనలో కలిగిన అన్ని భావాలకు అక్షర రూపం ఇచ్చి వెళ్ళిపోతే సరిపోతుంది. ఈ లోకానికి నేను చేయగలిగింది ఇదొక్కటే కాబట్టి. అందువల్ల నా ఏ అభిరుచిని నేను వదులుకోలేదు. అన్ని రకాల పుస్తకాలను మనం చదివినట్టే, అన్ని రకాల రచనలు ఎందుకు చేయకూడదు? అనే దృష్టితోనే దిన ప్రాముఖ్యం తెలుపుతూ "రోజు రోజుకో చరిత్ర (2004)" అనే పుస్తకం రాశాను. జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు ప్రతి తేదీకి ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయంగా ఉన్న ప్రాధాన్యతను తెలియజేస్తూ ఈ పుస్తకం రాశాను. విశాలాంధ్ర వారు అచ్చువేశారు. జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు దినోత్సవాలను సేకరించి "జాతీయ అంతర్జాతీయ దినోత్సవాలు (2006)" అనే పేరుతోటి ఒక పుస్తకం రాశాను. దీని పరివర్ధిత ముద్రణ 2019 లో వెలువడింది. జూలూరు గౌరీశంకర్ గారు అచ్చువేశారు. ఇవన్నీ టీచర్లకు, జర్నలిస్టులకు, విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటాయి. థీమాటిక్ కొటేషన్స్, థీమెటిక్ పోయెట్రీ ఇంగ్లీష్‌లో వచ్చాయి. తెలుగులో అటువంటి పుస్తకాలు చాలా తక్కువ. ప్రేమకు సంబంధించి ఆ పని చేయాలనిపించి నేను చలం, దాశరథి, తిలక్ ఆ కాలం నుంచి 2008 వరకు వచ్చిన ప్రేమ కవితలలో కొన్నిటిని ఎన్నిక చేసి, "101 ప్రేమ కవితలు" పేరుతో ముందుమాట రాసి ప్రచురించాము. గౌరీ శంకర్ గారు అచ్చు వేశారు. ప్రేమను గురించి చమత్కారంగా ఉండే, వాస్తవానికి దగ్గరగా ఉండే, కవితాత్మకంగా ఉండే కొన్ని కోటేషన్స్ ను అనువదించి "ప్రేమ - మరికొన్ని సంగతులు (2009)" అనే పేరుతో అచ్చువేశాను. తెలంగాణకు సంబంధించి జనవరి ఒకటి నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు తేదీలు, నెల, సంవత్సరం దొరికినంతవరకు శక్తి మేర సేకరించి "తారీఖుల్లో తెలంగాణ (2019)" పుస్తకం రాశాను. భాషా సాంస్కృతిక శాఖ ద్వారా మామిడి హరికృష్ణ గారు చాలా శ్రద్ధ తీసుకుని అందంగా అచ్చువేశారు. ఇంగ్లీష్‌లో చమత్కారంగా ఉండే కొటేషన్స్ పుస్తకాలు చాలా ఏండ్ల కింద వచ్చాయి. డెవిల్స్ డిక్షనరీ, సిమిక్స్ ఎన్సైక్లోపీడియా మొదలైనవి. వాటినన్నింటినీ దృష్టిలో పెట్టుకొని కొన్ని చమత్కారంగా ఉండే లోతైన, అర్థవంతమైన కొటేషన్స్ ను తెలుగులోకి అనువాదం చేసి "నిరాశావాది నిఘంటువు (2006)" అని ఒక చిన్న పుస్తకాన్ని అచ్చు వేశాను. ముద్దుకు ఉన్నటువంటి ప్రాధాన్యతను తెలియజేస్తూ పరిశోధనాత్మకమైన పుస్తకాన్ని "ముద్దుల ముచ్చట్లు (2009)" పేరుతో రాశాను. గుడిపాటి గారు పుస్తకంగా వేశారు. వార్తలో కూడా సీరియల్ గా ప్రచురితమయ్యింది.

**ఈతరం కవులు, రచయితలకు మీరిచ్చే సూచనలు, సందేశాలు, మీ దృష్టిలో సామాజిక మాధ్యమాల ప్రభావం ఎలా ఉంది?**

ఎవరికైనా సూచనలు, సందేశాలు ఇవ్వగలిగిన స్థాయి నాది కాదు. నేను చెప్పదలచుకున్నది ఏమిటంటే పత్రికలో అచ్చయినా, మనమే పుస్తకంగా వేసుకున్నా అచ్చులో పేరు కనిపించినంత మాత్రాన, మన రచన గొప్పది అని అనుకోవద్దు. అట్లాగే సోషల్ మీడియాలో నాలుగు లైకులు వస్తే అది ప్రామాణిక రచన అనో, ఉత్తమ రచన అనో మనం ఎంచకూడదు అని అనుకుంటా. సోషల్ మీడియాకు ఎడిక్ట్ కాకుండా ఉంటే, సద్వినియోగం చేసుకుంటే మంచి సాహిత్యానికి ఇంకొంచెం ఎక్కువ ప్రచారం లభించే అవకాశం ఉంటుంది. ఎక్కువ మందికి చేరే అవకాశం ఉంటుంది. అట్లాగే అల్పసంతోషులు, పరిపక్వత లేని వారు తప్పు దారి పట్టే అవకాశం ఉంది. మన రచనలను మనం నిష్పక్షపాతంగా దానిలో ఉన్నగుణదోషాలను మనమే విచారించుకునే శక్తి మనకు ఉండాలి. లేకపోతే ఆయా ప్రక్రియల్లో తెలిసిన వారి సలహాలు, సూచనలు తీసుకొని తమ రచనలను సంస్కరింపజేసుకునే దిశగా ఆలోచించాలి.

**మిమ్మల్ని ప్రభావితంచేసిన రచయితల గురించి తెలియజేస్తారా?**

నన్ను ఇన్స్పైర్ చేసిన రచయితలు చాలామంది ఉన్నారు. కొందరి దగ్గర నుంచి నిష్పాక్షికతను నేర్చుకున్నాను. మన అభిమానాలు పక్కనపెట్టి నిష్పక్షపాతంగా ఉండడం ఎట్లా? మరికొంతమంది దగ్గరనుంచి వ్యక్తిగత ప్రచారానికి, స్వోత్కర్షకు దూరంగా ఉండడం, కాలప్రవాహంలో మన రచనకు ఉన్న స్థానం ఏమిటి? అనేది అంచనా వేసుకోవాలి అనేది నేర్చుకున్నా. మన రచన మనకు గొప్పది కావచ్చు అవతలివారికి ఎలా అనిపిస్తుంది అన్నది మనం గమనించాలి. ఒక్కమాటలో చెప్పాలంటే ఆత్మ జ్ఞానం కలిగి ఉండాలి. మన రచన చాలామందికి నచ్చుతుందని గాని, చాలా కాలం నిలిచి ఉంటుంది అనేది కాని అబద్ధం. అది తెలుసుకోవాలి. మరికొంత మంది నుంచి వచనం రాసేటప్పుడు ముఖ్యంగా విమర్శ రాసేటప్పుడు మెలకువగా వ్యవహరించడం ఎట్లా అనేది నేర్చుకున్నాను. విమర్శ కుడికి కావాల్సింది మొదట సహృదయుడై ఉండాలి. అధ్యయనం, నిర్భీకత, సత్యనిష్ఠ అవసరం. ఇలాంటి లక్షణాలు లేకపోతే



మంచి విమర్శకుడు కాలేడు. పేర్లు ఎందుకు చెప్పడం లేదంటే ఒకరి పేరు చెప్తే మరొకరి పేరు నేనే పొరపాటున మర్చిపోవచ్చు. చాలా మంది నుంచి చాలా నేర్చుకున్నా. మా గురువుగారు నోముల సత్యనారాయణ గారి దగ్గర్నుంచి భాష పట్ల ఎరుక కలిగి ఉండడం, అధ్యయనం, మాట్లాడే మాటల్లో, రాసే రాతల్లో శాబ్దిక దోషాలు లేకుండా చూసుకోవడం, భాషాపరమైన మెలకువ కలిగి ఉండటం, దానికోసం అధ్యయనం చేయడం కూడా మా గురువుగారి దగ్గర్నుంచి ప్రభావితుడనై నేర్చుకున్నాను. కొంతమంది నుంచి ఎలా ఉండకూడదో నేర్చుకున్నాను. కొందరి నుంచి ఎలా ఉండాలో నేర్చుకున్నాను.

**గజల్, రుబాయీ, హైకు, పెన్నా సరాలు వీటన్నిటికీ కీలకమైన మాత్రా ఛందస్సులో మీరు ఎలా పట్టు సాధించ గలిగారు?**

చతురస్ర గతి, ఖండ గతి, మిశ్ర గతి ఈ గతుల గురించి తెలుసుకునే క్రమంలో నాకు చేకూరి రామారావు గారి "ముత్యాల సరాల ముచ్చట్లు" బాగా ఉపయోగపడింది. ఆ పుస్తకం చదవకపోతే నాకు మాత్రాఛందస్సు గురించి అవగాహన కలిగేది కాదు. వేరే పుస్తకాలు ఉండి ఉండొచ్చు కానీ నాకు ఆ రోజుల్లో అందుబాటులోకి వచ్చిన పుస్తకం అది. అందుకే "సల్లాపం" పుస్తకంలో కృతజ్ఞతల్లో చేకూరివారికి కృతజ్ఞతలు చెప్పాను. వారు ఆ మాట చదివి చాలా ఆనందపడ్డారు. "ఆ పుస్తకాన్ని సాహిత్య లోకంలో ఎవరూ పట్టించుకోలేదయ్యా, నువ్వు ఒక్కడివి పట్టించుకున్నావు" అని అన్నారు. ఈ విధంగా ఒక్కొక్కటి నేర్చుకోవడానికి ఒక్కొక్క గురువు ఒక్కొక్క విధంగా ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపయోగపడ్డారు.

**తెలంగాణ ఉద్యమంలో ఒక సాహిత్య కారునిగా మీరు నిర్వహించిన పాత్ర?**

తెలంగాణ ఉద్యమానికి సంబంధించి బహుశా నేను ఐదవ తరగతి చదువు తున్నప్పుడు 1969లో జరిగిన ఉద్యమం లోనే తెలిసీ తెలియని వయసులో తెలిసీ తెలియకుండానే ఒక రోజు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నాను. ఆ క్రమంలో ఆనాటికి పెద్దగా అవగాహన లేదు. ఏమీ తెలియదు. చదువుకుంటున్న క్రమంలో విద్యార్థిగా కూడా ఆంధ్రుల ఆధిపత్యాన్ని, తెలంగాణ భాషా సంస్కృతుల పట్ల నిరసన భావాన్ని , చిన్న చూపును గమనిస్తూనే వచ్చాను. యూనివర్సిటీ స్థాయికి వచ్చేసరికి అది ఇంకా స్పష్టమైంది. ఉద్యోగం లోకి వచ్చిన తర్వాత మరింత స్పష్టమైంది. కొంతమంది అధికారులు, ఇక్కడి అక్కడి సన్నిహిత మిత్రుల సాంగత్యంలో అధ్యయనం ద్వారా తెలిసింది కొంత, ఇంకా నిజాయితీగా స్పష్టంగా చెప్పాలంటే తెలంగాణ ఉద్యమం ఆరంభమైన దశలో కూడా నేను ఉద్యమ విషయంలో కళ్లు తెరవలేదనే చెప్పాలి. ఉద్యమం జరుగుతున్న క్రమంలో 2004, 2005 ప్రాంతంలో ఉద్యమం గురించి నేను సీరియస్ గా ఆలోచించడం మొదలైంది. నాకున్న మొట్టమొదటి బలహీనత ఏమిటంటే కవిత్వానికి సంబంధించి సామాజిక అంశాలను నేరుగా, స్పష్టంగా పేర్కొంటూ కవిత్వం రాయడం వంటిది నాకు అలవాటు కాలేదు. బహుశా మొదటి నుంచి ప్రతీకాత్మక కవిత్వాన్ని అభిమానించడం వల్లనో, అంతర్ముఖత్వం వల్లనో. సామాజిక అంశాలు నన్ను మథన పరిచినా, గాయపరిచినా, వేదన కలిగించినా, వాటినన్నింటినీ నేను ప్రతీకాత్మకంగా చెప్పడానికే ప్రయత్నం చేశాను. అట్లాగే ఉద్యమ సమయానికి వచ్చే వరకు నేను కవిత్వం నుంచి కొంత విరామం తీసుకుని సాహిత్య విమర్శలో కొంచెం సీరియస్‌గా కృషి చేస్తున్న దశ. అప్పుడు కూడా ఉద్యమానికి సంబంధించి నేను రాసింది తక్కువ. ఇంకొక మాట కూడా చెప్పాల్సి వస్తే నా భావజాలం, రాజకీయపరమైన భావజాలం కానీ, సామాజిక పరమైన భావజాలం కానీ, తాత్విక పరమైన భావజాలం కానీ ఏ రకమైన భావజాలమైన కవిత్వంలో కంటే, నా విమర్శలో ఎక్కువగా తెలుస్తుంది. అందువల్ల నా విమర్శ రచనల్లో కొంత ప్రత్యక్షంగా, ఎక్కువగా పరోక్షంగా నాకున్న తెలంగాణ అభిమానం కనిపిస్తుంది. ఆ క్రమంలో 2013లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్న తర్వాత ఆంధ్రప్రాంతంలో వచ్చిన కృత్రిమ ఉద్యమం వలన కలిగిన ఆగ్రహాన్ని ఆవేదనను ఆవేశాన్ని కొంత అధిక్షేప ధోరణిలో రుబాయిలుగా రాశాను. అయితే ఆ రుబాయిల్లో కవిత్వం తక్కువ, ఉద్వేగము, వెటకారం, హేళన ఎక్కువ. అంతేకాకుండా ఆనాటి ఆంధ్ర నాయకుల ఆక్షేపణలకు, సమైక్యవాదానికి జవాబు చెప్పటం కోసమే ప్రధానంగా రుబాయిలు రాశాను. అదే క్రమంలో గౌరీశంకర్ గారితో కలిసి తెలంగాణ సంస్కృతి కళలకు సంబంధించిన వ్యాసాలను, వివిధ రంగాలలో ప్రసిద్ధులైన, లోతుగా కృషి చేసిన, విమర్శకుల, పరిశోధకుల వ్యాసాలను సంకలనంగా చేసి ప్రచురించాము. అది చిన్న పుస్తకంగా వంద పేజీలతో 2009లోనే అచ్చయ్యింది. ఆ తరువాత దాన్ని విస్తరించి సుమారుగా 400 పేజీలకు పెంచి మరిన్ని వ్యాసాలను చేర్చి తెలంగాణ సంస్కృతీ సర్వస్వం లాగా దాన్ని తీర్చిదిద్దడం జరిగింది. బతుకమ్మ

పండగ దగ్గరనుండి మన చిత్రకళను గురించి, మన నాట్యకళను గురించి, సంగీతకళను గురించి, మొత్తం తెలంగాణ సంస్కృతి మరియు కళలకు సంబంధించి అన్ని అంశాలను స్పృశించే విధంగా కుల పురాణాలకు సంబంధించి, కులవృత్తులకు సంబంధించి, బంజారా పండుగల గురించి ఇలా వివిధ కులాల సంస్కృతులు, మొత్తం తెలంగాణాలో ఉన్నటువంటి కళలు ఒగ్గుకథ లాంటి వాటి గురించి, మంచి వ్యాసాలు అన్నీ సేకరించి ఒక పుస్తకంగా వేశాము. ఆ పుస్తకం చాలా ప్రజాదరణను పొందింది. ఇది బాగా తృప్తినిచ్చిన పుస్తకం.

**ప్రస్తుతం తెలంగాణ భాషా పరంగా, సాహిత్య పరంగా ఇంకా ఎటువంటి కృషి జరగాలి?**

తెలంగాణ ఏర్పడిన తర్వాత జరగ వలసిన పనులలో ముఖ్యంగా సాహిత్యానికి సంబంధించి మంచి ప్రామాణికమైన నిఘంటువు రావాలి. నలిమెల భాస్కర్ లాంటివారు తెలంగాణ భాషకు చేసిన సేవ గుర్తుంచుకోదగినది. కపిలవాయి లింగమూర్తి, కాలువ మల్లయ్య, మడిపల్లి భద్రయ్య, ముదిగంటి సుజాతా రెడ్డి, సంగిశెట్టి శ్రీనివాస్, కే శ్రీనివాస్, సుంకిరెడ్డి నారాయణరెడ్డి వంటి వారు చేసిన కృషి అందరికీ తెలిసిందే. నిఘంటువుకు సంబంధించి వీరి కృషి కూడా ముడి సరుకుగా ఉపయోగించుకొని, తెలంగాణ లోని అన్నీ జిల్లాలలో ఉన్న వృత్తి మాండలికాలు, కుల మాండలికాలను కూడా సేకరించాలి. గతంలో కూడా కొన్ని వృత్తి మాండలిక నిఘంటువులు వచ్చాయి. వాటిని కూడా ఆధారంగా చేసుకొని, జిల్లా మాండలికాల మీద కూడా కొంత కృషి జరిగింది. ఉదాహరణకు రవ్వా శ్రీహరి గారు నల్గొండ మాండలికాల గురించి ఒక పుస్తకం రాశారు. వీటన్నిటినీ ఆధారంగా చేసుకొని ఏదైనా ఒక సంస్థ వాళ్ళు ఒక సమగ్రమైన నిఘంటువును తయారు చేస్తే బాగుంటుందని అనిపిస్తుంది. రాజవంశాల పద్ధతిలో తెలంగాణ సాహిత్యాన్ని విభజించడం జరిగింది. ప్రక్రియాపరంగా విభజించడానికి అవకాశం ఉన్నదా అనే విషయం ఆలోచించి ఒక సమగ్రమైనటు తెలంగాణ సాహిత్య చరిత్ర నిర్మాణం జరగవలసి ఉంది. ఇదంతా ఒకరి చేతుల మీద అవుతుందో కాదో, కొన్ని సంస్థలు సిద్ధపడితే బాగుంటుందని అనుకుంటున్నాను.

**తెలంగాణ ప్రభుత్వ కాళోజీ పురస్కారంతో పాటు ఇంకా మిమ్మల్ని వరించిన ముఖ్యమైన అవార్డుల గురించి తెలియజేస్తారా సార్?**

నాకు జీవితంలో సంతృప్తినిచ్చిన అవార్డులు కొన్ని వచ్చాయి. ఎప్పుడు నేను వాటి గురించి ఆలోచించలేదు. నా ఆలోచనా ధోరణి కూడా అది కాదు. కేరిరిస్టుగా, లేదా ఒకే ప్రక్రియను పట్టుకొని, ఒక రంగంలోనే విస్తృతంగా కృషి చేయలేదు. వివిధ రంగాలలో నా అభిరుచులకు అనుగుణంగా పని చేస్తూ పోయాను. కనుక నాకు వాటి పట్ల ఎప్పుడూ దృష్టి లేదు. అవన్నీ నాకు అనుకోకుండా వచ్చినయే. అర్హత ఉందో లేదో కానీ వచ్చినాయి. వాటిలో కొన్ని సందర్భాలు నాకు ఎక్కువగా ఆనందం కలిగించాయి. నా దీపఖడ్గం అనే కవితా సంపుటికి ప్రక్రియ పరంగా ఇచ్చే అవార్డులలో తెలుగు విశ్వవిద్యాలయం ఇచ్చిన అవార్డు నాకు తృప్తినిచ్చింది. అదే పుస్తకానికి కరీంనగర్ సాహితీ గౌతమి వాళ్ళు ఇచ్చిన అవార్డు సినారె గారి చేతుల మీదుగా అందుకోవడం ఆనందం కలిగించింది. సి. నారాయణ రెడ్డి గారు చనిపోయిన తర్వాత తెలంగాణ సారస్వత పరిషత్ వారు ఆయన పేరుమీద ఇచ్చిన మొదటి అవార్డు నాకు రావడం గౌరవంగా అనిపించింది. తెలంగాణ ప్రభుత్వం అందించిన కాళోజీ అవార్డు నేను ఊహించలేదు. ఆలోచించలేదు. ఓ సాయంత్రం ఒక మిత్రుడు ఫోన్ చేసి కంగ్రాచ్యులేషన్స్ చెప్పాడు. "ఏమిటయ్యా?" అని అన్నాను. "టీవీలో స్క్రోలింగ్ వస్తుంది చూడలేదా! మీకు కాళోజీ అవార్డు వచ్చింది" అన్నారు. ఇది సంగతి. దాశరథి కాళోజీ పేర్లమీద ఇస్తున్న తెలంగాణ ప్రభుత్వ అవార్డులు వారి పంథాలో కృషి చేసిన వారికే కాకుండా, తెలంగాణలో గుర్తించదగిన కృషిచేసిన వారికి ఇస్తున్నారని గతంలో అవార్డు వచ్చిన కవులను, రచయితలను గమనిస్తే తెలుస్తుంది. కాబట్టి నన్ను ఆ విధంగా గుర్తించారని అనుకుంటున్నాను. రాష్ట్ర ప్రభుత్వ అవార్డు, కేసీఆర్ గారి నిర్ణయం ప్రకారం జరగడం రాష్ట్రస్థాయి అవార్డు రావడం ఆనందంగా ఉంది. ఇంకో మాట చెప్పుకోవలసింది ఏమిటంటే నాకన్నా వయసులో పెద్ద వాళ్ళు, నాకంటే ఎక్కువగా కృషి చేసిన వాళ్లు, సాహిత్య రంగంలో పని చేసిన వాళ్లు తెలంగాణ సాహిత్యం కోసం, సంస్కృతి కోసం పని చేసిన వాళ్లు కనీసం నా దృష్టిలోనే ఒక డజను మంది ఉన్నారు. కాళోజీ అవార్డు పొందడానికి అర్హత కలిగిన వాళ్ళు. ఇంతమంది ఉండగా నాకు రావడం ఆశ్చర్యం, ఆనందం కలిగించింది.

**ఉద్యమకాలంలో మీ వ్యాసం చదివి కెసిఆర్ గారు మీతో మాట్లాడారని విన్నాను. ఆ సందర్భం చెబుతారా సార్ ?**

2013 సెప్టెంబర్ ప్రాంతంలో ఒక వ్యాసం రాశాను. "విడిపోయి కలిసుందాం" అనే శీర్షికతో. అది నమస్తే తెలంగాణ పత్రికలో అచ్చయింది. ఆ వ్యాసం చదివి ఫోన్ చేశారు కేసీఆర్ గారు. చాలా బాగా రాశారు అని మెచ్చు కున్నారు. ఎక్కడ ఏమిటి అని నా వివరాలు అడిగి తెలుసుకున్నారు. మన నల్గొండ వారే అని మెచ్చుకున్నారు. మొదట నిరంజన్ రెడ్డి గారు ఫోన్ చేసి సార్ మాట్లాడుతారని ఇచ్చారు. అది ఆ రోజుల్లో ఆనందం కలిగించిన విషయం. తర్వాత ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ప్రగతి భవన్ లో సన్నాహక సమావేశానికి వెళ్ళినప్పుడు కేసీఆర్ గారిని కలుసుకునే అవకాశం కలిగింది. అప్పుడు కూడా ఆదరంగా మాట్లాడారు. వారి మాట తీరు మీకు తెలుసు కదా చాలా ఆత్మీయంగా ఉంటుంది.

తెలంగాణ జీవితంలోనే ఆత్మీయత పరవళ్ళు త్రొక్కుతుంది. మీ ఆత్మీయతకూ వేల వేల శనార్తులు.

**తంగేడు పక్షాన శుభాకాంక్షలు...**

కథ

# పిడుగు

**తన తప్పుకు తానే బలైన పటేల్...**



డా॥ ఎం. దేవేంద్ర
9490682457

ఆకాశంలోని చీకటి కొద్దికొద్దిగా తొలిగిపోతూ వెలుతురు పరుచుకుంటుంది. గాలి రివ్వున వీస్తుంది. పక్షుల కిలకిలరావాలు ఉషోదయానికి నాంది గీతాలు పలుకుతున్నాయి. నెమళ్ళు పరవశించి నాట్యం చేస్తున్నాయి. పొద్దు పొడవక ముందే తండా నిద్రలేచింది. కరీంనగర్ జిల్లాలో మానేరువాగు పక్కన శివాజినగర్ తండా. తండాకు మూడు వైపుల అరణ్య ప్రాంతం విస్తరించి ఉంది. అరణ్యంలో జనజీవనం కుప్పపోసినట్లు కొన్ని గుడెసెలు, రెండు మూడు డాబా ఇండ్లు ఉన్నాయి. తండాకు కొన్ని మైళ్ళదూరంలో నాలుగైదు గ్రామాలు కొన్ని శతాబ్దాల జీవనానికి ఆనవాళ్ళుగా ఉన్నాయి. సూరీడు తాటివనం నుండి తొంగిచూస్తుండు. కొంతమంది పిల్లలు మేకలమందను తోలుకుని నెత్తిమీద గంపనెత్తుకొని పిల్లబాట పట్టింద్రు. మట్టిరోడ్డుకు రెండుదిక్కుల గుడిసెలు, వేపచెట్లు, మామిడిచెట్లున్నాయి. తండాకుపెద్ద భీమా నాయక్. తండా ప్రజలకు సొంతపొలాలు లేవు. వారుంటున్న స్థలాలకు మాత్రం ప్రభుత్వం పట్టాలిచ్చింది. సంచారజీవనం నుండి దూరమౌతు కాలపరిణామంలో స్థిరనివాసాలు ఏర్పరుచుకున్నరు. అయినా వీళ్ళెక్కువగా పశుసంపద మీద, పాడివ్యాపారంపై, వ్యవసాయ కూలీపనులపై ఆధారపడి జీవిస్తుంటరు.

రోడ్డుపక్కనే మామిడి చెట్టు నానుకొని గుడిసె, పశువులకొట్టం ఉన్నాయి. ఇంటి చుట్టు ముండ్ల కంచ ఉంది. మేఘి పొద్దున్నే గుడిసెముంగట కట్టెల పొయ్యిమీద జొన్న రొట్టెలు జేస్తుంది. అత్త పుత్లీబాయి రోట్లో ఉల్లికారం నూరుతుంది. భూక్యా బర్రెపెండ తీసి పాకలున్న బర్రెలకు, ఎద్దులకు కుడ్డిపెడుతున్నడు. లచ్చునాయక్ మనుమడిని ఎత్తుకొని గంపకిందున్న కోళ్ళను విడిచి పెట్టిండు. తండాలో జీవనకావ్యం లిఖించినట్లుగా పొద్దున్నంత అలికిడి. గంటసేపు గడిస్తే తండా మొత్తం ఖాళీ అవుతుంది. చిన్నపిల్లలు, ముసలి వాళ్ళు తప్ప మిగిలిన వాళ్లందరు శ్రమైక జీవన సౌందర్యంలో మునిగితేలుతుంటారు.

మేఘి, భూక్యా, గోరిబాయి, లచ్చునాయక్, సేవాలాల్, కస్లీబాయి, రాజారాంలు కలిసి ఆరెపల్లె బాట పట్టింద్రు. రెండుమూడేండ్ల సంది కాలం మంచి గయితుంది. సంవత్సరానికి రెండు వరి పంటలు పండుతున్నాయి. కాలం మంచిగయితే కూలీలకు సంవత్సరమంతా పనిదొరుకుతుంది. పిల్లబాటకు రెండువైపుల పచ్చనిచెట్లు. ఎండకొద్దిగా తీక్షణరూపం దాల్చుతుంది. రోడ్డుమీద నడుస్తున్న గుంపులో మేఘి అందగత్తె. మేఘి నడుస్తుంటే ప్రకృతికాంత కదులుతున్నట్లున్నది. భూక్యా మేఘిని ఏరికోరి పెండ్లి చేసుకున్నడు. భూక్యా కూడా అందంగా ఉంటడు. వారిద్దరు చూడ ముచ్చటగా ఉంటరు. ప్రేమలో చిలకాగోరింకలెక్క ఉంటరు. మేఘి భూక్యాను ఎంతో ప్రేమగా చూసుకుంటది. వారిద్దరిది పవిత్రమైన దాంపత్యం.

ఆరెపల్లి ఊరు లోతట్టు ప్రాంతంలో ఉండటం వల్ల నీటివసతి బాగా ఉంటుంది. మానేరు కాలువ పారకం వల్ల వరిపంట బాగా పండుతుంది. చుక్కపొద్దు పొడవక ముందే కిష్టయ్య పటేల్ పొలంబాట పట్టిండు. పదోతరగతి చదువు పూర్తయిన తర్వాత తండ్రివారసత్వంగా పొలంపనిలో నిమగ్నమైండు. కిష్టయ్య పటేల్ తమ్ముడు డిగ్రీ చదివి ఉద్యోగం చేస్తుండు. గవర్నమెంట్ ఉద్యోగం కావడంతో అనుకున్నప్పుడు సెలవు పెట్టుకుంటడు. నాట్ల కాలం కావడంతో అన్నకు సాయంగా ట్రాక్టరు దున్నుతుండు. అన్నదమ్ములిద్దరి పొత్తుల ఇరవై ఎకరాల పొలం, రెండెకరాల చెలక ఉంది. పొద్దటి పూట కరెంటు పోదు. కిష్టయ్య పటేల్ మోటరు స్టార్టుచేసి మడులను నీటితో నింపిండు. సముద్రం ఒడ్డున ఉప్పునీటి మడులను తలపించేవిధంగా కనుచూపు మేరలో అన్ని నాటేయడానికి సిద్ధంగా ఉన్న

మడులే. అక్కడక్కడ పచ్చులను పొదిగినట్టు నారుమడులు కనిపిస్తున్నయి. నాట్ల కాలం వచ్చిందంటే ఊరివాళ్ళకు క్షణం తీరిక ఉండదు.

కిష్టయ్య పటేల్ పంపు దగ్గరికెళ్ళి స్నానం జేసిండు. సూర్యుడి కిరణాలు నులివెచ్చగా ఒంటిని తాకుతుంటే బాయి గచ్చుమీద కూర్చున్నడు. తమ్ముడిని పిలిచి ఇంటి నుండి తెచ్చుకున్న సద్దిని ఇద్దరు కలిసి తిన్నరు. ఇంతట్లకే కూలీ వాళ్ళు రానేవచ్చింర్రు. శ్రీను పటేల్ ఇంటిదారి పట్టిండు. కిష్టయ్య పటేల్ బాయికట్టమీద ఉన్న గుడిసెలో నుంచి బుక్కు తెచ్చి ఎవరొచ్చింది రాసుకున్నడు.

"రంగవ్వ"

"పచ్చానయ్య"

"ఎల్లం"

"వచ్చిన పటేల్"

"భూక్యానాయక్"

"వచ్చిన దొర"

" మేఘి"

వచ్చినయ్య

మొత్తం పదిహేను మందిదాక వచ్చింర్రు.

"మీరడిగినంత కూలీ ఇస్తగని మీ పొలమనుకొని పనిజెయ్యాలె. కిష్టయ్య పటేల్.

"సరేనయ్య"

అనుకుంటు కూలీలందరు పొలందిక్కు నడిసింర్రు. పొలానికి ఉత్తర దిక్కున పెద్దమామిడి చెట్టు ఉంది. తెచ్చుకున్న సద్దిగంపలు చెట్టు నీడలో పెట్టి మోకాళ్ళదాక గోసులు పోసుకున్నరు. యుద్ధానికి పోతున్న సైనికుల్లాగా నీటిమడుల్లోకి దిగింర్రు. ఇద్దరెల్లి నారుమడి నుండి వరిమొక్కల కుప్పలను తెచ్చి అక్కడక్కడ పెడుతున్నరు. ఎవరి జాగలవాళ్ళు మునుంపట్టింర్రు. పక్కమడిలో బర్రుకొడుతున్న కిష్టయ్య పటేల్ దూరంనుంచి నాటేస్తున్న మేఘి వంక ఓరగా చూసిండు. మేఘిని చూసినప్పుడల్లా కిష్టయ్య పటేల్‌కు మనసున దాగిన కలల ప్రపంచం మేల్కొంటుంది. మూడేండ్ల సంది మేఘిని చూస్తున్నడు. రోజురోజుకు అందం పెరుగుతుందే కాని తగ్గడం లేదు. నిజానికి లంబడోళ్ళు అందంగానే ఉంటరు గాని, మేఘి అందం వర్ణణాతీతమైంది. ఆలోచనల్లోంచి బయటికి మడిదాటి గుడిసెవైపు వెళ్లింర్రు. పొద్దుననగా వచ్చిన కిష్టయ్యపటేల్‌కు అలుపువచ్చింది కాని వింత ఆలోచనలతో నిద్రరావడం లేదు. మంచంమీద ఒరిగిండు. ఏదో చింత మనసును వేధిస్తుంది. కొత్త ఆశ మనసును పదేపదే తట్టిలేపుతుంది. ఈ రెండింటి మధ్య మనసు నలిగిపోతుంది. భార్యగుర్తొచ్చింది. సినిమాల్లో చూపించే విధంగా ప్రేమను వ్యక్తపరచలేదని అనిపించింది. పాత కాలంనాటి మనిషిలాగా ప్రేమను గుండెల్లో దాచు కుంటుందే తప్ప బయటకు ముభావంగా ఉంటుంది. రంగు, రూపం సామాన్యంగానే ఉంటాయి. కొడుకు గుర్తొచ్చాడు. ఎనిమిదేండ్లయిన మంచంమీద నుంచి లేవలేక, వెన్నెముక నిలబడలేక జీవచ్ఛవంల ఉన్న కొడుకు గుర్తొచ్చిండు. ఒక్కసారిగా ఏడుపు తన్నుకొచ్చింది. ఎందుకింత శాపం అని వేదన చెందాడు. కొంత తేరుకొని మళ్ళీ ఆలోచనల్లో పడిపోయాడు. మెరుపులాంటి ఉపాయం తట్టింది. మేఘితో కొడుకును కంటే ఎలా ఉంటది. ఒక్కసారి అడిగిచూస్తే ఎలా ఉంటదని ఆలోచిస్తుండగానే ఏదో అలికిడి అయ్యింది. గుడిసె ముందు ఎదురుగా మేఘి. కలలరాణి ప్రత్యక్షమైనట్టుగా అనిపించింది.

"అయ్యా! నా కొడుక్కు జ్వరం



వచ్చిందట. ఇప్పుడే తండానుండి ఒక పిలగాడొచ్చి చెప్పిండు. నా వంతునాటు భూక్యా, ఇంకా మా మామ ఏస్తరు'' మేఘీ.

"అవునా'' కిష్టయ్య పటేల్

"ఏమనుకోకండ్రి పటేలా నేను వెళ్తా'' మేఘీ

"సరే వెళ్తుదువు గాని మేఘీ. నిన్నొకటి అడుగుతా తప్పుగా అర్థంచేసుకోకు. బాగా ఆలోచించుకో'' కిష్టయ్య పటేల్

"ఏందయ్యా!''

"నాకున్న ఒక్కగానొక్క కొడుకు లేవలేడు, మాట్లాడలేడు. ఎనిమిదేండ్లు వచ్చినా వెన్నెముక నిలబడదు. అందుకని నువ్వు నాకొక సాయం చెయ్యాలె''

"ఎట్ల సారు''

"నువ్వు నా కోరికమన్నించి నాతో కొడుకును గని ఇయ్యాలే. ఇది అత్యాశనే కావచ్చు. అధర్మమే కావచ్చు. కాని నువ్వు ఈ పనికి ఒప్పుకుంటే అరెకురం పొలం భూక్యాకు రాసిస్త. కొడుకును తీసుకున్నందుకని చెప్త. నీ సమ్మతం తెలిపితే తరువాతంతా నేను చూసుకుంటా'' కిష్టయ్య పటేల్.

వణుకుతున్న స్వరంతో మేఘి "అదెట్లా కుదురుతుందయ్యా! ఈ మేను భూక్యాకే అంకితం. కావాలంటే నాకు పుట్టబోయే బిడ్డను మీకు అమ్ముతా. మీతో కూడి కొడుకును కనివ్వలేను. నా ఆత్మ సాక్షి ఒప్పుకోదయ్య''

"ఆలోచించుకో. టైమ్ తీసుకొని చెప్పు మేఘి. కిష్టయ్య పటేల్.

మేఘి సమాధానం చెప్పకుండానే పెద్దపెద్ద అడుగులు వేసుకుంటు అక్కడనుండి వెళ్ళిపోయింది. ఎంతో బరువైన గుండెతో పల్లెబాట పట్టింది. ఒక్కసారి సీతమ్మ తల్లి గుర్తొచ్చింది. కండ్లనిండ నీళ్ళు నిండి కిందికి జారుతున్నట్లు మేఘి అయోమయ స్థితిలో గుడెసె చేరుకుంది.

అత్త పుత్లీబాయి అప్పటికే కొడుక్కు జరం మందు పోసినట్టుంది. మేఘిని చూడగానే కొడుకు వెక్కివెక్కి ఏడవడం మొదలుపెట్టాడు. కొద్దిగా ఒళ్ళు కాలుతుంది. మేఘి కొడుకును గుండెకు హత్తుకుంది. కొడుకును పక్కలవేసుకుని పాలిస్తూ ఆలోచనలో పడ్డది. ఏదో తెలియని దిగులు, భయం మేఘి మనసును మబ్బులెక్క కమ్మేస్తున్నయి. భూక్యా గుర్తొంచిండ్రు. అతడి మనసును గెలుచుకున్న ప్రేమసుందరి మేఘి. ఆ ప్రేమను అపవిత్రం చేయడం ఎట్ల కుదురుతుంది. తను కాదంటే భర్తకు, మామకు పనియ్యకపోతే, తనమీద నిందలు మోపితే ఎట్లానో అన్న సంఘర్షణతో ఆ రోజు గడిచింది. తెల్లవారి ఒకటే వర్షం. ఆ వర్షంలో కూడా భూక్యా, మామ, అత్త కూలీపనికి పోయిండ్రు. కొడుకు వంకతో ఈ రోజు గండం గట్టెక్కిందని సంతోష పడింది మేఘి. పుత్లీబాయికి కాళ్ళ నొప్పులు. ఒకరోజు కూలీకిపోతే నాలుగురోజులు ఇంట్లోనే ఉంటది. మేఘికి కొడుకు పుట్టాక అత్త పుత్లీబాయికి మనుమడి ఆలనపాలనతో కాలం గడుస్తుంది. ఆ తర్వాత వారంరోజులపాటు ఏదో వంకపెట్టుకుని కూలీకి పోలేదు. వారం తర్వాత కూలీకి పోకతప్పలేదు. తయారయింది గాని మేఘికి మనసు మనసులో లేదు. మొదటిసారి మేఘికి ఎక్కడికైనా సుదూరంగా పారిపోవాలనిపించింది. సంచార జీవితంలో ఉన్న సౌందర్యం అర్థమైంది. సీతమ్మకే తప్పలేదు కష్టాలు, మనమెంత! అనుకొని పొలం బాటపట్టింది మేఘి.

స్థిరనివాసాలు ఏర్పరచుకున్న బంజారాలు ఆహార్యం విషయంలో నాగరికులను అనుసరిస్తున్నారు. మేఘి సాదాసీదాగా చీరకట్టుకుంది. మెడలో వెండినగలు ఏమి వేసుకోలేదు. కూలీల గుంపులో ఉన్న మేఘి గంధర్వభామిని లెక్క ఉంది. బంగారు వర్ణం, చూడచక్కని మోహం. పొలం జేరుకుని సాటి కూలీలతో కలిసి నాటేస్తుంది గాని ఏదో తెలియని బాధ మేఘిని వెంటాడుతుంది. కిష్టయ్య పటేల్ ఏదో పనిమీద భూక్యా నాటేస్తున్న వైపు వచ్చిండు.

భూక్యాను పిలిచిండు. పక్కఊరిలో అంగడికి పోదామని చెప్పిండు. నారిమడి దిక్కుపోయిన మేఘి వెంట నడిచి అంగడి నుంచి తొందరగా వస్తానని నీతో మాట్లాడేదుందని చెప్పి పెట్టిండు.

మధ్యాహ్నం అయ్యేసరికి ఎండతగ్గి మబ్బులు కమ్ముతున్నయి. కిష్టయ్య పటేల్ లేడని తెలుసుకున్న కూలీలు మూడింటి దాక నాటేసి వర్షం వచ్చేటట్టు ఉందని వంకబెట్టుకుని ఇంటిబాట పట్టిండ్రు. మేఘి భూక్యాకోసం ఎదురు చూస్తానని చెప్పింది. మేఘి ఒంటరిగా చెట్టుకింద కూర్చుంది. తనతో పాటు నల్లకుక్క కూడా కాపల ఉంది. మేఘికి భయభయంగా ఉంది. ఏదైనా కనికట్టు విద్య తెలిస్తే అక్కడనుండి హఠాత్తుగా మాయమైతే బాగుండునని పరిపరి విధాలుగా మనసు తొక్కులాడు తుంది. తన అందం మీద తనకే అసహ్యం వేసింది. పక్కన చెల్కనుండి జంతువుల అరుపులు వినిపిస్తున్నాయి. సమ్మెటలు ఫ్రీంకరిస్తున్నయి.

కిష్టయ్యపటేల్ వచ్చి మోటరు వేసి కాళ్ళు చేతులు కడుక్కున్నడు. మడులవైపు చూసి కూలీలందరు వెళ్లిపోయింది గమనించాడు. దూరంలో మామిడి చెట్టుకింద మేఘి కనబడింది. రమ్మన్నట్టు సైగ చేసిండు. మేఘి గుడిసెవైపుగా నడిచింది.

వెనుక నల్ల కుక్క కూడా వస్తుంది. ఆకాశం నల్లని మబ్బులతో మేఘావృతమైంది. ఏ క్షణమైన వర్షం పడొచ్చు. ఉన్నట్టుండి సూర్యుడు పూర్తిగా మాయమైపోయిండు. విపరీతమైన గాలివీస్తుంది. మేఘిని గుడిసెలోకి రమ్మని ఆహ్వానించిండు కిష్టయ్య పటేల్.

బయటగాలి, మనసులో అలజడి, మేఘికి వణుకు మొదలైంది. నోటమాట రావడం లేదు. రా మేఘి! భూక్యాకు అంగడిలో కొంతపని చెప్పి వచ్చిన. రావడానికి సాయంత్రమయితది. మేఘికి మనసులో భూక్యా వస్తే బాగుండునని అనుకున్నది. ఈ రాక్షసుడినుండి ఎట్లా తప్పించుకోవడం అని ఆలోచనలో పడ్డది.

"రా మేఘి ఇట్లా మంచంమీద కూర్చో''

కథ

"వద్దయ్య, నేను ఇంటికి పోవాలే" మేఘి.

"నువ్వు ఒప్పుకోకపోతే భూక్యాకు నీ మీద అన్ని అబద్దాలు జెప్త" కిష్టయ్యపటేల్.

"భూక్యా నమ్మడు పటేలా! ఈ మేఘి గొంతులో ప్రాణం ఉన్నంతవరకు భూక్యానే ప్రేమిస్తది. ఇంకా ఎవరినైనా చూసుకో అయ్యా" మేఘి.

"నాకు జీవితంలో ఎంతోమంది తారసపడ్డరు మేఘి. కాని నువ్వెందుకో నా మనసుకు అలజడి రేపినవు. నిన్ను చూసినప్పుడల్లా నాలో ఏదో తెలియని కోరిక నిద్రలేస్తుంది. ఆలస్యం చెయ్యకు మేఘి".

గుడిసె బయట వాన మొదలైంది. గుడిసె లోపల మేఘి గుండెలో అలజడి మొదలైంది. బయట వాన జడివానగా మారింది. లోపల మేఘికి కోపం పెరుగుతుంది. అసహనం ఆవహిస్తుంది. ప్రకృతికాంత విలపిస్తున్నట్టుగా కండ్లల్లో నీళ్ళు నిండాయి. కిష్టయ్య పటేల్ శరీరాన్ని తాకినప్పుడల్లా ఉగ్రరూపమేదో మనసు తలుపుతడుతుంది. జోరువాన పడుతుంది. గుడిసె పైకప్పు ఎగిరిపోత దేమోనన్న అనుమానం కలుగుతుంది. ఒకటే గాలిదుమారం. గుడెసెలో ఒక మూలన కూర్చున్న నల్లకుక్క ఉన్నట్టుండి అరవడం మొదలు పెట్టింది. కిష్టయ్య పటేల్ మేఘి పెదవులపై ముద్దుపెట్టిండు. ఆ చలికి, వానకు మేఘిని గట్టిగా హత్తుకున్నడు. బయట చినుకుల చప్పుడు గట్టిగా వినిపిస్తుంది. మేఘి కిష్టయ్య పటేల్‌ను పక్కకు నెట్టేసి కుక్కకు దగ్గరగా జరిగింది. ఉరుముల చప్పుడు, మెరుపు మెరిసినప్పుడల్లా కొద్దిగా కాంతి వెదజల్లుతుంది. కిష్టయ్య పటేల్ మొఖంలో చంచలత్వం, మేఘి కల్లల్లో కోపం లీలగా తారసపడుతున్నాయి. మేఘాలు ఉరుముల రూపంలో గాండ్రిస్తున్నయి. ఉన్నట్టుండి ఎక్కడో పిడుగుపడ్డ శబ్దం గుడిసెలో మాత్రం మౌనం రాజ్యమేలుతుంది.

వరుసగా పిడుగుల శబ్దాలు వారి చెవులను భయపెడుతున్నయి. ఎక్కడో పిడుగుపడ్డ శబ్దం బయటంతా హోరున వర్షం. మరుక్షణంలో పక్కనే పిడుగుపడ్డ శబ్దం. కుక్క అరవడం మొదలుపెట్టింది. మేఘి కళ్లు తెరిచి చూసేసరికి నమ్మలేని దృశ్యం. కిష్టయ్యపటేల్ మీదనే పిడుగు పడ్డది. పడ్డచోట శరీరం నల్లగా మారిపోయింది. మేఘి ఒక్కసారి నిర్ఘాంతపోయింది. ఏడుపు,భయం ఆమెను చుట్టుముట్టినయి. ఇంత వరకు సజీవంగా ఉన్న కిష్టయ్యపటేల్ ఇప్పుడు ప్రాణాలతో లేడు. కుక్క ఇంకా అరుస్తూనే ఉంది. ఇంకా వానపడతనే ఉంది. ఉన్నట్టుంది మేఘికి కిష్టయ్యపటేల్ మీద జాలికలిగింది.

ఇంకా అక్కడ ఒక్కక్షణం కూడా ఉండాలని అనిపించలేదు. ఆ జడివానలోనే తండా బాట పట్టింది. ఆమె వెనుక నల్లకుక్క నడిచివెళ్తుంది. అంతటి వర్షంలో కూడా మేఘికి భయం వెయ్యలేదు. ప్రకృతి కనికరించింది. ఏదో గండం నుండి బయటపడ్డ ధైర్యం ఆమెను నడిపించింది.

కవిత

# కోటి విద్యలు కూటి కొరకే

గుండం మోహన్ రెడ్డి, 9440161636

బహురూపుల వేశమైన
సాధనా సూరుల ఆటలయిన
పిట్టల దొర అగచాట్లైనా
సింధూ భాగవతమయిన
చిరుతల రామాయణమైనా
చిన్న పెద్ద ఉద్యోగాలయినా
చిరు వ్యాపారమైనా
పెద్ద కంపినైనా
పొట్ట తిప్పలకు
జేరిపోతులాట ఆడించాల్సిందే
రాజైన మంత్రైనా
ఉదర పోషణ చేయాల్సిందేకదా
కోటి విద్యలు కూటి కొరకే
గంజైనా గట్కైనా
చికన్ మటన్ వెజిటబుల్
బర్యాని అయినా
కాలె కడుపుకు మండే గంజైనా
మంచినీళ్ళైన మజ్జిగైనా
ఆకలిని ఆపడానికే కదా
అడుక్క తినుడు వద్దు
స్వీయ సంపాదనే ముద్దు
ఉదర పోషణకై
సక్రమ సంపాదన
దేశ హితమయితే
కల్తి దందా మోసం
హింస బిక్షాటన
అక్రమ మార్గాల ద్వార
సంపాదన సమాజ
పతనానికి దారి తీస్తాయి
తిండి లేకున్నా కడుపు మంటే
తిండెక్కువైనా కడుపుమంటే
పరోపకారముంటే
ఇద్దరి మంటలు తగ్గుతాయి
మన పొట్ట నింపు కోవడానికై
ఇతరల పొట్ట కొట్టరాదు
లోభిగా మారొద్దు
లోక హితాన్ని మరువొద్దు
మనుషులుగానే బతుకదాం
మానవత్వాన్ని చాటుదాం
పిల్లికి బిచ్చమేయడు
ఎంగిలి చేతితో కాకిని కొట్టడనే
సామేతలను తిరగేసి రాద్దాం
రోజు తినే బువ్వలో బుక్కెడు
దానం చేద్దాం
పరోపకారం ఇదమ్ శరీరం
అనే ఆర్యోక్తిని నిజం చేద్దాం
శ్రమను నమ్ముకుందాం
శ్రమశక్తిని గౌరవిద్దాం
పొట్టను నింపుకుందాం
సర్వేజనాం సుఃఖినోభవంతుః
లోకం సమస్తం
సుఖినోః భవంతుః

వ్యాసం

# ఆచార్యదేవోభవ శతకము

శతకాలలో గురువులను ఆవిష్కరించిన వ్యాసం...

కస్తూరి వేణుగోపాల్
93947 58042

'గురుస్సాక్షాత్ పరబ్రహ్మ' అన్న వాక్యం ప్రాచీనోక్తి. ఇది సార్వకాలీన సత్యం. తల్లిదండ్రులు జన్మనిచ్చినా మనిషికి జ్ఞానజన్మనిచ్చి, బ్రతుకుబాట చూపేది మాత్రం గురువే.

మనదేశంలో గురువును దైవంగా భావిస్తారు. భక్తి శ్రద్ధలతో సేవిస్తారు కూడా. ఎందుకంటే అజ్ఞానాంధకారం అలముకున్న విద్యార్థులు మేధస్సులో విజ్ఞానమనే దివ్యజ్యోతిని వెల్గించేది గురువే కనుక. విద్యార్థులకు నైతిక విలువలు నేర్పి, సంస్కారవంతులుగా తీర్చిదిద్దడంలో గురువుపాత్ర ఎనలేనిది.

అటువంటి గురువు పరువు నేటి సమాజంలో రోజురోజుకు పాతాళానికి పోవడం మనం గమనిస్తూనే ఉన్నాము. పిల్లలు సత్ప్రవర్తనకు దూరమై, సంస్కారహీనులై గురువుకు కనీస మర్యాద నివ్వకుండా తయారవుతున్నారు. ఈనాడు విద్యావ్యవస్థ సామాజిక, నైతిక విలువలు కోల్పోతూ నవ్వులపాలు అవుతుంది. ఇందుకు సమాజంలోని కొందరు ఉపాధ్యాయులనే దోషులుగా చిత్రిస్తున్నారు. కాని విద్యావ్యవస్థలోని లోపాలకు కారణం తల్లిదండ్రులు, స్నేహితులు, పరిసరాలు, ఉమ్మడి కుటుంబాలు లేకపోవడం, మీడియా, ఇలా చెప్పుకుంటూ పోతే చాలా చాలా కారణాలున్నాయి. అయితే మన సమాజంలో అధ్యాపక వృత్తికోసం, విద్యార్థుల భవిష్యత్తు కోసం తమ జీవితాలనే అంకితం చేసిన ఎంతోమంది ఆదర్శ ఉపాధ్యాయులున్నారు. అలాగే అక్కడక్కడ చీడపురుగులైన గురువులున్నారు.

సమాజంలోని ఇతరుల దోషాలను వేలెత్తి చూపడానికంటే ముందే తాను ఉపాధ్యాయునిగా జీవిస్తున్న గురు కులంలోని గురువు పరువు ప్రతిష్ఠలు నిలుపడానికి, ఉడుతాభక్తిగా తానీ శతకాన్ని రచించానని శంకరయ్య గారు వివరించారు.

ఆచార్యదేవోభవ శతక రచయిత జనపాల శంకరయ్యగారు ఉమ్మడి కరీంనగర్ (ప్రస్తుతం సిరిసిల్లా) జిల్లాలోని ముస్తాబాద్ మండలం ఆవునూరు గ్రామానికి చెందినవారు, వీరి తెలుగు ఉపాధ్యాయులు. "తెలుగు లంబాడీల గేయ సాహిత్యం" అనే అంశం మీద పరిశోధన చేసి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టా పొందారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ వంటి పలు అవార్డులను అందుకొని ఉపాధ్యాయవృత్తికే వన్నె తెచ్చారు.

పాలగోకు(కవితలు), వ్యాససంపుటి, బంగారు బాట(పాటలు) వంటి ఎన్నో రచనలు చేశారు. వీరు రచించిన శతకమే "ఆచార్యదేవోభవ శతకము". "పసిడి బాట సుజన పాల మాట" మకుటం గల ఈ శతకంలో 116 ఆటవెలదులున్నాయి. ఈ శతకాన్ని తమ గురువైన ఆచి వేంకటాచార్యులు గారికి అంకితమిచ్చారు. ఈ శతకంలో కనుమరుగవుతున్న గురువుల గౌరవాన్ని నిలబెడుతూనే, సమాజంలో ఉపాధ్యాయుల గురుతర బాధ్యతను గుర్తుచేస్తూ, బాధ్యతారాహిత్యంగా పనిచేస్తున్న వారికి చురకలను కూడా అంటించారు.

"పక్షపాత బుద్ధి పసివారిపై జూపు
పాడు పనుల వల్ల పాటి తగ్గు
పరువు తరుగు గురువు పదవికి
సోదరా!"

పిల్లలు నమస్కారం పెట్టినంతనే చాలు వారి తప్పులను మన్నించే వెన్నెలాంటి మనసున్నవారు గురువులని గురువు మనసుకు ఒక్కమాటలో నిర్వచనమిచ్చారు.

"కులమతాల నెంచి కుత్రలన్ బెంచకు
చిన్ని ఎదలు నొచ్చి చీలిపోయి
చెదలు తొలచు రీతి చెదరిపోవును
గదా!"

నేటి సమాజంలో కులం, మతం అనేది ఎంతగా వేళ్ళూనుకుపోయిందో అందరికీ విదితమే. అటువంటి కుల మతాల



కుట్రలను విద్యార్థుల హృదయంలో నాటకూడదని హెచ్చరిస్తున్నారు.

"రత్న మోలె గురువు రాణించు వేళలో
దిష్టి కళ్ళ చూపు దిరుగు చుండు
కాట్ల కుక్కలన్ని కరిని వెంటాడవా!"

కొందరు గురువులు విద్యార్థుల చదువే తమ జీవితాశయంగా పనిచేస్తుంటారు. కాని అటువంటి వారిని ఓర్వలేని వారు కూడా ప్రక్కనే ఉంటారు. "కుక్కలెన్ని మొరిగినా ఏనుగు తిరిగి చూడదు." అనే హితోక్తి లాగ గురువులు అటువంటివారిని పట్టించుకోరాదని తెలియజేశారు.

"చిన్నపిల్ల లెదల చిచ్చును రేపుచు
తోడి ఒజ్జ పైకి తోయువారు
గురులు కారు వారు గుంట నక్కలు సుమీ!"

చిన్నపిల్లల మనసులను కూడా చెడగొట్టి, తోటి ఉపాధ్యాయుల మీద నిందలు వేయించే ఉపాధ్యాయులు కూడా నేడు కనిపించకమానరు. అటువంటి వారికి ఈ పద్యం ఒక చెంపపెట్టు.

"బడికి డుమ్మకొట్టి బాధ్యత మరచెడి
వారు కొందరుండ వారి వల్ల
గురుకులంబు నెల్ల గొప్పను గోల్పోవు"

బడులకు డుమ్మా కొట్టిన గురువులకు విలువలు ఉండవనీ, అటువంటి వారిని ఈ సమాజం చులకనగా చూస్తుందనే సత్యాన్ని గుర్తుచేశారు.

"తిట్టికొట్ట వద్దు తిప్పలు బెట్టొద్దు
మందలింపు మంచి మాటచాలు
తీగ లేతదైన తెగు వంక లాగితే"

"బడితె పూజ వల్ల బాలురు చెడుదురు
భక్తి తోడి బోధ బాగు పరుచు
మనసు నెరిగి చెప్పు మార్గంబు జూడరా!"

ఈ పద్యాలలో పిల్లలను హింసించరాదనీ, వారి మనసెరిగి మంచితనాన్ని నేర్పాలనీ చక్కని సందేశమిచ్చారు.

"మద్యపానమెంతో మర్యాద చెడగొట్టు
తాగిబడికి బోవ తగదు ధరణి
సంఘమందు పరువు సమసి పోతుందిరా!"

నేటి విద్యావ్యవస్థలో దురలవాట్లకు లోనై, తాగుడుకు బానిసలైన ఉపాధ్యాయులు కూడా ఎక్కడో ఒకచోట కనిపిస్తారు. అటువంటి వారివలన మొత్తం ఉపాధ్యాయలోకానికి తీరని మచ్చ ఏర్పడుతుందనీ వాపోతున్నారు. తమ పద్ధతి మార్చుకోవాలనీ హితాన్ని అందించారు.

"గురుడు రాముడేను గురుడు ఏసు ప్రభువు
గురుడు అల్ల యనియు గురుడు ధరణి
సర్వ దైవలీల సారమ్మై నొప్పురా!"

ఈ పద్యం చూస్తే గురువుకు సమాజంలో ఎంత గొప్ప స్థానం ఉందో అర్థమవుతుంది. అటువంటి ఉన్నత స్థానంలో ఉన్నప్పుడు ఉపాధ్యాయులు ఎంత గొప్ప లక్షణాలు కల్గిఉండి, సంస్కారంతో నిండి ఉండి పిల్లలకు మార్గదర్శనం చేయాల్సిన బాధ్యత ఉందో అర్థమవుతుంది.

"తల్లిదండ్రి గురువు దయగల దేవుళ్ళు"
"వారి! ఓరి మనిన వంకర బలికెడి
బజ్జెనెవడు నేడు ఒప్పుకోరు"
"పిలువబోకు కులము పేరుబెట్టి ఎపుడు"
"కోపమున్న మొజ్జ కొంచెమై పోవును"
"ఒకరిమీద ఈర్ష్య ఓటమికే దారి"
"నింద జేయ కెదుట నీతోడి గురువును"

వంటి పద్యపాదాలు ఈ శతకంలో అడుగడుగునా దర్శనమిస్తాయి. పాఠశాలకు వెళ్ళి సమయాన్ని వృథా చేసే ఉపాధ్యాయులకు ఈ శతకం మార్గనిర్దేశనం చేస్తుంది.

జనపాల శంకరయ్య గారు రచించిన ఈ "ఆచార్య దేవోభవ శతకము" ఉపాధ్యాయులకు కూడా నీతిని బోధించే వేమన, సుమతీ శతకాలవలె ఉన్నదనడం అతిశయోక్తి కాదు. ప్రతి ఉపాధ్యాయుడు ఈ శతకాన్ని చదివి స్ఫూర్తి పొందవచ్చు.

**ఈ పద్యం చూస్తే గురువుకు సమాజంలో ఎంత గొప్ప స్థానం ఉందో అర్థమవుతుంది. అటువంటి ఉన్నత స్థానంలో ఉన్నప్పుడు ఉపాధ్యాయులు ఎంత గొప్ప లక్షణాలు కల్గిఉండి, సంస్కారంతో నిండి ఉండి పిల్లలకు మార్గదర్శనం చేయాల్సిన బాధ్యత ఉందో అర్థమవుతుంది.**

# విలక్షణ రచన డాక్టర్ బాల శ్రీనివాసమూర్తి "జీవన హిందోళం"

తెలంగాణ అవధాన కవివతంసుని జీవిత స్పర్శ...



డా. బెల్లంకొండ సంపత్ కుమార్
99085 19151

తెలుగులో ఇప్పటి వరకు కొన్ని వందల జీవిత చరిత్రలు (బయోగ్రఫీ) రచనలు వచ్చాయి. పెద్ద సంఖ్యలో ఆత్మకథలూ (ఆటో బయోగ్రఫీ) వెలువడ్డాయి. అయితే జీవిత చరిత్రనూ ఆత్మకథను కలిపి చేసిన రచనలు మాత్రం బహుస్వల్పం. ఇంగ్లీషులో ఈ ప్రయోగం ఉంది. తెలుగులో ఇటీవలి కాలంలో ఈ తరహాలో వచ్చిన విలక్షణ రచన 'జీవన హిందోళం'. ఇదొక ఆత్మకథనాత్మక జీవిత చరిత్ర. అంటే ఆటో బయోగ్రఫీ కల్ బయోగ్రఫీ అన్నమాట. రచయిత డాక్టర్ గుమ్మన్నగారి బాల శ్రీనివాసమూర్తి, బాగా పరిచయమున్న విమర్శకుడు. పరిశోధకుడు చక్కటి వచన రచయిత. జీవన హిందోళం ఆయన నాన్న గారు స్వర్గీయులైన గొప్ప అవధాని, గుమ్మన్నగారి లక్ష్మీ నరసింహ శర్మ గారి జీవన అవధాన అనుభవ సంపుటి! నాన్నతో తన అనుభవాలు, జ్ఞాపకాలు, నాన్న జీవన విశేషాలతో కూడిన 'జీవన హిందోళం' బాల శ్రీనివాస మూర్తి అందించిన అక్షర చిత్రమాలిక అని అభివర్ణించడం అతిశయోక్తి కాదు.




లక్ష్మీ నరసింహ శర్మ ఉమ్మడి మెదక్ జిల్లాలోని పోతారెడ్డి పేటలో ఒక పేద సాంప్రదాయ కుటుంబంలో జన్మించారు. అవధాన ప్రతిభ అందుబాటులోకి వచ్చిన తర్వాత దాన్ని నిలబెట్టుకునేందుకు నిరంతరం శ్రమించారు. అధ్యయనాన్ని పెంపొందించుకున్నారు. విద్వన్మూర్తి అయిన అవధానిగా తెలంగాణ నలువైపులలో గుర్తింపు పొందారు. అయితే ఆయన అవధాన జ్ఞాపకాలు అమూల్యం. ఆయన వ్యక్తిత్వం ఆదర్శవంతం. ఆయన జీవిత నేపథ్యం స్ఫూర్తిదాయకం. వీటన్నింటినీ చక్కగా పరిచయం చేసిన రచన జీవన హిందోళం.

**లక్ష్మీ నరసింహ శర్మ ఉమ్మడి మెదక్ జిల్లాలోని పోతారెడ్డి పేటలో ఒక పేద సాంప్రదాయ కుటుంబంలో జన్మించారు. అవధాన ప్రతిభ అందుబాటులోకి వచ్చిన తర్వాత దాన్ని నిలబెట్టుకునేందుకు నిరంతరం శ్రమించారు. అధ్యయనాన్ని పెంపొందించుకున్నారు. విద్వన్మూర్తి అయిన అవధానిగా తెలంగాణ నలువైపులలో గుర్తింపు పొందారు. అయితే ఆయన అవధాన జ్ఞాపకాలు అమూల్యం.**

గుమ్మన్న గారి వివిధ అవధానాలలోని పలు విశేషాంశాల్ని కథనం చేశారు డాక్టర్ బాల శ్రీనివాసమూర్తి. అవధానిగా లక్ష్మీనరసింహశర్మ ప్రతిభ అసాధారణ మనిపిస్తుంది. ఒకానొక సందర్భంలో అవధానం మధ్యలో వర్షం కురిసిందట. అది జనవరి నెల కావడంతో వర్షం పడుతుందని ఎవరూ ఊహించలేదు. ఆరుబయట సభ జరుగుతుంది. మధ్యలో

పుస్తక పరిచయం

భారీ వర్షం. అప్పుడు అక్కడ ఉన్న స్థానిక ప్రముఖులు సమీపంలోని డాగ్ బంగ్లాకు అవధాన వేదికను మార్చారు. ఇట్లా అరగంట పాటు అంతరాయం ఏర్పడింది. ఇది ఏ అవధానానికైనా అగ్ని పరీక్ష వంటిదే. ఎందుకంటే అవధానం పూర్తి అయిన వెంటనే 'పూరణ' అనే ఒక అనివార్యమైన ప్రక్రియ ఉంటుం దనే సంగతి సాహిత్యాభిమానులకు తెలిసిందే . అవధానంలో నిషిద్ధాక్షరి, వర్ణన. దత్తపది, సమస్య - ఈ నాలుగు అంశాలకు అవధాని తాను చెప్పే పద్యాలను చివరనే ప్రేక్షకులకు ఒప్పగించడం! అరగంట పాటు అవధానం ఆగిపోయిన తర్వాత అవధాని 'ధారణ' చేయలేకపోవచ్చునని శ్రోతలు అనుకున్నారు. అయినా ఆనాటి అవధానంలో లక్ష్మీనరసింహశర్మ దిగ్విజయంగా ధారణ చేసి చూపించారట! ఇటువంటి ఎన్నో జ్ఞాపకాలను బాల శ్రీనివాసమూర్తి 'జీవన హిందోళం' పరిచయం చేస్తున్నది. కవిత్వ రచన పట్ల అవధాని చూపించిన నిబద్ధత ఎంత గొప్పగా ఉందో చదివితే మనసు ఆర్ద్రమౌవుతుంది. దాదాపు మరణ శయ్యపై ఉండి కూడా పద్య రచన చేసిన కవితా రుషిగా లక్ష్మీ నరసింహ శర్మ ఆ పుస్తకంలో దర్శనమిస్తారు. ఆయన రచించిన కవితా కళ్యాణి, అవధాన సరస్వతి, వాగీశ్వర స్తుతి, ఆద్య మాతృక, పద్యోద్యానాలు వేటికవే ప్రత్యేకమైనవి. ఆ కావ్యాల విలక్షణత్వాన్ని చక్కగా తెలిపారు బాల శ్రీనివాసమూర్తి.

**రెండింటికీ భిన్నంగా రాసిన మరో కవితా సంపుటి 'చూస్తుండగానే...'. ఆధునిక జీవితం లోని సంఘర్షణ, మానవ సంబంధాలు, రేపటి మనిషి, రాజు తీర్పు లాంటి అధిక్షేప కవిత్వాలు ఇందులో వున్నాయి. అనగా అనగా... అన్న కవిత ఎందరినో ఆకర్షించింది. సత్యమూర్తి ప్రత్యేకంగా ఆ కవిత మీద ఉత్తరం రాశాడు.**

అందమైన శుద్ధ వచన రచన ఒక గొప్ప ప్రతిభ, ప్రయోగం. ఇది కొంత మందికి మాత్రమే సాధ్యమైందని చెబితే దోషం కాదు. ఇట్లా సుందర వచన రచన చేస్తున్న వారిలో బాల శ్రీనివాసమూర్తి ప్రముఖులు. గతంలో (2016) 'మా ప్రసిద్ధిపేట' రచన ద్వారా ఇది రుజువయింది.

ప్రసిద్ధ సాహితీవేత్త డాక్టర్ నందిని సిధారెడ్డి గారు "జీవితమే ఒక అవధానం" శీర్షికతో చక్కని ముందుమాట రచించారు. ఈ రచనకు ముందు మాట ఒక గొప్ప అలంకారం. 'బాల శ్రీనివాస్ పాఠకుల నాడీ తెలిసిన రచయిత గనుక ఆసాంతం చదివించే గుణంతో సరళ శైలితో రచించాడు. తెరచిన తర్వాత వదిలి పెట్టకుండా పూర్తి చేసే దాకా ఆసక్తికరంగా రూపొందించాడు." అని డాక్టర్ నందిని సిద్ధారెడ్డి గారు రచయితను ప్రశంసించారు. ఆయన అభిప్రాయం సంపూర్ణ సత్యమని 'జీవన హిందోళాన్ని' చదివిన సహృదయ పాఠకులు అందరూ అంగీకరిస్తారు.

కవిత

# స్నేహప్రియం



**రోషిణి, 10వ తరగతి**

(నవంబర్ 14, బాలల దినోత్సవ సందర్భంగా...)

తీరం కనిపించదు
నావా కనిపించదు
నడిపే వాని పాట మాత్రం
నడిచే పాదాలతో గొంతు కలుపుతుంది.

ఉదయ సింధూరాలు లేవు
గోధూళి జిలుగులు లేవు
అదో ఘనీభవించిన దుఃఖ సమయం.

రెండు చేతులు చందమామని దోసిట్లో పట్టి తెచ్చాయి.
చీకటి పొద్దుల్లో వెన్నెలపూలు వికసించాయి.

స్నేహం అక్కున చేర్చుకుంది.
ఏకాంతం హాయిగా రెక్కవిప్పుకుంది.

సరదాగా సాగిపోయే రహదారిమీద
అవాంఛనీయ మలుపులు

సాదాగా నడుస్తున్న జీవితంలో
ఆనందతీరాల ఆహ్వానాలు.

చీకటి వెలుగూ
ఆ వెనుకే ఓ నక్షత్రం.

స్నేహం... భావాలకతీత బాంధవ్యం
చింతలో చిరునవ్వు దీపం.

నిన్ను నువ్వు చదువుకునేలా చేసి
నిన్ను నీలా స్వీకరించే స్నేహం
నీ సరికొత్త రూపానికి ఓ దర్పణం.

వ్యాసం

# భవిత కోసం బాలసాహిత్యం

బాలల దినోత్సవ ప్రత్యేక వ్యాసం



డా॥ అమ్మిన శ్రీనివాస రాజు
77298 83223

గతం అనే పునాది ఎంత పటిష్టంగా ఉంటుందో, వర్తమానం అనే భవనం అంత దృఢంగా ఉంటుంది,

అప్పుడే భవిష్యత్ అనే భవనపు పైకప్పు అంతే బలంగా అందంగా ఉండగలదు.

అచ్చంగా అలాంటి ఉదాహరణకు అన్వయించ దగ్గది, మన సమాజ ఆరోగ్యానికి, హితానికి, అవసరమైన సాహిత్యం కూడా, ప్రతి భాషా సాహిత్య సౌధానికి పునాది ఆ భాషా సాహిత్యపు “బాల సాహిత్యమే”!!

ఇక తెలుగు భాషా సాహిత్యం విషయానికి వస్తే దీనిదో విశేషమైన ప్రస్థానం, 1930 నుంచి 1945 మధ్య కాలంలో మన తెలుగు బాల సాహిత్యం ఎక్కువగా మౌఖికంగా అమ్మమ్మ నాన్నమ్మ తాతయ్యలు తమ అనుభవాలు ఊహాలు జోడించి ఆశువుగా చెప్పి, పాడించిన, కథలు పాటలు రూపంలో ఉండేది.

అక్షరాస్యత తక్కువగా ఉన్న ఈ నాటి సమాజంలో అక్కడక్కడ కొన్ని పత్రికల్లో బాల సాహిత్యానికి చెందిన కథలు, గేయాలు, కనిపించేవి. అలాగే పాఠ్య పుస్తకాల్లో కూడా అరకొర స్థానం ఉండేది.

ఇలాంటి సందర్భంలో నాటి నైజాం రాజ్యంలో భాగమై, ఉర్దూ భాష అధికార భాషగా చలామణిలో గల కాలంలో 1930- 1935 సంవత్సరాల మధ్య, హన్మకొండలోని నయీంనగర్ నుంచి “కంభంపాటి అప్పన్న శాస్త్రి” సంపాదకత్వంలో “పూలతోట” అనే బాలల పత్రిక వెలువడి అలనాటి పాఠకుల ఆదరణ పొందింది.

కారణాలు ఏమైనా కావచ్చు కానీ .. దీని కృషి కాలగర్భంలో కలిసిపోయి చరిత్రలో స్థానం సంపాదించు కోలేదు, 1940లో విజయవాడ నుంచి “మేడిచర్ల ఆంజనేయులు” సంపాదకత్వంలో వచ్చిన “బాలకేసరి” తొలి తెలుగు బాల పత్రికగా పరిశోధక విద్యార్థులం నమోదు చేసుకున్నాము. పరిశోధన ప్రమాణాలకు సంబంధించిన ఆధారాలు లభ్యం కాని పరిస్థితుల్లో ఇలా కొన్ని చరిత్రలో స్థానం పొందకపోవడం సర్వసాధారణం.

బాల్యంలోనే సృజనాత్మకత పరిధిని మరింత పెంచాలనే సంకల్పంతో బాల వికాసం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడు అందరిచేత రేడియో అన్నయ్యగా పిలువబడ్డ న్యాయపతి రాఘవరావు 1945 ఆగస్టు 15 నుంచి మద్రాసులో బాల అనే పేరుతో పిల్లల మాస పత్రిక ప్రారంభించి అంతకుముందున్న నామమాత్రపు పిల్లల పత్రికలకు ధీటుగా అంకితభావంతో బాల పత్రిక నిర్వహిస్తూ 1983 వరకు ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంటూ 38 సంవత్సరాల పాటు నిర్విఘ్నంగా నడిపించడమే కాదు, ఎందరో రచయితలకు ప్రోత్సాహాన్ని అందించారు.

“బాల” పత్రిక స్ఫూర్తితో 1946 నుంచి వెలువడిన “చందమామ” పిల్లల మాసపత్రిక తనకుగల ఆర్థిక పుష్టి కొద్దీ రంగురంగుల వర్ణచిత్రాలతో చేయి తిరిగిన రచయితలు సంపాదకులుగా ఉండి, అద్భుత, వినోదాల, మేలు కలయికతో అలనాటి తెలుగు సమాజపు ఆబాలగోపాలాన్ని అలరించింది. బాల సాహిత్యమంటేనే చందమామ అనే స్థాయికి చేరింది, దానిని నిర్వహించిన కొడవటిగంటి కుటుంబరావు, దాసరి సుబ్రహ్మణ్యం, వంటివారు తమ తమ రచనా నైపుణ్యాలతో పాఠకులను ఆకర్షించే తీరుగా అందులో రచనలు చేసేవారు.

అసలే బాల రచయితలు ఎక్కువగా లేని నాటి కాలంలో ఉన్న కొద్ది మంది రచయితల రచనలు కూడా పత్రికా సంపాదకుల శైలిలో కలిసిపోయేవి, 1946 -1996 మధ్యకాలపు అర్థ శతాబ్ది కాలం మొత్తం బాల సాహిత్య వాతావరణం రంగులమయంగా ఉండి, పాఠకుల సంఖ్య విపరీతంగా పెరిగినా, రచన వారసత్వానికి కారకులైన కొత్త రచయితలు ఆశించినంతగా తయారు కాలేదు. దీనివల్ల బాల సాహిత్యానికి పెద్దలోటు, నష్టం కూడా జరిగింది.

అలాంటి వేళ తెలుగు బాలసాహిత్యం

వ్యాసం

చేసుకున్న పుణ్యం కొద్దీ 1996లో కొత్తగా ప్రారంభమైన "వార్త దినపత్రిక"లో అదే ఏడాది ఫిబ్రవరి నుంచి "మొగ్గ" శీర్షిక మొదలు కావడం దానిని రేడియో అన్నయ్య శిష్యుడు "టి. వేదాంత సూరి" నిర్వహించడంతో తెలుగు బాల సాహిత్యానికి కొత్త వైభవం వచ్చింది.

తెలుగు బాల సాహితీ కారులకు గతంలో నెలకో మారు బాలసాహిత్యం అందితే. "వార్త-మొగ్గ " ద్వారా ప్రతిరోజు బాల సాహిత్య పరిమళాలు తెలుగు నేల నలుదిశలా వ్యాపించాయి.

"మొగ్గ "ప్రారంభమయ్యే నాటికి తెలుగు బాల రచయితల సంఖ్య పదుల్లోనే ఉంది, అటువంటి సంఖ్యను ప్రస్తుతం వంద పైచిలుకు దాకా పెంచిన ఘనత వార్త మొగ్గ కే దక్కుతుంది.

ఎన్నో విభిన్నమైన శీర్షికలతో వెలువడిన ఈ మొగ్గ విదేశాల్లోని తెలుగువారు సైతం తెలుగు నేర్చుకోవడానికి దోహదపడింది ఎందరో తెలుగు బాల సాహితీ వేత్తలు తయారవడానికి నిత్య వేదిక అయింది, 2012 వరకు సూరి చేతుల్లో ఈ "మొగ్గ" నిత్యకళ్యాణం పచ్చతోరణంగా పరుగులు తీసింది... ప్రస్తుతం తన నడక వేగం తగ్గినా ప్రయాణం కొనసాగుతూ మరికొన్ని దినపత్రికలు బాలసాహితీ పేజీలను అందించడానికి ఆదర్శంగా నిలిచింది.

తెలుగు బాలసాహిత్యం తన ప్రస్థానాన్ని పత్రికల సాయంతో కొనసాగిస్తున్న వేళ, తెలుగు ప్రాంతంలోని ఏ విశ్వవిద్యాలయం చేయని గొప్ప పనిని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం చేసింది. 2000 సంవత్సరం నుంచి బాలసాహిత్యంలో రచయితల రచనలను ప్రోత్సహించటం ద్వారా తెలుగుబాల సాహిత్య వికాసం జరగాలనే లక్ష్యంతో పురస్కారాలు ఇవ్వడం ప్రారంభించి, 2000 సంవత్సరంలో "వేజండ్ల సాంబశివరావు"కు తొలి బాల సాహిత్య పురస్కారం ప్రదానం చేసింది, ఇది తెలుగు బాల సాహిత్యానికి ఒక శుభపరిణామం.



ఈ బాల సాహితీవేత్తల ప్రోత్సాహక పరంపర రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదిగి, 2010 సంవత్సరం నుంచి కేంద్ర సాహిత్య పురస్కారాల్లో బాలసాహిత్యానికి చోటు లభించింది. "కలువకొలను సదానంద" తొలి పురస్కారం అందుకున్నారు.

అలా మొదలైన ఆధునిక తెలుగు బాల సాహిత్య ప్రయాణం జాతీయ స్థాయి పురస్కారంగా ఎదగడంతో అంతకు ముందు వరకు బాలసాహిత్యం అన్నా, బాలసాహితీ రచయితలు అన్నా, ఉన్న చిన్న చూపు పోయి, సమున్నత గౌరవంతో సాగుతున్న వేళ, కొందరు ప్రముఖ సాహితీవేత్తలు పురస్కారాల ముందుచూపుతో బాల సాహితీవేత్తలు అయిపోయారు, ఏదిఏమైనా పురస్కారాలపుణ్యాన, తెలుగు బాల సాహితీ క్షేత్రంలో రచయితల సంఖ్య, రచనల సంఖ్య, పుస్తకాల సంఖ్య, విపరీతంగా పెరిగింది, ఇది సంతోషించదగ్గ విషయం.

దీనికితోడు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో "బాల సాహిత్య కార్యశాలలు" నిర్వహిస్తూ..... విద్యార్థుల్లో సృజనాత్మ కతను ఒడిసిపట్టే గొప్ప పనులు మొదలయ్యాయి,

కొన్ని సంస్థలు, కొందరు ఉపాధ్యాయులు, ముందుకు వచ్చి ఆయా విద్యార్థి రచయితల రచనలు పుస్తకాల రూపంలో ప్రచురిస్తూ బాలలను ప్రోత్సహిస్తూ తెలుగు బాల సాహిత్య కృషిని చరిత్ర గతం చేస్తున్నారు. ఒకప్పుడు పత్రికలు అందించిన ప్రోత్సాహాన్ని ప్రస్తుతం వ్యక్తులు అందిస్తున్నారు, నేటి ఆధునిక బాలల లోకంలో అద్భుతమైన సృజనాత్మక శక్తిగల పిల్లలకు కొదవలేదు.

కానీ ఆ సృజనాత్మక సంపదను వెలికి తీసే పరిస్థితులు, గురువులు, పరిమితం

అయిపోయాయి. ఇది విస్తరించాల్సిన అవసరం చాలా ఉంది.

పొరుగు రాష్ట్రాల్లోని పాఠ్యభాగతయారీ విభాగాలు తెలుగు బాల సాహితీవేత్తల రచనలను ఆయా రాష్ట్రాలలో తెలుగు విద్యార్థులకు పాఠ్యాంశాలుగా ఎంపిక చేసుకుంటున్నారు, ఇది కూడా ఒక గొప్ప పరిణామం. ఇలాంటి పాఠ్యభాగ ఎంపికల్లో చాలామంది తెలుగు సాహితీవేత్తల రచనలకు చోటు లభించడం ఒక విశేషం అయితే, 2015 లో కరీంనగర్ జిల్లా ముస్తాబాద్ లో జరిగిన బాలసాహిత్య కార్యశాల లో శిక్షణ పొందిన "లోకం భానుప్రసాద్" వ్రాసిన "సేంద్రియ వ్యవసాయం" కథ మహారాష్ట్ర తెలుగు పాఠ్యభాగం సరళ భారతి లో చోటు దక్కించుకుంది అంటే తెలుగునాట బాల సాహితీ కార్యశాల కృషి ఏమిటో అర్థమవుతుంది.

చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ పక్షాన బాల చెలిమి గ్రంథాలయ నిర్వాహకులు" మణికొండ వేదకుమార్ బాల సాహిత్య రచనల ముద్రణ ఒక యజ్ఞంగా కొనసాగిస్తూ తెలుగు బాల సాహిత్య అభివృద్ధికి తోడ్పాటు ఇస్తుండగా, గిరిపల్లి అశోక్, పురిమళ్ల సునంద, బైతి దుర్గయ్య, వంటి ఎందరో ఉపాధ్యాయులు తమ విద్యార్థులను రచయితలుగా తీర్చిదిద్దటంలో విశేషంగా కృషి చేస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఆధునిక బాలసాహిత్యంలో వర్తమానం అద్భుతంగా ఉన్నా ఆరోగ్యంగా లేదనే చెప్పాలి... ప్రౌఢ సాహిత్యం కన్నా బాధ్యతాయుతమైనది, పవిత్రమైనది ఈ బాలసాహిత్యం, అసలు బాల సాహిత్యం లేకపోతే ప్రౌఢ సాహిత్యమే లేదు, నేటి ప్రముఖ సాహితీవేత్తలు అంతా ప్రారంభంలో బాల సాహిత్య రచనలు చేసిన వారే...!! ఆదరణ దృష్ట్యా వారంతా ప్రౌఢసాహిత్య రచనల్లోఒదిగిపోయారు.

ఎంతో బాధ్యతాయుతమైన ఈ బాల సాహితీవేత్తల రచనలు గాని, ప్రచురణలు గాని ఆదర్శనీయంగా ఉండాలి, పాతకాలం నాటి కథలని, నడకలు మార్చి కొత్తగా వ్రాయడం, యథావిధిగా తిరగమోత వేయడం, వంటి చౌకబారు పనులు పక్కన పెట్టి, తాము కథ ఎవరిని ఉద్దేశించి వ్రాస్తున్నామో తెలుసుకోవాలి, భాషా పుష్టి పెంచుకోవాలి, తమకు తోచిందే రచన అనుకునే ధోరణి నుంచి పక్కకు రావాలి, రచనల సంఖ్య పరంగా అవార్డులు, రికార్డులు, సాధించాలి అన్న ఆలోచన నుంచి మన రచనల ద్వారా పాఠకుల మనసులో స్థానం పొందడానికి ప్రయత్నం జరగాలి.

నిరంతరం అధ్యయనం నిత్య పరిశీలన చేసిన నాడే గొప్ప బాల సాహిత్యాన్ని భవిష్యత్ తరాలకు అందించగలం. ఆ స్థాయిలో మన బాధ్యతాయుతమైన బాల సాహితీవేత్తల కృషి జరగాలని కోరుకుందాం.

**(నవంబర్ 14, బాలల దినోత్సవ సందర్భంగా...)**

## రచయితలకు సూచనలు

- ✓ సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు విధిగా రెండు కాపీలు పంపాలి.
- ✓ పత్రిక కోసం రచనలు పంపించే వారు యునికోడ్‌లో ఉంటే ఓపెన్ ఫైల్ మరియు పిడిఎఫ్‌లో మెయిల్ చేయండి.
- ✓ మా పత్రికకు రచనలు పంపినవారు ఇక్కడ అచ్చయాకనే ఫేస్ బుక్‌లో బ్లాగ్‌లో పెట్టండి.
- ✓ ప్రతి రచనకు ఇది ఎక్కడా ప్రచురణ కాలేదని, ఏ బ్లాగ్‌లో పోస్ట్ చేయలేదని, ప్రచురణ ప్రసారం కోసం ఎవరికీ పంపి ఉండలేదని హామీ పత్రం జత చేయండి.
- ✓ పత్రికలో ఒక కథ లేదా వ్యాసానికి నాలుగు పేజీలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన పదమూడు వందల పదాలకు మించకుండా వ్యాసం, కథ పంపించండి.
- ✓ కవితలు 15 పాదాలకు మించకుండా పంపించండి.
- ✓ వ్యాసాలు, కథలు, కవితలు ఏవైనా పోస్ట్‌లో కూడా ఈ క్రింది చిరునామాకు లేదా ఇ-మెయిల్‌కు పంపవచ్చు.
- ✓ ప్రచురణకు స్వీకరించిన రచనల్ని పత్రికనుగుణంగా మార్పు చేసుకునే హక్కు సంపాదకవర్గం కలిగి ఉంటుంది.

**తెలంగాణ జాగృతి**

పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్థు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర, అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in

సాహితీ సమాచారం

# ఘనంగా తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారాల ప్రదానోత్సవం



తెలుగు విశ్వవిద్యాలయం 2018వ సంవత్సరానికి గాను అందించిన పురస్కారాల ప్రదానోత్సవం అక్టోబర్ 29న విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. కార్యక్రమ ప్రారంభకులుగా విచ్చేసిన పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారం అంటే నిఖార్సయిన ప్రతిభకు కీర్తి కిరీటం అని అభివర్ణించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మణిపూర్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఛాన్సలర్, ఉస్మానియా విశ్వవిద్యాలయ పూర్వ ఛాన్సలర్ ఆచార్య తిరుమల రావు మాట్లాడుతూ కవులను రచయితలను ప్రోత్సహించడం భావితరాలకు గొప్ప సారస్వత మధురిమలను అందించడమేనని అన్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా విచ్చేసిన ప్రముఖ కవి, మేడ్చల్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి మాట్లాడుతూ బహుమతులు కవుల, రచయితల జీవితంలో ఎంత ప్రభావాత్మకమయినవని సోదాహరణంగా వివరించారు. సభాధ్యక్షులు తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య టి కిషన్ రావు మాట్లాడుతూ ప్రతిభా యోగ్యత కలిగిన కవులు, రచయితలను శాస్త్రీయ పద్ధతిలో అన్వేషించి పురస్కారాలను అందజేయడం గర్వకారణంగా ఉందని అన్నారు. వచన కవిత ప్రక్రియలో "కల ఇంకా మిగిలి ఉంది" కావ్యకర్త తంగేడు పత్రిక సహ సంపాదకులు కాంచనపల్లి గోవర్ధన్ రాజుకు తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం ప్రదానం చేశారు. పద్య కవితా ప్రక్రియలో "శ్రీ కృష్ణదేవరాయ విజయ ప్రబంధం" రచయిత మొవ్వ వృషాద్రిపతి, బాల సాహిత్య ప్రక్రియలో "పాటల పల్లకి" రచయిత సామెలేటి లింగమూర్తి, కథానిక ప్రక్రియలో "ఖాకీ కలం" రచయిత రావులపాటి సీతారామారావు, నవల ప్రక్రియలో "కొంగవాలు కత్తి" రచయిత డాక్టర్ గడ్డం మోహన్ రావు, సాహిత్య విమర్శ ప్రక్రియలో "సీమ కథ అస్తిత్వం" రచయిత డాక్టర్ కిన్నెర శ్రీదేవి, నాటక ప్రక్రియలో "అశ్వరథఖశ్వరథ " రచయిత ఎస్ ఎస్ నారాయణ బాబు, అనువాద విభాగంలో "అశుద్ధ భారత్" రచయిత కె.సజయ, వచన రచన విభాగంలో "హైదరాబాద్ నుండి తెలంగాణా దాకా" రచయిత లక్ష్మణరావు పతంగె, రచయిత్రి ఉత్తమ గ్రంథం విభాగంలో "రేలపూలు" రచయిత్రి సమ్మెట ఉమాదేవిలకు పురస్కారాలను అందజేశారు.

**రిపోర్ట్ : ఘనపురం దేవేందర్**

## వైభవంగా జానపద పురస్కారాల ప్రదానం

తెలుగు జానపద సాహిత్య పరిషత్ 49వ వార్షికోత్సవం సందర్భంగా అవార్డుల పురస్కారం అక్టోబర్ 31వ తేదీ హైదరాబాద్ కృష్ణ సింధూరి సంకల్ప లలిత కళా నిలయంలో సంస్థ అధ్యక్షులు డాక్టర్ సి వసుంధరా రెడ్డి అధ్యక్షతన ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య కిషన్ రావు మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన జానపద సాహిత్యం చాలా గొప్పదని ఆ రంగంలో కృషి చేసిన పరిశోధకులకు, కళాకారులకు అవార్డులు అందించడం చాలా అభినందించదగిన విషయమని అన్నారు. అవార్డు విజేతలను ఆయన అభినందించారు. ఆచార్య బిరుదురాజు రామరాజు జానపద విజ్ఞాన బహుమతిని, ప్రముఖ జానపద పరిశోధకులు డాక్టర్ కె. ముత్యంకు బహూకరించారు. నాయని కృష్ణకుమారి జానపద కళా బహుమతిని, ఉరుము ఆదినారాయణకు, చింతపల్లి వసుంధరా రెడ్డి జానపద విజ్ఞాన సాఫల్య పురస్కారాన్ని, ఆచార్య పి. నర్సింహా రెడ్డికి, వసుమతి రెడ్డి స్మారక జానపద కథా గాన పురస్కారాన్ని, బద్రి కూర్మారావుకు, అరుణ రెడ్డి జానపద సాహిత్య పురస్కారాన్ని, శశిరేఖ రెడ్డిలకు ప్రదానం చేసి అభినందించారు.



## జాతీయ స్థాయి బాలల కథల పోటీ నిర్వహిస్తున్న పురిమళ్ళ ఫౌండేషన్

విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు, సమాజహితం కోరి ప్రస్తుత పరిస్థితుల నేపథ్యాన్ని అనుకూల, ప్రతికూల అంశాలను అవగాహన చేసుకునేలా, ఆలోచింప జేసేలా మెరుగైన సాహిత్యం రాసే వారిని తీర్చిదిద్దే నేపథ్యంలో జాతీయ స్థాయి బాలల కథల పోటీని పురిమళ్ళ ఫౌండేషన్ నిర్వహిస్తున్నది.

ఇందులో పాఠశాల స్థాయి విద్యార్థిని, విద్యార్థులు పాల్గొనవచ్చు. కథలు ఏ4 సైజులో 2 పేజీలకు మించ కుండా సామాజిక నేపథ్యం, నీతి తెలియజెప్పేలా కథా వస్తువు ఉండాలి. కథకు హామీ పత్రాన్ని జతరుస్తూ పేరు, పాఠశాల పేరు, తరగతి, చిరునామా, ఫోన్ నెంబరు రాయాలి.

20 ఉత్తమ కథలను ఎంపిక చేసి విజేతలకు నగదు బహుమతి రూ. 10,000 మరియు ప్రశంసా పత్రాన్ని అందజేయడము జరుగుతుంది. కథలు పంపాల్సిన చిరునామా : భోగోజు ఉపేందర్ రావు, ఇ.నెం. 11-10-694/5, బురహాన్‌పురం, ఖమ్మం - 507 002. సెల్ : 9494773969కు పంపగలరు. చివరి తేది 30 నవంబర్ 2021

స్వీ
కా
రం




## కరోనా నానీలు

చలపాక ప్రకాష్
ఫోన్ : 92474 75975

**విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**
విజయవాడ
వెల : రూ. 40/-




## ఫిరంగిదళం (మొగ్గలు)

డా॥ భీంపల్లి శ్రీకాంత్
సెల్ : 90328 44017

**పాలమూరు సాహితి**
మహబూబ్‌నగర్
వెల : రూ.30/-




## కొత్త వేకువ

పద్మావతి రాంభక్త
ఫోన్ : 99663 07777

**పాలపిట్ట బుక్స్**
హైదరాబాద్
వెల : రూ. 100/-




## తెలంగాణ అక్షరాలు

నమిలికొండ బాలకిషన్ రావు
సెల్ : 98493 82399
నల్లగొండ

ప్రసారిక
వెల : రూ. 100/-




## మా కనపర్తి ముషాయిరా

రమేశ్ చెప్పాల
ఫోన్ : 98490 73163

**రూపసి ప్రచురణ**
హైదరాబాద్
వెల : రూ. 200/-




## స్వేచ్ఛాగానం

కరిపె రాజ్‌కుమార్
ఫోన్ : 8125144729

**పాలపిట్ట బుక్స్**
హైదరాబాద్
వెల : రూ. 150/-




## నేత మొగ్గలు

పులి జమున
సెల్ : 8500169682

**పాలమూరు సాహితి**
మహబూబ్‌నగర్
వెల : రూ.30/-




## నీలో నేను

పులి జమున
సెల్ : 8500169682

**పాలమూరు సాహితి**
మహబూబ్‌నగర్




## రెండొకట్ల పదకొండు

సుభాషిణి తోట
ఖమ్మం
సెల్ : 9502818774
వెల : రూ.120/-




## పద్మశాలి మొగ్గలు

డా॥ భీంపల్లి శ్రీకాంత్
సెల్ : 90328 44017

**పాలమూరు సాహితి**
మహబూబ్‌నగర్
వెల : రూ.30/-


బాలల దినోత్సవ శుభాకాంక్షలు
(నవంబర్ 14)